మార్చి
2016

119

సంపుటి : 10 సంచిక : 10 వెల రు. 10 /-

## ఈ సంచికలో........

అంబేద్కర్ ఆలోచనలు - సమకాలీన ప్రాధాన్యత
పోరాట యోధుడు కామ్రేడ్ నూరుల్ హుడా
'హిందూత్వ' ప్రాజెక్టు
రోహిత్ వేముల మరణానికి దారితీసిన పరిణామాలు
ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్ర
యెమెన్ విషాదం సామ్రాజ్యవాదుల పాపం
చైనా గ్రామంలో సోషలిస్టు సహకార ఉత్పత్తి-పంపకం
లెనిన్ ప్రసిద్ధ వ్యాసం (కరపత్రం) : ముంచు కొస్తున్న ముప్పు దాన్ని ఎదుర్కోవడం ఎలా?
మతోన్మాదానికి మతంతో సంబంధం లేదు...

స్ఫూర్తి


# పోరాట యోధుడు కామ్రేడ్ నూరుల్ హుడా

విజూకృష్ణన్

స్థిరచిత్తం, నమ్రత, హుందాతనం కలగలసిన స్వరూపమే కామ్రేడ్ నూరుల్ హుడా! వృద్ధాప్యం వలన ఏర్పడిన స్వల్ప అస్వస్థత అనంతరం 2015, డిసెంబర్ 17వ తారీఖున భౌతికంగా తరలివెళ్ళిపోయిన వృద్ధ సింహం. 86 సంవత్సరాల జీవితకాలంలో దాదాపు ఏడు దశాబ్దాల సుదీర్ఘ కాలాన్ని కమ్యూనిస్టు ఉద్యమానికే అంకితం చేసి, పీడిత, తాడిత ప్రజల దాస్య విమోచనం కోసం పోరాటం చేస్తూ ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపిన నిరాడంబర నేత. మార్క్సిజం-లెనినిజానికి కట్టుబడి, అంతిమశ్వాస వరకూ పార్టీ, కిసాన్ సభల్లో ఎన్నెన్నో బాధ్యతలను, సమర్థవంతంగా నిర్వర్తించిన కార్యశీలి.

అస్సాం రాష్ట్రం సిల్చార్ జిల్లా, దాలూగ్రామ్ గ్రామంలో ధనిక ముస్లిం దంపతులు మొహమ్మద్ ఆలీ, అయేషాల మూడవ సంతానంగా 1930వ సంవత్సరం మార్చి 13న నూరుల్ హుడా జన్మించారు. తండ్రి బ్రిటీష్ ప్రభుత్వంలో మేజిస్ట్రేట్ కావడం వలన నూరుల్ హుడా బాల్యం, ప్రాథమిక విద్య గౌహతిలోనూ, సిల్‌హెట్ (ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో), సిల్చార్‌లలో నడిచింది. 1946లో సిల్చార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పరీక్ష ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయిన తర్వాత, కలకత్తాలోని సెయింట్ జేవియర్ కాలేజీలో చేరారు నూరుల్. 1948వ సంవత్సరంలో సైన్స్ విభాగంలో ఇంటర్మీడియట్ ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడై జాదవ్‌పూర్‌లోని "కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ"లో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో చేరారు. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలోనే విద్యార్థి ఉద్యమంవైపు ఆకర్షింపబడ్డ నూరుల్ 1948వ సం॥ ఆగస్టులో ఏఐఎస్ఎఫ్‌లో చేరారు. అక్కడే కమ్యూనిస్టు ఉద్యమ నాయకులతో పరిచయం ఏర్పడింది. 1949లో పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. సచిన్‌సేన్, ప్రశాంతసుర్, సిబూసెన్, సుకుమార్ రామ్ మొదలగు వారితో కలిసి 1949లో జాదవ్‌పూర్ మిస్త్రీ పరాలేన్‌లో సిపిఐని స్థాపించారు.

ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ కలకత్తాని దర్శించినప్పుడు రాష్ట్రంలోనూ, జాతీయస్థాయిలోనూ, కాంగ్రెస్ ప్రభుత్వం



అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ప్రతిఫలం 1949లో విద్యార్థి నాయకుడిగా తొలి అరెస్టు. ప్రెసిడెన్సీ జెయిల్‌లో నాలుగు వారాలున్నప్పటికీ, తన పంథాను వీడని నూరుల్, రాజకీయాలతో మరింత అనుబంధం పెంచుకున్నారు. ఆనాటి ముఖ్యమంత్రి డాక్టర్ బి.సి. రాయ్ జాదవ్‌పూర్‌ని సందర్శించినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టి 1950 జనవరిలో మరోసారి అరెస్టు చేయబడ్డారు. ఆలీపూర్ సెంట్రల్ జెయిల్‌లో రెండు నెలలున్న తర్వాత, శిక్ష ఖరారు అయ్యి, మరో ఐదు నెలలు అదే జైలులో, 1951 వరకూ గడిపారు. ఈ డిటెన్షన్ వలన విలువైన ఓ విద్యా సంవత్సరం కోల్పోయారు.

ఆకర్షణీయమైన వ్యక్తిత్వం, విద్యార్థుల సమస్యల పట్ల, ప్రజా సమస్యల పట్ల అవగాహన ఉన్న నూరుల్ హుడా విద్యార్థి నాయకుడిగా ఎదగడం చాలా సహజంగా, అతి వేగంగా జరిగిపోయింది. తత్ఫలితమే 1952-53 విద్యా సంవత్సరంలో ఏఐఎస్ఎఫ్ బ్యానర్‌పై పోటీచేసి, జాదవ్‌పూర్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థి సంఘానికి కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. 1953 సంవత్సరంలో ఇంజనీరింగ్ డిగ్రీని పొందిన నూరుల్ 1954 సంవత్సరంలో బెంగాల్ ప్రొవిన్షియల్ స్టూడెంట్స్ ఫెడరేషన్‌కి సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. అదే సంవత్సరం "ఉపాధ్యాయ ఉద్యమం"లో పాల్గొన్నందుకు అరెస్టు చేయబడి "డమ్ డమ్ సెంట్రల్ జైల్"లో సుమారు నెల రోజులు గడిపారు.

కలకత్తాలోని, కిద్దర్‌పూర్ ప్రాంతంలో 1954వ సంవత్సరంలో "మెషినరీ మాన్యుఫ్యాక్చరర్స్ కంపెనీలో ఓ సంవత్సరం శిక్షణ పొంది, పరిపూర్ణమైన మెకానికల్ ఇంజనీర్‌గా రూపొందారు నూరుల్ హుడా!

1955లో కోల్‌కతాలోని "స్టీవార్ట్స్ అండ్ లాయిడ్స్ కంపెనీ"లో పనిచేసి, 1956లో "క్రైసర్ ఇంజనీర్స్"లో చేరారు. టాటా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీకి రెండు మిలియన్ టన్నుల కాంట్రాక్ట్‌ని ఓ అమెరికన్ కంపెనీ ఇచ్చిన కారణంగా వృత్తిరీత్యా జంషెడ్‌పూర్ చేరారు. తన భావి జీవిత భాగస్వామి "చబ్బీఘోష్"ని కలిసిందక్కడే! ట్రేడ్ యూనియన్ లీడర్‌గా ఖ్యాతిగాంచి, తదనంతరం కాంగ్రెస్‌పార్టీ తరఫున జంషెడ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడిగా వ్యవహరించిన "మణీంద్రకుమార్ ఘోష్" కుమార్తె ఆమె. భావాలు కలిసిన నూరుల్ హుడా, చబ్బీఘోష్ 1962వ సం॥ సెప్టెంబర్‌లో జీవన సహచరులయ్యారు.

1960-66 మధ్యకాలంలో కోల్‌కతాలోనూ, పరిసర ప్రాంతాల్లోని అనేకానేక ఇంజనీరింగ్ సంస్థలలో కామ్రేడ్ నూరుల్ హుడా పనిచేశారు. అదే కాలంలో సాయంత్రం కాలేజీలో న్యాయశాస్త్రం చదివి "సురేంద్రనాథ్ లా కాలేజి" నుండి 1966లో ఎల్ఎల్‌బి డిగ్రీ స్వీకరించారు.

1964వ సం॥లో సిపిఐ (ఎం) ఏర్పడినప్పుడు పార్టీనంటిపెట్టుకొని దృఢంగా నిలబడ్డారు. పార్టీ నిర్ణయం ప్రకారం, 1966వ సం॥ ఆగస్టులో ఉద్యోగాన్ని వదిలేసి సిల్చార్‌లో పార్టీ నిర్మాణం కోసం తరలివెళ్ళారు. జిల్లా బార్ అసోసియేషన్‌లో 1966లోనే అధికారికంగా సభ్యత్వం స్వీకరించి న్యాయవాదిగా నమోదు అయినప్పటికీ, కిసాన్ సభను నిర్మించడానికే పూర్తికాలం వెచ్చించారు. అవిభాజ్య "కచార్" జిల్లాలో గోపెన్ రాయ్ అచింత భట్టాచార్య, డిజేన్ సేన్ గుప్తా, బేరేన్ మిశ్రా, ద్విజేన్ సేన్ గుప్తా, రుక్మిణీ ఆచార్య లాంటి కమ్యూనిస్టు యోధుల సాహచర్యం లభించింది. నిస్వార్థంగా తమను తాము సమాజానికి అంకితం చేసుకున్న ఆ మహామహులతో కలిసి పనిచేయడం ఓ సుకృతంగా భావించేవారు నూరుల్ హుడా! అందువలననే, ఎన్ని అవరోధాలెదురైనా, కిసాన్ ఉద్యమాన్ని సమర్థవంతంగా నడిపించగలిగారు. "సుర్మాలోయ ఉద్యమం" ఎప్పటికీ ఓ ఉత్తేజకర సంఘటనే అనేవారు.

1967 అసెంబ్లీ ఎన్నికలలో లాఖీపూర్ నియోజకవర్గం నుంచీ, సిపిఐ (ఎం) బలపరిచిన స్వతంత్ర అభ్యర్థిగా నూరుల్ హుడా పోటీచేశారు. ఆ ఎన్నికలలో పరాజయం పొందినప్పటికీ, లాఖీపూర్‌లో పార్టీ నిర్మాణానికి, ప్రజలను సమీకరించడానికి ఎంతగానో దోహద

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. **పోరాట యోధుడు కామ్రేడ్ నూరుల్ హుడా**
   విజూ కృష్ణన్ .................. 2
2. **అంబేద్కర్ ఆలోచనలు - సమకాలీన ప్రాధాన్యత**
   బి.వి. రాఘవులు .............. 4
3. **'హిందూత్వ' ప్రాజెక్టు**
   ఎస్. వెంకట్రావు ............... 7
4. **రోహిత్ వేముల మరణానికి దారితీసిన పరిణామాలు**
   కునాల్ శంకర్ ............... 10
5. **ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్ర**
   సి.పి. చంద్రశేఖర్ ............ 16
6. **యెమెన్ విషాదం సామ్రాజ్యవాదుల పాపం**
   విజయప్రసాద్ ................ 19
7. **చైనా గ్రామంలో సోషలిస్టు సహకార ఉత్పత్తి-పంపకం**
   కారల్ రాట్నర్ ................. 21
8. **లెనిన్ ప్రసిద్ధ వ్యాసం (కరపత్రం) : ముంచుకొస్తున్న ముప్పు దాన్ని ఎదుర్కోవడం ఎలా?**
   ఎన్‌విఎస్ నాగభూషణ్ .............. 25
9. **మతోన్మాదానికి మతంతో సంబంధం లేదు...**
   బి.వి. రాఘవులు............... 33



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ :** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్,
ప్లాట్ నెం 21/1, అజామాబాద్, హైదరాబాద్-20
**ఫోన్: ఎడిటోరియల్ 0866-2573822**
**మేనేజర్: 040-27673787**
EMail: svenkatarao_1958@yahoo.com
visit cpi(m) site at : cpim.org


# ఉద్రిక్త ప్రపంచం

గడచిన రెండు ప్రపంచ యుద్ధాల ముందు అంతర్జాతీయ పరిస్థితులు ఎలా ఉన్నాయో నేడు కూడా దాదాపు అవే పరిస్థితులు ఈ భూగోళం మీద ఆవిష్కృతమవుతున్నాయి. ఆర్థిక మాంద్యం, దాని వల్ల పెరిగిన నిరుద్యోగం, పేదరికం, అసమానతలు... కుంచించుకుపోయిన మార్కెట్లకోసం దేశాల మధ్య పోటీ, కూటముల ఏర్పాటు...దేశదేశాల్లో అశాంతి, కల్లోలం చివరకు నిరంకుశ శక్తులు ప్రబలడం, యుద్ధానికి దారితీయడం ఇవీ రెండు ప్రపంచ యుద్ధాలకు ముందు జరిగిన ఘటనా పరంపర. మొదటి యుద్ధం జరిగి శతాబ్దం, రెండో యుద్ధం జరిగి ఏడు దశాబ్దాలు దాటాయి. రెండు యుద్ధాల తరువాత ఏర్పడిన ప్రపంచ సోషలిస్టు వ్యవస్థ నిన్నటి వరకు యుద్ధాలకు చెక్‌మేట్‌గా పనిచేసింది. కానీ ఆ వ్యవస్థ కుప్పకూలిపోయి సామ్రాజ్యవాద శక్తులు మళ్లీ పైచేయి సాధించడంతో మరోసారి ప్రపంచం నిండా యుద్ధనాదాలు మోగుతున్నాయి.

సోవియట్ బ్లాక్ పతనంతో వార్సా యుద్ధ కూటమి రద్దయింది. కానీ సామ్రాజ్యవాద యుద్ధకూటమైన నాటో మాత్రం కొనసాగడమే కాదు మరింతగా విస్తరిస్తోంది. తూర్పు యూరప్ దేశాలను కలుపుకుంటూ ముందుకు సాగిన నాటో కూటమి, రష్యాను దెబ్బతీసే ఉద్దేశంతో పూర్వపు సోవియట్ రిపబ్లిక్కుల వరకు విస్తరించడానికి చేస్తున్న ప్రయత్నాలే ఉక్రెయిన్‌లో అంతర్యుద్ధానికి దారితీశాయి. ఉక్రెయిన్‌లో నాటో-రష్యాలమధ్య ప్రచ్ఛన్న యుద్ధం ఏనాడైనా భగ్గుమనే అవకాశం ఉంది. దక్షిణ చైనా సముద్రంలో వియత్నాం, ఫిలిప్పీన్స్, చైనాల మధ్య, పసిఫిక్ సముద్రంలో జపాన్, చైనాల మధ్య కొన్ని దీవుల విషయమై చారిత్రకంగా నెలకొన్న వివాదాన్ని అంతర్జాతీయ సమస్యగా మార్చి చైనా చుట్టూ సైనిక ఉచ్చు బిగించడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలు ఆసియా ఖండంలో కుంపటి రాజేస్తున్నాయి. మధ్య ఆసియాలో తమకు నచ్చని ప్రభుత్వాలను మార్చేందుకు సామ్రాజ్యవాదం చేస్తున్న కుట్రలే సిరియా రావణకాష్టానికి కారణం. నేడు సిరియా వేదికగా జరుగుతున్నది అంతర్యుద్ధం కాదు అమెరికా కూటమికీ, రష్యా ఇతర దేశాలకూ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం. దశాబ్దాల సామ్రాజ్యవాద ఆధిపత్యం కింద నలిగిపోయి వామపక్షాల పాలనకింద స్వావలంబన మార్గంలో నడుస్తున్న లాటిన్ అమెరికా దేశాల్లో తిరిగి సామ్రాజ్యవాద తొత్తులను ప్రతిష్టించేందుకు అమెరికా కూటమి అక్కడ కూడా కుంపట్లు రాజేస్తోంది.

ఒకవైపు ఏకధ్రువ ప్రపంచంలో తనకు ఎదురులేదనుకున్న అమెరికాకు అనేక వైపులనుండి ఆర్థిక, రాజకీయ సవాళ్లు ఎదురవుతున్నాయి. బహుళధ్రువ ప్రపంచం ఆవిష్కృతమవుతున్నది. దీన్ని నివారించడానికి సామ్రాజ్యవాదులు రానురాను మరింతగా సైనిక వ్యూహాలకు పదును పెడుతున్నారు. వాణిజ్య కూటములకు తోడు, సైనిక కూటములను బలోపేతం చేస్తున్నారు. అనేక విధాలా కవ్వింపులకు పాల్పడుతున్నారు. దురదృష్టమేమంటే ఆసియా కేంద్రంగా సామ్రాజ్యవాదం పన్నుతున్న ఈ యుద్ధ వ్యూహంలో భారత దేశం అమెరికా జూనియర్ భాగస్వామిగా మారుతోంది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో రోజురోజుకూ దేశాల మధ్య యుద్ధ సన్నాహాలు పెరగడం ఆందోళన కరమైన విషయం. యుద్ధ సన్నాహాలతోబాటే ఆయా దేశాల్లో యుద్ధోన్మాదం, ఆత్మహత్యలు, వలసవచ్చినవారిపై దాడులు, ఫాసిస్టు శక్తులు పెరుగుతున్నాయి. అమెరికాలోనూ, ప్రధాన సామ్రాజ్యవాద దేశాలల్లోనూ తీవ్రవాద ధోరణులు కలిగిన రాజకీయ నాయకులకు ప్రజల మద్దతు లభించడం ఈ క్రమంలో భాగమే. ఈ నేపథ్యంలో ప్రపంచంలోని అనేక దేశాల్లో కార్మికవర్గ పోరాటాలు బలోపేతం అవుతుంటే మరికొన్ని దేశాల్లో నిరంకుశ శక్తులు అధికారం చేజికించుకుంటున్నాయి. లెనిన్ చెపినట్లు సంక్షోభం యుద్ధ పరిస్థితులను సృష్టించినట్లే, విప్లవ పరిస్థితులనూ సృష్టిస్తుంది. వర్గ పోరాట స్థాయి అంతిమ ఫలితాన్ని నిర్దేశిస్తుంది. ఈలోగా యుద్ధానికీ, సామ్రాజ్యవాదుల యుద్ధ సన్నాహాలకూ వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచడం వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల కర్తవ్యం.


**చందా వివరాలు**


విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**

**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# అంబేద్కర్ ఆలోచనలు సమకాలీన ప్రాధాన్యత



రచయిత సిపిఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

బి.వి. రాఘవులు

డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ యొక్క వ్యక్తిత్వానికి సమకాలీన దేశ రాజకీయల్లో చాలా ప్రాధాన్యత వచ్చింది. ఇప్పుడు అందరు అంబేద్కర్ గురించి మాట్లాడుతున్నారు. రకారకాల దృక్పథాల నుంచి రకరకాలుగా అంచనాలు వేస్తున్నారు. అయన మౌలిక అలోచనలను తమ అవసరాలకు అనుగుణంగా కుదించి, వక్రీకరించి (కొంతమంది) ప్రచారం చేస్తున్నారు. అంబేద్కర్ జీవితానికి, ఆలోచనలకు ఈ సమయంలో ఎందుకు ఇంత ప్రాధాన్యత వచ్చింది? అంబేద్కర్ జీవిత కృషి ఎక్కువ భాగం స్వాతంత్ర్యానికి పూర్వం జరిగింది. ఆయన 1956లోనే చనిపోయారు. ఆయన జీవించిన కాలంలో అనేక మంది ఆయన భావాలను పూర్తిగా తిరస్కరించారు. ఆయన కృషిని వ్యతిరేకించారు. కాని అప్పుడు ఆయనను తిరస్కరించిన సంస్థలకు, భావాలకు వారసులుగా ఉన్నవారు ఇప్పుడు ఆయనను ఆకాశానికి ఎత్తి బ్రహ్మరథం పడుతున్నారు. నేడు దేశంలో అంబేద్కర్ భావాలకు, వ్యక్తిత్వానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చి చర్చించటానికి ఒక రాజకీయ చరిత్రక నేపథ్యం ఉన్నది.

జీవితకాలంలో గుర్తించకుండా అనంతర కాలంలో సమాజం తలకెత్తుకునే పరిస్థితి ఎంతో మంది మహావ్యక్తులకు తప్పలేదు. గురజాడ అభ్యుదయ సాహిత్యం రాసినప్పుడు ఆయన గురించి పెద్దగా పట్టించుకోలేదు. జాతీయ ఉద్యమ కాలంలో ప్రజా ఉద్యమాలు, వామపక్ష ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగిసిపడినా 1940 దశకంలోనే ఆయన భావాలు ప్రజల్లో బాగా వ్యాప్తి చెందాయి. కొన్ని సందర్భాల్లో కొన్ని తరగతులకు ఆ భావాలు ఉపయోగపడుతాయి అనుకుంటే వాటిని బయటికి తీసి, మెరుగులు దిద్ది ప్రాచుర్యం కల్పిస్తారు. వర్గ అవసరాలకు వినియోగించుకుంటారు. కారల్‌మార్క్స్‌కు కూడా ఇదే పరిస్థితి ఎదురయింది. మార్క్స్ పెట్టుబడి గ్రంథం రాసినప్పుడు ఎవరూ పట్టించుకోలేదు. కార్మిక ఉద్యమం ఎప్పుడయితే బలపడిందో, యూరప్ దేశాల్లో నిర్మాణయుతం అయిందో, ఎప్పుడైతే ఉద్యమాలు, పోరాటాలు పెరిగాయో అప్పుడు పెట్టుబడి గ్రంధానికి విపరీతమైన అదరణ వచ్చింది. ఆయన ప్రాతిపాదించిన లక్ష్యాలను సాధించాలనుకున్నవారు ఎక్కువ మంది ఉన్నారు. కాబట్టి ఆయన భావాలకు ప్రాచుర్యం వచ్చింది. ఆయన అలోచనలు తమ జీవితాలకు అద్దం పడుతున్నందునే ప్రజలు ఆయన వైపు అకర్షించబడ్డారు. బాబాసాహెబ్ అంబేద్కర్ విషయంలో కూడా నేడు అదే జరుగుతున్నది.

అంబేద్కర్ భావపరంపర వ్యాప్తిచెందితే ప్రమాదం అనుకున్న అరుణ్‌శౌరి అంబేద్కర్ వ్యక్తిత్వాన్ని చులకన చేస్తు ప్రత్యేకంగా ఒక పుస్తకమే రాశాడు. అంబేద్కర్ బలహీన వర్గాల పాలిట దేవుడు కాదు, ఆయన ఒక బూటకపు దేవుడు అని చిత్రీకరించాడు. హిందూత్వ సిద్ధాంతాన్ని, రాజకీయాల్ని సంఘ్‌పరివార్ ప్రణాళికను ముందుకు తీసుకుపోవడం అరుణ్‌శౌరి లక్ష్యం. ప్రస్తుతం అంబేద్కర్ భావజాలం అందుకు ప్రధానమైన అటకంగాభావించినందునే అరుణ్‌శౌరి తన పుస్తకం ద్వారాఅంబేద్కర్ అలోచనలు, వ్యక్తిత్వంపై దాడి చేశాడు.


అంబేద్కర్ అలోచనలపై దాడిచేయడం వల్ల అనుకున్న ఫలితాలను పూర్తిగా సాధించడం సాధ్యం కానందునే మరోవైపు నుండి కూడా ఆర్.ఎస్.ఎస్, సంఘ్‌పరివార్ శక్తులు తమ ప్రయత్నాలను చేస్తున్నారు. అంబేద్కర్ ఆలోచనలను వక్రీకరించి, తమకు తగినట్లుగా తీర్చిదిద్ది, ఆయనను తమ వాడిగా చేసుకొనే ప్రయత్నాలను గత కొంతకాలంగా చేస్తున్నారు. అంబేద్కర్ హిందుమతాన్ని సంస్కరించి, మెరుగుపర్చడానికి కృషిచేసిన సంఘసంస్కర్త అని, ఇస్లాం, క్రైస్తవ మతాలను తిరస్కరించిన ఆయన ఉత్తమ జాతీయవాదని అందుకే భారతీయ సంస్కృతిలో భాగమైన బౌద్ధమతాన్ని స్వీకరించాడని ప్రచారం చేస్తున్నారు. సంఘ్‌పరివార్ సిద్ధాంత కర్తలు అయిన నాయకుల సరసన అంబేద్కర్‌కి స్థానం ఇచ్చి,భ్రమలు కల్పించే ప్రయత్నాలు చేస్తున్నారు.

అయితే సంఘ్‌పరివార్ శక్తులు, బి.జె.పి. చేసే ప్రయత్నాలు నిజాయితి, చిత్తశుద్ధిలేనివి. జీవితాంతం అంబేద్కర్ చెప్పిన భావాలు హిందుత్వశక్తుల భావాలకు పూర్తి వ్యతిరేకం. కులవ్యవస్థను నాశనం చేయడానికి, ఆ వ్యవస్థకు ఆలంబనగా ఉన్న హిందు మతభావాలను, హిందుమత బోధలను తుత్తునియలు చేయడానికి అయన జీవితమంతా కృషి చేశారు. హిందూ మతం ఉన్నంత కాలం కులం, అంటరానితనం పోవని, దాన్ని వదిలేస్తేనే దళితులకు విముక్తి లభిస్తుందని అంబేద్కర్ బలంగా నమ్మాడు. అందుకే చాలా తీవ్రమైన మీమాంస తరువాత తన అనుయాయులతో హిందు మతాన్ని వీడి బౌద్ధ మతాన్ని స్వీకరించాడు. 1930 దశకంలోనే తను హిందువుగా మరణించనని ప్రకటించాడు. ఆయన జీవిత చరమాంకం వరకు మతమార్పిడి గురించి చర్య తీసుకోకపోయినా, ఆయన అభిప్రాయంలో మార్పు రాలేదు. అనేక మంది అనేక కారణాల వలన ఇస్లాం మతంలోకి అకర్షించాలని అంబేద్కర్‌తో చర్చలు జరిపారు. ఆయనను క్రైస్తవమతంలోకి అకర్షించాలని అనేకమంది ప్రయత్నించారు. సిక్కుమతం అయితే ఎలా ఉంటుందని అంబేద్కర్ స్వయంగా ఒక అలోచన చేశారు. అనేక మందితో చర్చించారు. అంబేద్కర్ మతమార్పిడి

గురించి ఆలోచిస్తున్నారని తెలిసి ఆ ప్రయత్నాలను అడ్డుకోవడానికి కూడా అనేక మంది ప్రయత్నించారు. అంతగా హిందుమతంలో ఉండటం ఇష్టంలేకపోతే పరమతాలయిన ఇస్లాం, క్రైస్తవ మతాలను కాకుండా, జాతీయ స్రవంతిలో భాగమైన ఇంకా ఎదైనా మతం గురించి అలోచించమని హిందు మహాసభ నాయకులు అంబేద్కర్‌ని వేడుకున్నారు. కాంగ్రెస్ నాయకుడిగా ఉన్న జగ్జీవన్‌రామ్ వంటివారు, దళిత నాయకులుగా ఉన్న ఎసి రాజావంటి వారు హిందూ మతాన్ని విడిపోవాలన్న అంబేద్కర్ అలోచనలను తీవ్రంగా ప్రచారం చేశారు. అయినప్పటికి అంబేద్కర్ హిందుమత వ్యవస్థలో సామాజిక న్యాయం సాధ్యంకాదన్న స్పష్టమైన భావంతో ఉన్నందునే మతమార్పిడికి సిద్ధం అయ్యాడు. అందువల్ల అంబేద్కర్‌ను హిందూమత సంస్కర్తగా చిత్రీకరించడానికి సంఘపరివార్ శక్తులు చేసే ప్రయత్నాలు కుటిలబుద్ధితో కూడుకున్నవి.

అంబేద్కర్ వ్యక్తిత్వాన్ని ప్రధాన స్రవంతి బూర్జువా నాయకుని స్థాయికి పరిమితం జేయాలని కాంగ్రెస్ మొదటి నుండీ ప్రయత్నించింది. రాజ్యాంగ సభకు జరిగిన ఎన్నికలలో మొదట అంబేద్కర్‌ని కాంగ్రెసు వారు ఓడించారు. ఆయన బెంగాల్ నుండి ముస్లింలీగ్ సహాయంతో రాజ్యాంగ సభ సభ్యునిగా గెలిచాడు. దేశం విడిపోయినప్పుడు బెంగాల్ విడిపోయి, ఆయన సభ్యత్వం రద్దయింది. అపుడు కాంగ్రెస్ పార్టీ ముంబాయి ప్రెసిడెన్సీలో కాంగ్రెసు సభ్యుని చేత రాజీనామా చేయించి, ఆ స్థానంలో అంబే ద్కర్‌ని నిలబెట్టి గెలిపించి, రాజ్యాంగ సభకు తీసుకొచ్చారు. రాజ్యాంగసభలో రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఛైర్మన్‌గా చేశారు. అంబేద్కర్ లాంటి వాళ్లు తమ మధ్య ఉంటే బలహీన వర్గాల ప్రజల్ని ఆకట్టుకోవటానికి, నియంత్రణ చేయడానికి ఉపయోగం అని భావించారు. అంబేద్కర్‌ను తిట్టి తూలనాడిన వాళ్లే తమలో చేర్చుకున్నారు. దళితులు కమ్యూనిస్టుల వైపు మళ్ళకుండా నిరోధించవచ్చు అనుకున్నారు. అప్పటి వరకూ దళితులు, బలహీనవర్గాలు, వ్యవసాయ కార్మికులు, ఇతర పేదవర్గాలు కమ్యూనిస్టుల పక్కన ఉన్నారు. అంబేద్కర్‌ను కాంగ్రెసు ఆలింగనం చేసుకోవడంతో దళితులు కూడా కాంగ్రెస్ వైపుకు మొగ్గారు. ఆ తర్వాత అంబేద్కర్ కాంగ్రెస్‌నుండి దూరమయినా, దళితులు దూరం గాకుండా కాంగ్రెస్ జాగ్రత్తపడ్డది. ఇందిరాగాంధి కాలం వరకు దళితులు కాంగ్రెసులో చేరుతూనే ఉన్నారు. కాంగ్రెస్‌కు దూరం అయినా అంబేద్కర్ విగ్రహాలను కాంగ్రెసు విడిచిపెట్టలేదు. సరళీకరణ విధానాలను తలకెత్తుకున్న తర్వాత కాంగ్రెస్ పాలనలో దళితులకు తీవ్ర అన్యాయం జరిగింది. దాంతో దళితులు అనేక రాష్ట్రాలలో దూరమవడం ప్రారంభమయ్యింది. అంబేద్కర్‌ను మళ్లీ తమ వాడిగా చిత్రీకరించుకుని, అంబేద్కర్ భావాలే తమ భావాలని చెప్పుకోవడమే కాకుండా, దళితులు, ఇతర సామాజిక తరగతులను తమ వైపు ఆకర్షించుకునేలా ఈరోజు కాంగ్రెస్ ప్రయత్నం చేస్తున్నది.

"1991లో సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత అంబేద్కర్ వారసత్వాన్ని పూర్తిగా ధ్వంసం చేయడం ప్రారంభమైంది. రిజర్వేషన్లు, సాంఘిక సంక్షేమ పథకాలను బలహీనం చేయటం, భూసంస్కరణల రద్దు తదితర చర్యల వలన దళితులు నష్టపోతు న్నారు. దళితుల ప్రయోజనం కోసం వాటిని రక్షించుకోవలసిన అవసరం ఏర్పడింది."



డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్

1991లో సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత అంబేద్కర్ వారసత్వాన్ని పూర్తిగా ధ్వంసం చేయడం ప్రారంభమైంది. రిజర్వేషన్లు, సాంఘీక సంక్షేమ పథకాలను బలహీనం చేయటం, భూసంస్కరణల రద్దు తదితర చర్యల వలన దళితులు నష్టపోతున్నారు. దళితుల ప్రయోజనం కోసం వాటిని రక్షించుకోవలసిన అవసరం ఏర్పడింది. ఈ మధ్యకాలంలో దళితుల్లో మధ్య తరగతి అభివృద్ధి అయింది. మిగతా కులాల్లో కూడా రిజర్వేషన్లు, ఇతర అంశాల వలన చదువుకున్న ఒకచిన్న మధ్యతరగతి, ఇంకా పైకి ఎగబాకాలి అని ఆశ కలిగిన ఒక చిన్న పొర ఏర్పడింది. రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్లను రక్షించుకోవడం, ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లు విస్తరించడం జరగకపోతే తమకు భవిష్యత్ ఉండదన్న భావం ఈ తరగతుల్లో ఏర్పడింది. సరళీకరణ విధానాల పట్ల తీవ్రమవుతున్న బలహీనవర్గాల అసంతృప్తి కూడా అంబేద్కర్ పట్ల ఆసక్తి పెరగడానికి మరొక కారణం.

అంబేద్కర్‌ను మన దేశ పాలకవర్గాలు తమకు సంబంధించిన ఒక సింబల్‌గా వినియోగించుకొంటున్నాయి. సింబల్‌గా వినియోగించుకొనే వాటిలో ఆయన విగ్రహం ముఖ్య మైనది. అంబేద్కర్ చేసింది ఇతరంగా ఏమీ లేనట్లు, రాజ్యాంగ రచనలో మాత్రమే ఆయన పాత్ర ఉన్నట్లు ఆయన విగ్రహం చేతిలో రాజ్యంగం పుస్తకం పెడతారు. రాజ్యాంగ రచనలో అంబేద్కర్ పాత్ర విస్మరించరానిదనే దాంట్లో సందేహం లేదు. రాజ్యాంగ నిర్మాత అని ఆయనను కొనియాడడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. బలహీన వర్గాల ప్రయోజనాల రక్షణ కోసం రాజ్యాంగంలో రిజర్వేషన్లను జొప్పించడంలో అంబేద్కర్ కృషి ఎనలేనిది. ఒక లిబరల్ ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని తయారు చేయడంలో అంబేద్కర్ ముద్ర స్పష్టంగా కన్పిస్తుంది. అయినా మన రాజ్యాంగం యొక్క మౌలిక స్వభావం వ్యక్తిగత ఆస్తి రక్షణే నన్నది మరువకూడదు. సామాన్యులకు పనికొచ్చే అంశాలన్నింటిని హక్కులుగా కాకుండా ఆదేశిక సూత్రాలకు పరిమితం చేశారు. రాజ్యాంగం తయారీలో అంబేద్కర్‌కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చి ఉంటే ఎటువంటి రాజ్యాంగం తయారయ్యేదో రాజ్యాంగ సభకు ఆయన సమర్పించిన మెమొరాండాన్ని చదివితే ఎవరైనా గమనించగలరు. అంబేద్కర్ అభిప్రాయాలు రాజ్యాంగంలో పొందుపర్చిన వాటికన్నా తీవ్రమైనవి. ప్రత్యామ్నాయమైనవి. వాస్తవంగా అంబేద్కర్‌లో మౌలిక భావాలతో కూడిన అంశాలు చాలా ఉన్నాయి. కులవ్యవస్థ గురించి, ప్రజాస్వామ్యం గురించి, సమానత్వం గురించి గ్రామీణ సామాజిక వ్యవస్థ గురించి అనేక అభ్యుదయ అంశాలు ఉన్నాయి.

కొత్త వ్యవస్థలో సార్వజనీన ఓటు ఉ

**“ భారతదేశంలో అత్యంత దుర్మార్గమైనది కులవ్యవస్థ. కులవ్యవస్థను నాశనం చేయాల నేది అంబేద్కర్ లక్ష్యం. అందుకే గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేయాలని చెప్పాడు. కులవ్యవస్థకు పునాది గ్రామం. గ్రామాల్లో ఉంటే అంటరానితనం నుండి విముక్తి ఉండదు. ”**



షెడ్యూల్డ్ కాస్ట్స్ ఫెడరేషన్ కార్యకర్తలతో అంబేద్కర్

ండాలి. సమానత్వం స్వేచ్ఛ ఉండాలి. వ్యక్తిగత ఆస్తిహక్కుకు రక్షణ ఉండాలన్న విషయాలను వివరించాడు. ఎటువంటి ఆర్థిక వ్యవస్థ ఉండాలో కూడాచెప్పాడు. మిశ్రమ ఆర్థికవ్యవస్థను ప్రతిబింబిస్తూ పెట్టుబడిదారులందరూ కలిసి రూపొందించిన, బాంబేప్లాన్‌కన్నా మరికొంత రాడికల్‌గా ఉండే వాటిని దీనిలో ప్రతిపాదిస్తాడు. కీలకమైన పరిశ్రమలు జాతీయం చేయాలి. బీమారంగం వంటి వాటిని జాతీయం చేయాలి. భూమిని జాతీయం చేసి, రైతులకు కౌలుకు ఇచ్చి ప్రభుత్వమే వారికి పెట్టుబడులు అందజేసి ప్రోత్సహించాలని చెప్పాడు.

భారతదేశంలో అత్యంత దుర్మార్గమైనది కులవ్యవస్థ. కులవ్యవస్థను నాశనం చేయాల నేది అంబేద్కర్ లక్ష్యం. అందుకే గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేయాలని చెప్పాడు. కులవ్యవస్థకు పునాది గ్రామం. గ్రామాల్లో ఉంటే అంటరానితనం నుండి విముక్తి ఉండదు. కాబట్టి దళితులకు ప్రత్యేక గ్రామాల్ని నిర్మించాలని భావించాడు. ప్రత్యేకంగా దళితులకు భూములు కేటాయించండి అని కోరాడు. ప్రస్తుత గ్రామాలలో గ్రామ స్వరాజ్యం అన్న గాంధీజీ నినాదం గ్రామాల్లో అగ్రకులాలకు, ఆధిపత్య కులాలకు పెత్తనం ఇవ్వడమేనన్నది అంబేద్కర్ అభిప్రాయం. ఈ అభిప్రాయం అక్షరాలా నిజమేనని అనుభవం చెబుతున్నది. వాస్తవంగా పంచాయతి రాజ్ వ్యవస్థ ఏర్పడిన తర్వాత పాలకవర్గాలకు గ్రామాల్లో మంచి పునాది ఏర్పడింది. పాలకవర్గాలను బలపరిచే శక్తులు గ్రామాలలో బలపడ్డాయి. అంబేద్కర్ తన జీవిత కాలంలో రా జ్యాంగ నిర్మాణంలో వెచ్చించింది రెండు మూడు సంవత్సరాలు మాత్రమే. మిగిలిన జీవితమం తా కులవ్యవస్థ నిర్మూలన కోసం, బలహీన వర్గాల విముక్తి కోసం పాటుపడ్డారు. అంబేద్కర్ వ్యక్తిత్వంలోని ఈ మౌలిక పార్శ్వాన్ని మరుగు పర్చి, రాజ్యాంగ నిర్మాతగా మాత్రమే ఆయనను చిత్రీకరించడం వాస్తవంగా కులవ్యవస్థ నిర్మూల న గురించి ఆయన చెప్పిన అంశాలను వెనక్కు నెట్టి అంబేద్కర్ వారసత్వానికి అన్యాయం చేయడమే అవుతుంది.

అంబేద్కర్‌లో సామాజిక మార్పుకు తోడ్పడే పార్శ్వాన్ని పెద్దది చేసి, కాపాడుకుని, సామాజిక మార్పు కోసం పోరాడే శక్తులకు ఉపయోగపడే వ్యక్తిగా అంబేద్కర్ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. వాస్తవంగా అంబేద్కర్ వ్యక్తిత్వంలో, సిద్ధాంతంలో సామాజిక మార్పుకు దోహదం చేసే వాటిని రక్షించుకుంటూ ముందుకు పోవాలి. ఫ్యూడలిజానికి వ్యతిరేకమైన, సామాజిక మార్పు కు దోహదం చేసే భావజాలాన్ని రక్షించి ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం మనం చేయాలి. అంబేద్కర్ భారతదేశంలో ఫ్యూడల్ వ్యవస్థను భగ్నం చేయడానికి, దానిలో తీవ్రమైన మార్పుకు దోహదం చేసే కృషిచేశాడు. ఇటువంటి పరిస్థితిలో పాతకాలంలో అభ్యుదయ వాదులు అందించిన దానికన్నా ఒక పదునైన ఆయుధాన్ని అంబేద్కర్ నుంచి మనం పొందవచ్చు. దాన్ని తీసుకుని సామాజికమార్పు కోసం మనం ముందుకు సాగాలి.

❊

## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్,**

**‘మార్క్సిస్టు’** సైద్ధాంతిక మాసపత్రిక

ప్రజాశక్తి ప్రెస్, గవర్నరుపేట, విజయవాడ-2

**ఈ మాసం ప్రత్యేకం**

# 'హిందూత్వ' ప్రాజెక్టు

**ఎస్. వెంకట్రావు**



రచయిత సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

"రాజకీయాలను హైందవీకరించండి, హైందవాన్ని సైనికీకరించడండి".... హిందూత్వ సిద్ధాంత కర్త వినాయక్ దామోదర్ సావర్కర్ రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఇచ్చిన నినాదమిది. నేడు కేంద్రంలోనూ, దేశంలోని అనేక రాష్ట్రాల్లోనూ అధికారం చెలాయిస్తున్న భారతీయ జనతా పార్టీ విధానాలను, చర్యలను పరిశీలిస్తే సావర్కర్ చూపిన మార్గంలో సంఘ పరివార్ పయనిస్తోందన్న విషయం బోధపడుతుంది. సావర్కర్ 1928లో తను రాసిన "హిందూత్వ: ఎవరు హిందువు" అన్న కరపత్రంలో హిందూత్వ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. వాస్తవానికి 1923లో ఇంగ్లీషులో "హిందూత్వ సారం" అన్న శీర్షికతో వెలువడిన కరపత్రాన్ని సావార్కర్ మరాఠీలోకి అనువదిస్తూ దాని శీర్షికను మార్చాడు. విశేషం ఏమిటంటే సావర్కర్ నాస్తికుడు. ఆయనకు దేవుని మీద నమ్మకం లేదు. ఆయన హిందూ మతాన్ని ఒక రాజకీయ ఉద్యమంగా మలిచేందుకే హిందూత్వ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

సావార్కర్ ప్రతిపాదన ఒక శాస్త్రీయ ఆవిష్కరణ అని ఆనాడు మతతత్వ వాదులు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. హిందువుకు సావర్కర్ కొత్త నిర్వచనం ఇచ్చాడు. హిందూత్వం అనేది ఒక మతం కాదు జాతి, సంస్కృతి, రాజకీయ అస్థిత్వం అని నిర్వచించాడు. భారత దేశాన్ని పితృభూమిగా, పుణ్య భూమిగా ఎవరు భావిస్తారో వారే హిందువులని ఆయన నిర్వచించాడు. అంటే ఏ ప్రజల పూర్వీకులు ఈ దేశంలో పుడతారో, ఎవరి మతం ఈ దేశంలో జన్మిస్తుందో వారే హిందువులన్న మాట. ఈ సిద్ధాంతం ప్రకారం జైనులు, సిక్కులు, బౌద్ధులు కూడా హిందూత్వంలోకి వస్తారు. క్రైస్తవులు, ముస్లింలు విదేశీయులుగా పరిగణించబడతారు. మొత్తం భారత ఉపఖండాన్ని (ఇటు పాకిస్తాన్ నుండి బంగ్లా దేశ్ వరకు) అఖండ భారత్‌గా పేర్కొంటూ, ఈ ప్రాంతంలో హిందూ రాష్ట్ర (హిందూ నేషన్) ఏర్పాటే లక్ష్యమని ప్రకటించాడు. క్రైస్తవులు, ముస్లింలు భారత దేశంలో ఉండాలంటే హిందూత్వ భావజాలానికి లోబడి ఉండాలనేది ఆయన ప్రతిపాదన. ఈ సూత్రం ప్రకారమే సావర్కర్ ద్విజాతి సిద్ధాంతాన్ని సృష్టించాడు. హిందువులు ఒక జాతి, ముస్లింలు ఒక జాతి అనే ఈ సిద్ధాంతం పాకిస్తాన్ వేర్పాటు వాదులకు ఊతం ఇచ్చింది. భారతీయ జనతా పార్టీ 1989లో హిందూత్వ తన అధికారిక సిద్ధాంతంగా స్వీకరించింది. బిజెపీతోబాటు ఆర్ఎస్ఎస్, దాని పరివారం అయిన విశ్వ హిందూపరిషత్ తదితర సంస్థలు హిందూత్వను అనేక పేర్లతో పిలుస్తున్నాయి. హిందూ రాష్ట్ర, సాంస్కృతిక జాతీయ వాదం (కల్చరల్ నేషనలిజం) వగైరా.


కానీ సావర్కర్ చెప్పిన సిద్ధాంతాన్నే అనుసరిస్తే ఈ దేశంలో మూలవాసులు ఎవరు అన్న ప్రశ్న వస్తుంది. ఆర్యుల జన్మస్థానం మధ్య ఆసియా. వారు అక్కడ నివసిస్తుండగానే రుగ్వేదం రూపొందింది. రుగ్వేదార్యులు పశువుల కాపరులు. వారు భారత భూభాగంలోకి వలస వచ్చేసరికి ఇక్కడ గొప్ప నాగరికత విలసిల్లుతున్నది. తవ్వకాల్లో బయటపడ్డ హరప్పా, మొహంజెదారో నగరాలు నాటి ప్రజల అభివృద్ధి స్థాయిని తెలుపుతున్నాయి. సింధు నది ప్రాంతంలో ఈ నగరాలు బయటపడ్డాయి కనుక దీన్ని సింధు నాగరికత అంటున్నారు. కానీ నిజానికి ఈ నాగరికత భారత దేశంలోని దక్షిణాది వరకు వ్యాపించి ఉన్నది. పశుకాపరులైన ఆర్యులు అశ్వారూఢులై, కత్తులతో వచ్చి భారత దేశ మూలవాసులను జయించి వారిని దాసులు (దస్యులు)గా చేసుకున్నారు. కాలక్రమంలో వారితో కలిసిపోయారు. వర్ణవ్యవస్థ ఏర్పడింది, తరువాత అది కుల వ్యవస్థగా ఘనీభవించింది. ఆర్యుల తరువాత భారత దేశంలోకి అనేక జాతుల ప్రజలు వచ్చారు, ఈ భూమిని తమ మాతృభూమిగా చేసుకున్నారు. ఆర్యుల మాదిరిగానే హూణులు, పర్షియన్లు, తురుష్కులు, అరబ్బులు తమ మతాలు, సంస్కృతులతో వచ్చారు. ఈ దేశంలో భాగమైనారు. వేదాచారం మాదిరిగానే క్రైస్తవం, ఇస్లాం కూడా ఇతర ప్రాంతాల నుండి వచ్చింది. కాలక్రమంలో ఈ దేశంలోని మూలవాసులు వేద ప్రమాణాన్ని అంగీకరించినట్లే ఇస్లాం, క్రైస్తవంలోకి కూడా మారారు. ఆ విధంగా భారతదేశం అనేక జాతులు, అనేక సంస్కృతులు, మతాలు, భాషల కలయిక అయింది.

అందువల్ల సావర్కర్ హిందూత్వ సిద్ధాంతాన్ని మన దేశ చరిత్ర అంగీకరించడం లేదు. కనుకనే హిందూత్వ వాదులు భారతదేశ చరిత్రను మార్చడానికి పూనుకున్నారు. వారు ఎక్కడ అధికారంలోకి వచ్చినా ముందుగా చేసే పని అక్కడ చరిత్ర పుస్తకాలను మార్చడం. కానీ పుస్తకాల్లో రాతలను మార్చినంతమాత్రాన వాస్తవాలను మార్చలేరు కదా!

మాది సాంస్కృతిక జాతీయవాదం అని సంఘ పరివార్ చెప్పుకుంటున్నది. నిజానికి భారతదేశంలో మూడు రకాలైన జాతీయ వాద స్రవంతులున్నాయి. మొదటిది, సంఘ పరివార్ చెబుతున్న సాంస్కృతిక జాతీయ వాదం. రెండవది, బూర్జువా జాతీయ వాదం, మూడవది, సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ వాదం. ఈ మూడూ జాతీయోద్యమంలోనే పుట్టాయి. ఒకదానితో ఒకటి ఘర్షణ పడుతూ వచ్చాయి.

సంఘ పరివార్ చెప్పే జాతీయ వాదం దేశాన్ని మతఛాందసవాదం వైపు నడిపిస్తుంది. హిందువులు ఒక జాతి. భారతదేశం హిందువులది. కనుక దేశంలోని మైనారిటీ మతస్తులతో సహా హిందూ మతాన్ని అనుసరించడం లేక దానికి లోబడి ఉండడం దేశ ప్రజలందరి కర్తవ్యం అని ఇది చెబుతుంది. హిందూ సెంటిమెంట్ పేరుతో మైనారిటీలపై పెద్ద ఎత్తున ఆంక్షలు పెడుతుంది. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్లకు ఇది మనదేశంలో నకలు. సావర్కర్ సృష్టించిన హిందూత్వ, సంఘ పరివార్ చెప్పే సాంస్కృతిక జాతీయ వాదం, హిందూ రాష్ట్ర ఇవన్నీ ప్రజలను తాత్వికంగా తిరోగమనం పట్టించేవి మాత్రమే. దేశాన్ని హిందూ అగ్రవర్ణ సంస్కృతికి లోబడి ఉండేట్లు చేయడమే హిందూత్వ లక్ష్యం. వారు హిందూత్వ ఒక మతం కాదంటారు. మరోవైపు

**❝ హిందుత్వ ఇటు దేశంలోని పాలక వర్గాలకూ, అటు సామ్రాజ్యవాద శక్తులకూ తోడ్పడటానికి నిరంతరం సిద్ధంగా ఉంటుంది. విచిత్రమేమంటే అది ఒకవైపు భారత పాలక వర్గాలకూ, విదేశీ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉన్నట్లు నినాదాలిస్తుంది. ఆచరణలో ఆ రెంటికీ సహకరిస్తుంది. ఈ విషయంలో హిందుత్వ యూరప్‌లో పుట్టిన ఫాసిజం అడుగుజాడల్లో నడుస్తుంది. ❞**



ఒకే తాను గుడ్డలు: ఆర్.ఎస్.ఎస్.నేత మోహన్ భగవత్, బిజెపీ నేత గడ్కరీ, ప్రధాని మోడీ

ఆ పేరుతో హిందూ మతాచారాలు (గోవధ, రామాలయం వగైరా) ప్రజలందరిపై రుద్దడానికి ప్రయత్నిస్తారు. పాఠ్యగ్రంథాలను హిందూ పురాణాలతో నింపడానికి యత్నిస్తారు. చరిత్రను హిందుత్వ ప్రాజెక్టుకు అనుగుణంగా వక్రీకరిస్తారు. పూర్తి స్థాయిలో అధికారం చేతికి వస్తే రాజ్యాంగాన్ని తమ ప్రాజెక్టుకు అనుగుణంగా మార్చడానికి ప్రయత్నిస్తారు.

బూర్జువా జాతీయ వాదం ఫ్రెంచ్ విప్లవపు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం నినాదం నుండి స్ఫూర్తి పొందింది. భారత దేశాన్ని తన మార్కెట్‌గా మార్చుకున్న బ్రిటిష్ సామ్రాజ్యవాదుల నుండి అధికారాన్ని చేజిక్కించుకున్న భారత పాలక వర్గాలకు ఈ దేశం ఒకటిగా ఉండడం అవసరం. ఎందుకంటే దేశంలోని అన్ని ప్రాంతాల, అన్ని మతాల ప్రజలు వాటి మార్కెట్టే. అందుకే ప్రజాస్వామ్యం, లౌకికతత్వం సూత్రాలుగా మన రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగింది. కానీ ఆచరణలో పాలక వర్గాలు బూర్జువావర్గ సూత్రాలను ఎన్నడూ అనుసరించలేదు. రాజీలు పడుతున్నాయి, లొంగుబాట్లు ప్రదర్శిస్తున్నాయి. సామ్రాజ్యవాదులతో మిలాఖత్ అవుతున్నాయి.

ఇక మూడవది, సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయవాదం. ఇది వామపక్షాల సైద్ధాంతిక స్రవంతి. భారత దేశాన్ని సామ్రాజ్యవాద పట్టు నుండి సంపూర్ణంగా విడిపించి సార్వభౌమత్వాన్ని కాపాడ్డం, బూర్జువా పూర్వ సమాజ అవశేషాలను తొలగించడం దీని లక్ష్యం. ఇది అంతిమంగా సమసమాజ నిర్మాణానికి ఉపకరిస్తుంది. వాస్తవానికి సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయవాదం అనేది ఒక ప్రజాతంత్ర భావన. స్వచ్ఛమైన బూర్జువా సమాజం కోరుకునే అంశాలన్నీ ఇందులో ఉంటాయి.

ఈ మూడు జాతీయవాద స్రవంతుల్లో మొదటిది సమాజాన్ని వెనక్కు తీసుకుపోడానికి ప్రయత్నిస్తుంది, అందువల్ల అభివృద్ధి నిరోధకమైంది. హిందుత్వ సిద్ధాంతం ఈ కోవలోకి వస్తుంది. రెండవది యథాతథ స్థితిని కోరుకుంటుంది. మూడవది సమాజాన్ని ముందుకు నడిపించే స్రవంతి. అందువల్ల అది అభివృద్ధికరమైంది.

ప్రజలు సమైక్యంగా తమ భవిష్యత్తును నిర్మించుకోడానికి హిందుత్వ అడ్డుపడుతుంది. ఎందుకంటే అది నిత్యం వారిని మతాల ప్రాదిపదికగా చీల్చి ఉంచడానికి ప్రయత్నిస్తుంది. మెజారిటీ మతతత్వం మైనారిటీ మతతత్వాన్ని ప్రేరేపిస్తుంది. రెండు మతతత్వాలు ఒకదానికి ఒకటి శత్రువులుగా కనిపించినా నిజానికి అవి ఒకదానికి ఒకటి సహకరించుకుంటూ పెరుగుతాయి. అందువల్ల మతతత్వం ఏరూపంలో ఉన్నా అది అభివృద్ధి నిరోధకమైనదే.

హిందుత్వ ఇటు దేశంలోని పాలక వర్గాలకూ, అటు సామ్రాజ్యవాద శక్తులకూ తోడ్పడటానికి నిరంతరం సిద్ధంగా ఉంటుంది. విచిత్రమేమంటే అది ఒకవైపు భారత పాలక వర్గాలకూ, విదేశీ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉన్నట్లు నినాదాలిస్తుంది. ఆచరణలో ఆ రెంటికీ సహకరిస్తుంది. ఈ విషయంలో హిందుత్వ యూరప్‌లో పుట్టిన ఫాసిజం అడుగుజాడల్లో నడుస్తుంది. హిందుత్వ చరిత్రను అధ్యయనం చేస్తే అది అనేక సందర్భాల్లో ఫాసిజం నుండి ఉత్తేజం పొందిన విషయం, ఫాసిజానికి వత్తాసు పలికిన విషయం గుర్తిస్తాం. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికీ, తరువాత అమెరికా సామ్రాజ్యవాదానికీ అడుగులకు మడుగులొత్తిన విషయం గ్రహిస్తాం. పాలక వర్గాలు సంక్షోభంలో పడినప్పుడల్లా అది వారిని ఆదుకున్న విషయం తెలుసుకుంటాం.

మన దేశంలో పాలక వర్గాలు సంక్షోభంలో పడినప్పుడు, సాధారణ పరిస్థితుల్లో ప్రజలను పాలించడం సాధ్యం కానప్పుడు అభివృద్ధి నిరోధక భావజాలమైన హిందుత్వను ఆశ్రయించడం చూశాం. 1990 దశకంలో దేశంలో ప్రపంచీకరణ విధానాలతోటే హిందుత్వ శక్తులు విజృంభించాయి. ఒకవైపు పివి నరసింహారావు – మన్మోహన్ ద్వయం ఆధ్వర్యంలో నయా–ఉదారవాద విధానాలకు దేశ ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరిచే సమయంలోనే కార్పొరేట్ శక్తుల మద్దతుతో అద్వానీ అయోధ్యకు రథయాత్ర ప్రారంభించారు. రాజీవ్ గాంధీ హయాంలో ప్రారంభమైన శిలాన్యాస్ నుండి బాబ్రీమసీదు కూల్చివేత వరకు అడుగడుగునా హిందుత్వ శక్తులకు కార్పొరేట్ శక్తుల, మీడియా మద్దతు లభించింది. మళ్లీ గత ఎన్నికల్లో నరేంద్ర మోడీకి కార్పొరేట్ రంగం పెద్ద ఎత్తున మద్దతిచ్చి అధికారంలోకి తెచ్చింది. రెండు సందర్భాల్లోనూ పరివార్ ప్రభుత్వాలు అటు సామ్రాజ్యవాదుల, ఇటు దేశంలోని పాలక పక్షాల సేవలో నిమగ్నమయ్యాయి. నేడు కేంద్రంలో పరిపాలిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఒకవైపు హిందుత్వ, మరోవైపు కార్పొరేట్ అభివృద్ధి నిరోధక శక్తుల కాక్‌టైల్ పాలన మినహా మరొకటి కాదు.

అధికారంలో ఉండి పాలక వర్గాలకు సేవ చేయడమే కాదు, హిందూత్వ శక్తులు తమ చేతికొచ్చిన అధికారాన్ని తమ ప్రాజెక్టును ముందుకు తీసుకుపోవడానికి కూడా ఉపయోగించుకుంటాయి. ఏమిటా ప్రాజెక్టు? దేశంలోని అన్ని రంగాల్లోకి హిందూత్వ శక్తులను చొప్పించడం. దేశ ప్రజల చైతన్యాన్ని మతతత్వ పూరితం గావించడం. కేంద్రంలో నాటి వాజ్‌పేయి ప్రభుత్వం నుండి నేటి నరేంద్ర మోడీ ప్రభుత్వం వరకు, వివిధ రాష్ట్రాల్లో బిజెపీ ప్రభుత్వాలు చేస్తున్న పని అదే. పాఠ్యాంశాలను కాషాయమయం చేస్తున్నాయి. ప్రభుత్వంలోని వివిధ శాఖల్లోకి చివరికి సైన్యం, న్యాయ వ్యవస్థలోకి కూడా తమ అనుయాయులను చొప్పిస్తున్నాయి. మరోవైపు మంత్రుల నుండి కింది స్థాయి కార్యకర్త వరకు మతోన్మాదాన్ని, మైనారిటీ వ్యతిరేకతను రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం ద్వారా ప్రజల్లో మత విభజన పెంచుతున్నారు.

మెజారిటీ, మైనారిటీ ప్రజల మధ్య సమస్యలు సృష్టించి మత విభజన పెంచడం హిందూత్వ ప్రాజెక్టులో ఒక భాగం మాత్రమే. మొత్తం దేశ ప్రజల చైతన్యాన్ని మతోన్మాద పూరితం గావించడం ఈ ప్రాజెక్టులోని ప్రధానాంశం. గొడ్డుమాంసం సమస్యనే తీసుకోండి. ఈ సమస్య స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండీ ఉన్నది. అప్పుడప్పుడూ మతతత్వ శక్తులు దీనిపై మాట్లాడ్డం ప్రజలు పెద్దగా పట్టించుకోకపోతే వదిలేయడం జరుగుతోంది. కాని ఇప్పుడు మోడీ ప్రభుత్వ హయాంలో హిందూత్వ దీన్ని తన ప్రాజెక్టులో ప్రధానాంశంగా తీసుకుంది. ఒక పద్ధతి ప్రకారం దీనిపై ప్రచారం చేస్తోంది. అధికారాన్ని ఉపయోగించుకుంటోంది. ఉత్తర ప్రదేశ్‌లో అఖ్లాక్‌ను చంపడం, ఉన్నదీ లేనిదీ సృష్టించి దేశంలోని పలు ప్రాంతాల్లో గొడవలు సృష్టించడం ఇందులో భాగమే. ఆ విధంగా గొడ్డుమాంసం తినకూడదు అన్న ఒక వాతావరణాన్ని సృష్టించడం ద్వారా ఒక మతస్తులపైనే కాదు, ఈ దేశంలో ముస్లింలు, దళితులు, ఇతర అనేక సెక్షన్ల ప్రజల సంస్కృతి మీద దాడి చేస్తోంది. ఆవు పేడ, మూత్రం ఎంత పవిత్రమైనవో సోషల్ మీడియాలో హిందూత్వ శక్తుల ప్రచారం చేయడమే కాదు, ప్రభుత్వాలు గోసంరక్షణ కార్యక్రమాలను నెత్తినెత్తుకుంటున్నాయి. ఇటీవల ఆవు పేడ, మూత్రంతో పంటలు పండించడం అనే ఒక ప్రాజెక్టును విశ్వహిందూ పరిషత్ చేపడితే చంద్రబాబునాయుడు ప్రభుత్వం తో సహ అనేక ప్రభుత్వాలు దానికి ప్రజా ధనం వెచ్చించి మద్దతిస్తున్నాయి. అలాగే హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో రోహిత్ వేముల సంఘటన గానీ, ఢిల్లీలోని జవహర్‌లాల్ విశ్వవిద్యాల యంలో కన్నయ్య అరెస్టు, దాడి సంఘటన గానీ, దీనిపై కేంద్ర మంత్రులు, బిజెపీ, ఆర్ఎస్ఎస్ నాయకుల ప్రకటనలు, తీసుకుంటున్న చర్యలు గానీ... ఇవన్నీ చెదురుమదురు ఘటనలు కావు. ఒక పద్ధతి ప్రకారం దేశ ప్రజల చైతన్యాన్ని మతతత్వ మయం గావించేందుకు హిందూత్వ శక్తులు చేస్తున్న ప్రయత్నాల్లో భాగాలు. సూటిగా చెప్పాలంటే భారత దేశాన్ని తాలిబానీకరించడానికి చేస్తున్న ప్రయత్నాలు.

> **"హైదరాబాద్ విశ్వవిద్యాయంలో రోహిత్ సంఘటన గానీ, ఢిల్లీలోని జవహర్‌లాల్ విశ్వవిద్యాల యంలో కన్నయ్య అరెస్టు, దాడి సంఘటన గానీ, దీనిపై కేంద్ర మంత్రులు, బిజెపీ, ఆర్ఎస్ఎస్ నాయకుల ప్రకటనలు, తీసుకుంటున్న చర్యలు గానీ... ఇవన్నీ చెదురుమదురు ఘటనలు కావు. ఒక పద్ధతి ప్రకారం దేశ ప్రజల చైతన్యాన్ని మతతత్వ మయం గావించేందుకు హిందూత్వ శక్తులు చేస్తున్న ప్రయత్నాల్లో భాగాలు."**

హిందూత్వ ప్రాజెక్టు విజయం సాధిస్తుందా....? హిందూత్వకు అన్ని విధాలా మద్దతిచ్చి, పెంచిపోషిస్తున్న పాలక వర్గాల విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం నుండి వచ్చే ప్రతిఘటనపై ఇది ఆధారపడి ఉంటుంది. మన పాలక వర్గాల విధానాలు అన్ని విధాలా విఫలమైనాయి. నయా–ఉదారవాదం ప్రపంచాన్నే కాదు భారత దేశాన్నీ సంక్షోభంలోకి నెడుతోంది. వ్యవసాయం కునారిల్లుతోంది. ఉత్పత్తి రంగం చతికిల పడింది. ఉపాధికల్పన అటకెక్కడంతో నిరుద్యోగం ప్రబలిపోతోంది. పాలక వర్గాల లాభాలు పెంచుకోవాలంటే ప్రజలను భరించలేనంతగా పిండడం, వనరులను దోచుకోవడం మినహా దారిలేని పరిస్థితుల్లో అవి మరింత ప్రజావ్యతిరేకంగా మారిపోయాయి. సహజంగానే ఈ విధానాలకు ప్రతిఘటన తీవ్రమవుతోంది. ఈ ప్రతిఘటనా శక్తులను మానసికంగానూ, భౌతికంగానూ అణచివేయడానికి పాలకవర్గాలకు హిందూత్వ శక్తులు బాగా ఉపయోగపడుతున్నాయి కనుకనే పాలక వర్గాలు వాటిని పెంచి పోషిస్తున్నాయి. హిందూ మతోన్మాదాన్నే కాదు మైనారిటీ మతతత్వాన్ని కూడా అవి పెంచి పోషిస్తున్నాయి. అందువల్ల నేటి పరిస్థితుల్లో ప్రజా ప్రతిఘటనను తీవ్రం చేయడమే హిందూత్వ ప్రాజెక్టును అడ్డుకునే ఏకైక మార్గం. ❊

# అభిప్రాయం

**గౌరవనీయులైన 'మార్క్సిస్టు' పత్రిక సంపాదకులకు నమస్కరించి వ్రాయునది...**
**జనవరి సంచికపై నా అభిప్రాయం ప్రచురించ కోరుచున్నాను.**

## కామ్రేడ్ ఏచూరిగారి ప్రసంగవ్యాసం అందరూ చదవాలి

రాజ్యసభలో నవంబర్ 27న రాజ్యాంగ స్థాపన దినోత్సవ సందర్భంగా చేసిన ప్రసంగ వ్యాసం అందరూ తప్పక చదవాలి. ఇది చారిత్రక ప్రసంగం. అనేక అంశాలు ఇందులో ఉన్నాయి. రాజ్యాంగంలోని అనేక ఆర్టికల్స్‌ని ఉటంకించి సోదాహరణంగా వివరించారు. ఏడు పేజీల వ్యాసంలో చరిత్ర, ఆర్ఎస్ఎస్ పుట్టుక, కా॥ అంబేద్కర్ ఆలోచన ప్రభుత్వం నిర్వహించవలసిన కర్తవ్యాలు విపులంగా ఉన్నాయి. ఏచూరిగారికి, పత్రిక సంపాదకులకు నమస్కారములు...

– **తుంపాల శ్రీరామమూర్తి**, గాజువాక, విశాఖపట్నం.

సామాజికాంశం

# రోహిత్ వేముల మరణానికి దారితీసిన పరిణామాలు



రచయిత ప్రముఖ పాత్రికేయులు

**కునాల్ శంకర్**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో రోహిత్ ఆత్మహత్య దేశంలోని ప్రతిష్టాత్మక ఉన్నత విద్యా సంస్థలలో దళిత విద్యార్థుల పట్ల బాగా వేళ్ళూనుకొనిపోయిన కుల వివక్షపై చర్చను లేవదీసింది.

హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ పరిశోధన విద్యార్థి వేముల రోహిత్ ఆత్మహత్య ఒక్కసారి జరిగిన సంఘటన కాదు. కానీ తమ బాల్యాన్ని నాశనం చేసిన కులవిద్వేషాలను అంతం చేయాలని తీర్మానించుకొని, భయంకరమైన గ్రామీణ పేదరికం నుండి వచ్చిన మొదటి తరం విద్యార్థుల అవసరాలను పట్టించుకోవడంలో పరాకాష్ఠకు చేరిన వైఫల్యం..

దేశంలోని ప్రతిష్ఠాత్మకమైన విద్యాసంస్థలలో ఒకటైన హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో దశాబ్దకాలంలో జరిగిన ఆత్మహత్యలలో రోహిత్ ఆత్మహత్య తొమ్మిదవది. వారిలో ఆరుగురు దళితులు, ఒకరు ఆదివాసీ విద్యార్థి, ఒకరు బి.సి.కులం, ఒకరు ఉన్నత కులానికి చెందినవారు. ఐదుగురు దళిత విద్యార్థుల ఆత్మహత్యలు వారు చదివే కోర్సుకు సంబంధించిన తేడాలవల్ల, వారికిచ్చే ఫెలోషిప్‌ను తగ్గించడం, సమయానికి పి.హెచ్.డి గైడ్‌ను కేటాయించకపోవడం లాంటి పరిపాలనా విభాగంలో తప్పిదాల వల్ల జరిగాయి. రోహిత్ ఆత్మహత్య, తనకు విధించిన తీవ్రమైన శిక్ష ఫలితంగానే జరిగింది. రోహిత్‌లాంటి విద్యార్థుల ఉన్నత విద్యా లక్ష్యాలను సాధించడానికి వారి అవసరాల పట్ల సున్నితంగా వ్యవహరించాల్సిన బాధ్యత యూనివర్శిటీకి ఉన్నది. ఆ లక్ష్యాలే అందరినీ కలుపుకుపోయే ఆదర్శాలను ప్రతిబింబిస్తాయి.

50 సంవత్సరాల ప్రతిష్ఠాత్మక సెంట్రల్ యూనివర్శిటీ అధికారులు సరిదిద్దగలిగిన, విద్యార్థుల రాజకీయాలకు సంబంధించి చిన్న తగాదాతో అది ప్రారంభమయ్యింది. 2015 ఆగస్ట్ 3వ తేది అర్ధరాత్రికి ఒక గంట ముందు అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్‌కు చెందిన గుంపు, ఒక వామపక్ష దళిత విద్యార్థి గుంపు బి.జె.పి. అనుబంధ విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి పరిషత్‌కి నాయకుడైన, భాషాశాస్త్రంలో పరిశోధక విద్యార్థి నందనం సుశీల్ కుమార్ నుండి క్షమాపణలు కోరాలని నిర్ణయించారు. అతడు ఫేస్‌బుక్‌లో చేసిన అవమానకరమైన వ్యాఖ్యానాలకే ఈ క్షమాపణలు. ఆగస్ట్ 3న అతడు చేసిన వ్యాఖ్యానాలు: “ఎయస్ఎ గూండాలు గూండాయిజం గురించి మాట్లాడడం, హాస్యాస్పదం” జూలై 30, 1993లో ముంబైలో జరిగిన వరుస పేలుళ్ల కేసులో నేరస్తునిగా ఉరిశిక్షకు గురైన ‘యాకుబ్ మెమన్’ను స్మరిస్తూ జరిపిన సంతాప సభకు ప్రతిచర్యగా పై వ్యాఖ్యానాలు చేయబడినాయి. ఉరిశిక్షను నిరసిస్తూ అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఈ సమావేశాన్ని నిర్వహించింది.

తాను స్వయంగా జనవరి 21న ‘జీన్యూస్’ ఛానల్‌లో ఒప్పుకున్నట్లుగా, సుశీల్ ఆ నిరసనను చూడలేదు. కేవలం ఫేస్‌బుక్‌లో నిరసన ఫోటోలు మాత్రమే చూశాడు. ఈ సంఘటనపైబాగా కలత చెందానని, వెంటనే ఆ సమావేశానికి చెందిన ఫోటోలను గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్స్‌పెక్టర్ భూపతికి పంపించానని ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు. హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో దేశద్రోహ కార్యక్రమాలు జరుగుతున్నాయన్న విషయాన్ని భూపతి దృష్టికి తీసుకొని రావాలనుకుంటాడు.

సుశీల్‌కుమార్ ఈ వ్యాఖ్యానం ఉద్రేకరహితంగా చేశాడు. కాని దానిని రాజకీయంగా భిన్నాభిప్రాయాలు తెలియజేసేవారికి వ్యతిరేకంగా ఎబివిపి వారు ఉపయోగించుకుంటారని, పరిణామాలు ఈ విధంగా ఉంటాయని అనుకోలేదు. 2014లో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల తరువాత కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ఆధ్వర్యంలో ఉన్న మానవ వనరుల అభివృద్ధి శాఖ నుండి యూనివర్శిటీ కళాశాలల పరిధిలో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని, యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్ (యుజిసి)కు ఉత్తర్వులు అందాయి. ఈ మార్గదర్శకాలు విద్యార్థులు, అధ్యాపకుల నుండి విమర్శలకు గురి అవుతాయి.

రోహిత్ ఆత్మహత్యను దర్యాప్తు చేసే అధికారిగా భూపతి నియమించబడతాడు. ఆ ఫిర్యాదులో ఆత్మహత్యకు కారకులైన ఆరుగురిపై యస్.సి., యస్.టి. చట్టం మోపబడింది. అతడు (భూపతి), సుశీల్‌కుమార్ ఒకరికొకరు తెలుసు అన్న విషయం అందరికీ తెలిసిందే. దానివల్ల అధికారి పక్షపాతంగా వ్యవహరిస్తాడని అందరు అనుకోవచ్చు. దళితుడు లేదా ఆదివాసీ అని నిరూపించబడకుండా ఈ కేసు యస్‌సి, యస్‌టి ప్రివెన్షన్ ఆఫ్ అట్రోసిటీస్ యాక్ట్ కింద నమోదు చేయబడకూడదు. ప్రాథమిక సమాచార నివేదిక (యఫ్ఐఆర్) ప్రకారం ఈ కేసులో కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, యన్. రామచందర్‌రావు, (యంయల్‌సి), సుశీల్‌కుమార్, అతని బాబాయి, స్మృతి ఇరానీకి దత్తాత్రేయ చేత లేఖ వ్రాయించిన బిజెపి కార్యకర్త అయిన నందనం దివాకర్, హెచ్‌సియు వైస్ ఛాన్సలర్ పొదిల అప్పారావు, సుశీల్‌కుమార్ స్నేహితుడు, ఎబివిపి కార్యకర్త, ఆగస్ట్ 3,-4న సంఘటనకు సాక్షిగా ఉన్న కృష్ణచైతన్య పేర్లు నమోదు చేయబడినాయి.

రోహిత్ స్నేహితుడు, అర్థశాస్త్ర విభాగంలో పరిశోధక విద్యార్థి దొంత ప్రశాంత్ చేత ఈ ఫిర్యాదు ఇవ్వబడింది. సోషల్ మీడియాలో సుశీల్‌కుమార్ చేసిన వ్యాఖ్యలలో “గుండాలు” అన్నపదం “అసాధారణమైన” పదంగా ‘జీన్యూస్’కిచ్చిన ఇంటర్వ్యూలో తానే పేర్కొనడం జరిగింది. తన శత్రువులు తనను కాషాయ తీవ్రవాదులు, ఫాసిస్టులు అని పేర్కొన్నపుడు, తాను వారిని ఆ పదంతో పిలవడంలో తప్పేముంది అని అంటాడు.

**క్షమాపణ, “దాడి”**

ఆగస్ట్ 3వ తేదీన జరిగిన విషయం వివరిస్తూ సెక్యూరిటీ అధికారి దలీప్‌సింగ్ అర్ధరాత్రి దాటిన తరువాత సుశీల్‌కుమార్ న్యూరిసెర్చ్ స్కాలర్స్ బిల్డింగ్ బయటవున్న సైకిల్‌స్టాండ్ దగ్గర ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతుండగా చూశానని చెప్పాడు. అతనికి 50 అడుగుల దూరంలో నిలబడి ఉన్న అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎయస్ఎ)కు చెందిన సభ్యులు ఫేస్‌బుక్‌లో సుశీల్‌కుమార్ వారిపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. దలీప్‌సింగ్ చెప్పినదానికి నిజనిర్ధారణ కమిటీకి తెలిసింది ఇదే విషయం. “అతడు ఫోన్ మాట్లాడి వస్తాడు. ఎ.యస్.ఎ. సభ్యులు అతడిని ఆ వ్యాఖ్యలు ఎందుకు చేశావు అని అడిగితే, తనకు ఇంటర్నెట్ గురించి అంత అవగాహనలేదని, అంటాడు. వారు చేయమన్నదానికి అతను చేయనని తిరస్కరిస్తాడు. చివరికి అతడు ఒక క్షమాపణ పత్రాన్ని వ్రాసి యిస్తాడు.”

దలీప్‌సింగ్, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్‌ఫేర్ (డియస్‌డబ్ల్యు) ప్రకాష్‌బాబు విద్యార్థుల మధ్య జరుగుతున్న ఈ తగాదా ఏమిటో చూడమని ఫోన్ చేసిన మీదట అక్కడికి 1:20 ఎ.యమ్.కు చేరుకున్నాడు. విద్యార్థుల మధ్య షుమారు 20 ని॥ల పాటు వాదనలు సాగాయి.

సుశీల్ కుమార్ తాను 100కు ఫోన్‌చేసి అతనికి బాగా తెలిసిన సబ్ ఇన్స్‌పెక్టర్ నవీన్‌కు విషయాలు తెలియజేశాడు. వెంటనే రెండు పోలీస్ బృందాలు అక్కడకు చేరుకున్నాయి. ఎ.యస్.ఎ. విద్యార్థులు తనను గదినుండి బైటికి లాగి గాయపర్చారని దానికి సాక్షాలు కూడ ఉన్నాయని ఆరోపించాడు. వారు ఫేస్‌బుక్‌లో తన క్షమాపణను పోస్ట్ చేయమని అన్నట్లుగా పేర్కొంటాడు. ఉద్రికతలను తగ్గించాలనే ఉద్దేశ్యంతో ఇద్దరు సెక్యూరిటీ అధికారులు మెయిన్ గేటు వద్ద ఉన్న వారి కంప్యూటర్‌లు ఉపయోగించుకోమని అంటారు. ప్రశాంత్, అతని స్నేహితుడు సెక్యూరిటీ అధికారుల జీపులో సుశీల్ కుమార్ వెంట వెళ్ళమని ఒత్తిడి చేస్తారు. ఈ సందర్భంలో, లాక్కోవడం, తోసుకోవడం జరిగినట్లు అనిపించింది. ఫలితంగా సుశీల్ కుమార్ చొక్కా చిరిగింది, భుజంపై చర్మం కమిలింది.

సుశీల్ కుమార్ ఉత్తరం అప్‌లోడ్ చేసిన అనంతరం , దలీప్‌సింగ్ అతన్ని యూనివర్శిటీ అతిథిగృహంలోనే ఉంటావా, అక్కడ ఆ రాత్రికి రక్షణ కల్పించబడుతుంది అని అడుగుతాడు. సెక్యూరిటీ అధికారి, సుశీల్‌ను తనకు వ్యతిరేకంగా ఏదైనా హింస జరిగిందా? తనకేమైన గాయాలయ్యాయా అని అడిగాడు. తనకేమీ కాలేదు బాగానే ఉన్నానని సుశీల్ చెప్పాడు. ఎ.యస్.ఎ. విద్యార్థులు తమ గదులకు తిరిగి వెళ్ళారు. సుశీల్ తన సోదరుడు విష్ణుకొరకు ఎదురు చూస్తాడు. కొద్ది సమయంలోనే అతను కారులో వచ్చిన పిదప, ఇద్దరూ కలిసి వెళ్ళడం జరిగింది.

ఇదంతా ఒక గంట సమయంలోనే జరిగింది. సుశీల్ కుమార్ తరువాత తన వ్యాఖ్యలను తీసివేసి, తన ఫేస్‌బుక్ పేజీని తాత్కాలికంగా నిలిపివేస్తాడు. దీనిపట్ల ఎ.యస్.ఎ. విద్యార్థులు దిగులు చెందుతారు. ముస్లింలకు వ్యతిరేకంగా ఉరితీయబడిన హిందువుల సంఖ్యను పోలుస్తూ తన ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసిన ఆగస్ట్ 3 నుండి, స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు ఎ.బి.వి.పి వారు తీసిన ఫోటోలు అప్‌లోడ్ చేసిన ఆగస్ట్ 15కు మధ్య సామాజిక సమస్యలకు సంబంధించిన పోస్టింగ్‌లు ఏమీలేవు.

ఆగస్ట్ 4 న, 10 మంది అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎ.యస్.ఎ) విద్యార్థులను పోలీసులు ప్రశ్నించడానికి తీసుకొని వెళ్లారు. అంతకు ముందే సుశీల్‌కుమార్ దగ్గర్లోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చేరతాడు. ఆరుగురు విద్యార్థుల పైన (ప్రొక్టోరియల్ బోర్డ్) క్రమశిక్షణా బోర్డుకు ఫిర్యాదు చేస్తాడు. సుశీల్‌కుమార్ ఆగస్ట్ 7న ఆసుపత్రిలో అపెండిసైటిస్ ఆపరేషన్ చేయించుకుంటాడు. రోహిత్ ఆత్మహత్య అనంతరం సుశీల్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ వారు దాడిచేసి కొట్టిన ఫలితంగానే ఈ అనారోగ్యం సంభవించినట్లు ఆరోపించాడు.

సుశీల్ కుమార్ చెప్పిన విషయాలు వైద్య అధికారి డా॥ అనుపమారావు పరిశీలనలకు విరుద్ధంగా ఉన్నాయి. ఆమె సుశీల్‌కు వైద్యం అందించిన వైద్యులతో సమావేశం అయింది. ఆమె నివేదికలో “ఎడమ భుజంపై కొన్ని గాట్లు ఉన్నట్లుగా” పేర్కొనడం జరిగింది. సుశీల్ కుమార్‌కు శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యులు వెల్లడించిన అంశాలను నిజనిర్ధారణ కమిటీకి మాత్రమే వెల్లడిస్తాను అని ఆమె చెప్పింది. సుశీల్ కడుపులో నొప్పిగా ఉన్నదని, అది తనపై జరిగిన దాడి వల్లనే అనే ఫిర్యాదుతో రావడం జరిగిందని, డాక్టర్లు చెప్పినట్లుగా డా॥ అనుపమ పేర్కొనడం జరిగింది. అంతర్గతంగా ఏ గాయం లేదని ఆమె తెలిపింది. భుజంపై చర్మం కమిలినట్టుగా ఉండడం తప్ప శరీరంపై ఎక్కడా ఏ గాయం లేదని చెప్పడం జరిగింది.

దేశంలోని యూనివర్శిటీలలోని మంచి ఆరోగ్య కేంద్రాలలో ఒకటిగా హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పరిగణించబడుతుంది. ఇది అన్ని వేళల్లో తెరిచే ఉంటుంది. అక్కడ ఉండే ప్రతి విద్యార్థికి వైద్యసేవలను అందిస్తుంది. డా॥ అను పమారావు ఇలా పేర్కొంటుంది. “నేను, సుశీల్‌ను వెంటనే ఇక్కడకు ఎందుకు రాలేదని అడిగినాను. ఎ.యస్.ఎ. విద్యార్థులు తనను యూనివర్శిటీ క్యాంపస్‌కు తిరిగి రావడానికి అనుమతించలేదని, ఒకవేళ వస్తే తిరిగి మళ్ళీ దాడి చేస్తారని భయపడినట్లు చెప్పారు. అతడు జరిగిన దాడి వలన ఒత్తిడిలో అపెండిసైటిస్ సమస్య తలెత్తినట్లుగా నమ్ముతాడు”

డా॥ సంతోష్ ఇనగంటి అనే హైద్రాబాద్‌కు చెందిన గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ కడుపులో తగిలిన దెబ్బల కారణంగా ఇనెఫెక్షన్‌తో జబ్బు సంభవించిందన్న విషయాన్ని కొట్టివేసాడు. ఏదైనా ప్రమాదం సంభవించినపుడు కనిపించే గాయం లోతుగా అయితే అపెండిక్స్‌పై ప్రభావం చూపుతుందని, శరీరంపై తగిలిన దెబ్బల వల్ల అపెండిక్స్ ఏ అనారోగ్యానికి గురి అవదని పేర్కొంటాడు.

**ఆర్.ఎస్.ఎస్. విశ్వాసపాత్రులు**

సుశీల్‌కుమార్ తన అభిప్రాయాలు వెలిబుచ్చడానికి అందుబాటులో లేదు. తన సోదరుడు విష్ణు(29) బి.జె.పి అనుబంధ యువజన సంఘం నాయకుడు. తమ తల్లి వినయ కరుణాకర్

“ సెక్యూరిటీ అధికారి, సుశీల్‌ను తనకు వ్యతిరేకంగా ఏదైనా హింస జరిగిందా? తనకేమైన గాయాలయ్యాయా అని అడిగాడు. తనకేమీ కాలేదు బాగానే ఉన్నానని సుశీల్ చెప్పాడు. ఎ.యస్.ఎ. విద్యార్థులు తమ గదులకు తిరిగి వెళ్ళారు. సుశీల్ తన సోదరుడు విష్ణుకొరకు ఎదురు చూస్తాడు. ”

**"యూనివర్శిటీలో ఆంతరంగిక రక్షణ యంత్రాంగం ఉండగా క్యాంపస్ లోపలికి పోలీసులను ఎలా అనుమతించారన్న ప్రశ్నను ఆ ఉత్తరం లేవదీసింది. పోలీసులు క్యాంపస్ నుండి విద్యార్థులను పట్టుకొని పోవడానికి ఎందుకు అనుమతించారు, విద్యార్థులను ఒక రోజల్లా ఎందుకు నిర్బంధంలో ఉంచారు?"**

హెచ్‌సియు దగ్గరలో చందానగర్‌లో నివాసం ఉంటున్నారు. సుశీల్ కుమార్ హాస్టల్‌లో ఉంటున్నాడు. తమ కుటుంబానికి చాలా కాలంగా ఆర్‌యస్‌యస్‌తో మంచి అనుబంధం ఉన్నది. 47 సంవత్సరాల వయసున్న వినయ భారతీయ జనతాపార్టీ సభ్యురాలు. ఫిబ్రవరి 2న జరిగిన జిహెచ్‌యంసి ఎన్నికలలో ఆ ప్రాంత కార్పొరేటర్‌గా పోటీ చేయడానికి ఆమెకు బిజెపి టికెట్ కేటాయించింది. ఈ సంఘటన జరిగిన అనంతర పరిణామాల వలన ఆమె సుశీల్ కుమార్ ఆరోగ్య పరిరక్షణ కొరకు తన నామినేషన్ ఉపసంహరించుకున్నది. కానీ ఆమె పోటీచేయడం లేక ప్రచారం చేయడం అనేది పార్టీ రాజకీయ ఆత్మహత్య చేసుకోవడంతో సమానం అని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

'క్షమాపణ సంఘటన' తరువాత రోజు బి.జె.పి, యంయల్‌సి రాంచందర్‌రావు, యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ (ఇంచార్జి) ఆర్.పి. శర్మను తన కార్యాలయంలో సుశీల్ తల్లితోపాటు సందర్శించాడు. అతడు ఇలా పేర్కొంటాడు. "హాస్పిటల్‌లోవున్న సుశీల్ కుమార్‌ను సందర్శించడం, అదే రోజు వైస్ ఛాన్సలర్‌తో పాటు ఉన్న అతని తల్లిని ఓదార్చడానికి మాత్రమే నా పాత్ర పరిమితమైంది. మా సమావేశంలో రిజిస్ట్రార్, విద్యార్థుల సంక్షేమ అధికారి (డీన్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్‌ఫేర్) కూడా ఉన్నారు. యూనివర్శిటీ ప్రాంగణంలో అలాంటి కార్యకలాపాలు విద్యార్థులకు మంచిది కాదని నేను వైస్ ఛాన్సలర్‌తో చెప్పాను". కానీ రాంచందర్ రావు తన చర్యలు యూనివర్శిటీ అధికారులపై అధికారిక ఒత్తిడి కలుగజేస్తున్నాయని అనుకోలేదు. తాను మీడియాతో ఈవిధంగా ప్రతిస్పందించడం జరిగింది. "ఎ.యస్.ఎ. విద్యార్థులకు వ్యతిరేకంగా ఏదైన ఒక చర్య తీసుకోబడాలి. లేకుంటే ఈ దేశంలో ఎలా ప్రవర్తించాలో బయటి వారు వారికి తెలియజెపుతారు".

**నిజ నిర్ధారణ నివేదిక**

యూనివర్శిటీ యంత్రాంగంచే ఒక నిజ నిర్ధారణ కమిటీ వేయబడింది. ఆ కమిటీకి ప్రొ॥ అలోక్‌పాండే నాయకత్వం వహించాడు. ఆయన ఆగస్టు 12న నిజనిర్ధారణ నివేదికను సమర్పించాడు. ముఖ్య ఫిర్యాదు దారుడైన సుశీల్‌కుమార్ యొక్క వాంగ్మూలం, మెడికల్ రిపోర్ట్ అందుబాటులో లేకపోవడం వలన తమ నివేదిక అసంపూర్ణంగా ఉన్నదని, ఈ నివేదికను 3,4 రోజులలోనే సమర్పించాలని శర్మ కోరడాన్ని పాండే విమర్శించాడు. తన కేసును బలపర్చడానికి ఉత్తరంతో సహా సుశీల్‌కుమార్‌చే నియమించబడిన కృష్ణ చైతన్య వాంగ్మూలం ఆధారంగా ఒక నిర్ణయానికి రావడం జరిగింది. అతను భౌతికంగా దాడి జరిగినట్లుగా ఏ ఆధారం ఇవ్వలేకపోయాడని క్రమశిక్షణా బోర్డు గమనించింది. ఈ నివేదిక ఇరు వర్గాల వారికి గట్టి హెచ్చరిక చేయాలని సిఫారసు చేసింది. ఈ విషయాన్ని రహస్యంగా ఉంచాలని అనుకోవడం జరిగింది. దీనితో పాటుగా వీలైనంత త్వరలో సుశీల్‌కుమార్ వాంగ్మూలం కూడ తీసుకోవాలని అనుకోవడం, వైస్ ఛాన్సలర్ సమక్షంలో తన సమ్మతితో జరిగింది. ఇదంతా అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ విద్యార్థులకు వ్యతిరేకంగా చర్య తీసుకోవాలని సుశీల్ కుటుంబం నుండి శర్మను రాజకీయంగా ఒత్తిడి చేయడం, దానిని అతడు తట్టుకోలేక పోయినట్లుగా గమనించడం జరిగింది.

బోర్డుకు ఆహ్వానించబడిన ఇరువురు అధ్యాపకులు, ఉత్తర్వుల అమలు తీరుతో విభేదిస్తూ అది ఏకపక్షంగా ఉందంటూ వైస్ ఛాన్సలర్‌కు ఒక ఉత్తరం వ్రాస్తారు. యూనివర్శిటీ ఆఫ్ హైద్రాబాద్ టీచర్స్ అసోసియేషన్ (యుహెచ్‌టిఎ) కార్యదర్శి దీపా శ్రీనివాస్, అప్పటి అధ్యక్షుడు కె. లక్ష్మీనారాయణచే ఆగస్ట్ 12న వ్రాయబడిన లేఖ, సిఫారసుల పై వారికి ఓటు వేసే హక్కులేదని, వారు ఆహ్వానితులు మాత్రమేనని మధ్యంతర ఉత్తర్వుల ద్వారా తెలియపరచినట్లు ఆరోపించింది. కమిటీలలో ఎన్నుకోబడిన ప్రతినిధులను (విద్యార్థి, అధ్యాపక, బోధనేతర సిబ్బంది) చేర్చడం అనేది, కమిటీలో సభ్యులు అని అనిపించుకోవడం కన్నా ముఖ్యం అని, సభ్యులందరు చర్చించి తీసుకున్న నిర్ణయం కన్నా ఓటింగ్ ద్వారా తీసుకునే నిర్ణయాలు, అలాంటి కమిటీల ఉద్దేశ్యాలను అడ్డుకుంటాయని ఆ ఉత్తరంలో పేర్కొనడం జరిగింది.

యూనివర్శిటీలో ఆంతరంగిక రక్షణ యంత్రాంగం ఉండగా క్యాంపస్ లోపలికి పోలీసులను ఎలా అనుమతించారన్న ప్రశ్నను ఆ ఉత్తరం లేవదీసింది. పోలీసులు క్యాంపస్ నుండి విద్యార్థులను పట్టుకొని పోవడానికి ఎందుకు అనుమతించారు, విద్యార్థులను ఒక రోజల్లా ఎందుకు నిర్బంధంలో ఉంచారు? యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) ప్రకారం 556 పోస్టులకు గాను, 150 ఖాళీ పోస్టులు పోను, 406 మంది బోధనా సిబ్బందిలో సగానికి పైన ఉన్న సిబ్బందికి యు.హెచ్.టి.ఎ. ప్రాతినిధ్యం వహిస్తుంది. ఆ సంఘం ఇకముందు ఓటింగ్ హక్కు లేకుండా దేనిలోను పాలుపంచుకోమని ప్రకటించింది. దానర్థం క్రమశిక్షణ బోర్డు ఉనికిలో లేనట్టు. అయినప్పటికి ఒక క్రొత్త నిజ నిర్ధారణ కమిటీ ఇతర వాంగ్మూలాలతో కొనసాగుతున్నది.

ఆగస్ట్ 17న సికింద్రాబాద్ యం.పి. దత్తాత్రేయ హెచ్.సి.యు క్యాంపస్‌లో 'కులతత్వ, తీవ్రవాద, జాతి వ్యతిరేక' రాజకీయ వాతావరణం ఉందని వివరిస్తూ కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి స్మృతి ఇరానీకి ఒక ఉత్తరం వ్రాశాడు. ఆయన సుశీల్ కుమార్‌పై ఎ.యస్.ఎ. విద్యార్థులు భౌతిక దాడి చేస్తే ఆసుపత్రి పాలు అయినట్లు, ఘటన పట్ల యూనివర్శిటీ పాలనా విభాగం ఏమీ మాట్లాడకుండా ప్రేక్షక పాత్ర వహించినట్లు ఆరోపించాడు. ఈ ఉత్తరం సంబంధిత మంత్రివర్గ శాఖలోని కార్యదర్శి స్థాయి అధికారి నుండి హెచ్.సి.యు. రిజిస్ట్రార్‌కు పంపించడం జరిగింది. విషయాన్ని జ్ఞప్తిచేస్తూ ప్రతి రెండు వారాలకు ఒకటి చొప్పున అయిదు ఉత్తరాలు ముందుగా రిజిస్ట్రార్‌కు, తరువాత వైస్ ఛాన్సలర్‌కు పంపడం జరిగింది. రెండవ ఉత్తరం (రిమైండర్) పంపే సమయానికి శర్మస్థానంలో ప్రొ॥ పొదిలి అప్పారావు వైస్ ఛాన్సలర్‌గా వచ్చాడు. రామకృష్ణ రామస్వామి రాజీనామా అనంతరం ఆ స్థానం సంవత్సర కాలంగా ఖాళీగా ఉంది. నాల్గవ ఉత్తరం (రిమైండర్) అక్టోబర్ 20, 2015న స్వయంగా హెచ్.ఆర్.డి. సహాయ కార్యదర్శి సుఖబీర్‌సింగ్ సంధు తన స్వహస్తంతో "ప్రొఫెసర్ పొదిలి" అని సంభోదిస్తూ వ్రాశాడు. దానిలో " సంఘటనలో వ్యక్తిగతంగా జోక్యం చేసుకొని వీలైనంత

> “క్రమశిక్షణా బోర్డు సస్పెండ్ చేస్తూ చేసిన నిర్ణయం పట్ల చేసిన అప్పీలు విషయంలో పైన తెల్పిన విషయాలు ఏవీ అనుసరింపబడలేదు. ఈ విషయాన్ని సమ్మె చేస్తున్న ఏ.యస్.ఏ. కార్యదర్శి ఉత్తరం ద్వారా తెలియజేశాడు.”



**విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న రోహిత్ వేముల**

త్వరలో జరిగిన వాస్తవాలను తెలియపర్చాలని” వ్రాశాడు.  ఈ ఉత్తర ప్రత్యుత్తరాలను ముఖ్యమైన వ్యక్తుల నుండి వచ్చే ఉత్తరాలకు సమాధానంగా వ్రాసే దైనందిన కార్యక్రమంగా  స్మృతి ఇరానీ సమర్థించుకొన్నది.

**న్యాయస్థానానికి వెళ్ళిన తల్లి**

ఈ ఒత్తిడి సరిపోదు అన్నట్లు  సుశీల్ కుమార్ తల్లి వినయ హెచ్.సి.యులో తన కుమారునికి ప్రాణహాని ఉన్నది కాబట్టి రక్షణ కల్పించమని కోరుతూ ఆగస్ట్ 26న హైద్రాబాద్ హైకోర్టులో ఒక కేసుదాఖలు చేసింది.  అంతకు ముందు అనుకున్న విధంగా అదే రోజు సుశీల్ క్రమశిక్షణ బోర్డు ఎదుట వాంగ్మూలం ఇచ్చాడు. యూనివర్శిటీ పాలకమండలి, రక్షణ సిబ్బంది, సిబ్బందితో పాటు పోలీసులు ఎ.యస్.ఎ. విద్యార్థులతో కుమ్మక్కు అయినట్లు తన పిటిషన్‌లో ఆమె నిందారోపణలు చేసింది..  దళితుడైన డీన్, స్టూడెంట్స్ వెల్‌ఫేర్ (డి.యస్.డబ్ల్యు) కూడ అమర్యాదగా ప్రవర్తించినట్లుగా పిటిషన్‌లోని 4వ పేరాలో నిందించడం జరిగింది.  వినయ తన పిటిషన్‌లో డి.యస్.డబ్ల్యు ప్రకాష్‌బాబు ధోరణికి అవాక్కయినట్లుగా, అతనే దాడిచేసిన వారిని ప్రోత్సహించాడని పేర్కొన్నది.  ఫేస్ బుక్‌లో పోస్ట్ చేసిన దాని ప్రకారం వారు తన కుమారుని గది వద్దకు కబురు చేసిన తరువాత మధ్యరాత్రి వెళ్ళినట్లుగా పేర్కొనడం జరిగింది. తన కుమారుడు క్రమశిక్షణ బోర్డు కమిటీకి 26.08.2015 న కనిపించాడు.  ఆమె తన కుమారునితో పాటు క్యాంపస్‌కు వెళ్లి కొంత మంది సిబ్బందిని కలిసింది. వారు కనీసం సానుభూతిని ప్రదర్శించక పోవడం, తాను కొంత అసౌకర్యానికి గురిఅయినట్లు తెలిపింది. ఇక న్యాయస్థానం ఒక్కటే మార్గం అనుకున్నది.

**సస్పెన్షన్ నిరసనలు**

ఈ సంఘటనలో సుశీల్‌కుమార్ చెప్పిన విధంగా పాల్గొన్న ఐదుగురు విద్యార్థులను మిగిలిన సెమిస్టర్ వరకు అన్ని తరగతులకు హాజరు కాకుండా హాస్టల్ నుండి వెంటనే సస్పెండ్ చేయాలని ఆగస్ట్ 31వ తేదీన క్రమశిక్షణా బోర్డు సిఫారసు చేసింది.  సెప్టెంబర్ 8న ఉత్తర్వులు వచ్చాయి. ఆ అయిదుగురు విద్యార్థులు : ప్రశాంత్, రోహిత్, పెద్దపూడి విజయ్‌కుమార్, రాజనీతి శాస్త్రం పి.హెచ్.డి. విద్యార్థి చెముడుగుంట శేషయ్య, వేల్పుల సుంకన్న ఫిలాసఫి పి.హెచ్.డి. విద్యార్థి.

ఏ.యస్.ఏ, వామపక్ష విద్యార్థి సంఘాల నాయకత్వాన యూనివర్శిటీ క్యాంపస్‌లో నిరసన జ్వాలలు పెల్లుబికినాయి. వారికి పరోక్షంగా బోధనా సిబ్బంది, పాలనా విభాగానికి చెందిన సిబ్బంది మద్దతు పలికారు. మూడురోజుల అనంతరం ఒక కొత్త కమిటీ ఈ సంఘటన పూర్వ పరాలను పరిశీలించడానికి ఏర్పడుతుంది, ఆ కమిటీ చెప్పిన విధంగా విద్యార్థులు నడుచుకోవాలన్న షరతుపై సస్పెన్షన్ తొలగించబడింది.

ఏక పక్షంగా రూపొందించబడిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ యొక్క సబ్‌కమిటీ నివేదిక రావడానికి మూడు నెలలు ఆలస్యం జరిగింది.  యూనివర్శిటీ ఆఫ్ హైద్రాబాద్ 1974 చట్టం ప్రకారం, యూనివర్శిటీ పాలకవర్గం తీసుకున్న క్రమశిక్షణా చర్యలను సవాల్ చేస్తూ విద్యార్థులు చేసుకున్న విన్నపాలను వినడానికి ఒక ట్రిబ్యునల్ రూపొందించబడుతుంది.  ఆ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదుదారుడైన విద్యార్థి, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌చే నియమించబడిన సభ్యుడు,  భారత రాష్ట్రపతిచే నియమించబడిన ఒక పరిశీలకుడు ప్రతినిధులుగా ఉండాలని చట్టం పేర్కొన్నది.  క్రమశిక్షణా బోర్డు సస్పెండ్ చేస్తూ చేసిన నిర్ణయం పట్ల చేసిన అప్పీలు విషయంలో పైన తెల్పిన విషయాలు ఏవీ అనుసరింపబడలేదు. ఈ విషయాన్ని సమ్మెచేస్తున్న ఏ.యస్.ఏ. కార్యదర్శి ఉత్తరం ద్వారా తెలియజేశాడు. ఆ కమిటీలో యు.హెచ్.టి.ఎ. ప్రతినిధులు కూడ ఎవ్వరూ లేరు.  దానికి బదులుగా సీనియర్ ప్రొఫెసర్ అయిన విపెన్ శ్రీ వాత్సవ నాయకత్వాన ఏర్పడిన ఆరుగురు సభ్యుల అడ్‌హాక్ కమిటీ క్రమశిక్షణా బోర్డు నిర్ణయంతో ఏకీభవించింది.

యూనివర్శిటీ నిర్ణయాలను చివరగా నిర్ధారించే అధికారం ఉన్న వైస్ ఛాన్స్‌లర్ విద్యార్థులకు విధించిన శిక్షను ఈ విధంగా తగ్గించాడు.  “తొలగింపబడిన విద్యార్థులు గదులలోనికి ప్రవేశించడానికి, భోజనశాలలకు, అందరు తిరిగే ప్రాంతాలకు అనుమతిలేదు. అదేవిధంగా వారి కోర్సు పూర్తి కావడానికి మిగిలిన కాలంలో వారు ఏ ఎన్నికలలో పాల్గొనడానికి అనుమతి లేదు.” అని రోహిత్ చనిపోవడానికి ఖచ్చితంగా ఒక నెల ముందు, అంటే డిశంబరు 16న ఆ ఐదుగురు విద్యార్థులకు తెలియపర్చబడింది.  అప్పటి నుండి జనవరి 14 మధ్య కాలంలో పాలనా విభాగం నుండి ఏ ఒక్కరు వారి దగ్గరకు పోయే ప్రయత్నం చేయలేదు.

సుశీల్‌కుమార్ నుండి విద్యార్థులు క్షమాపణలు కోరిన మార్గం తప్పా? ఒకవేళ ఐనా ఇంత కఠినమైన శిక్ష అవసరమా?  అప్పారావు నాయకత్వాన ఉన్న పాలకవర్గం అది అవసరం అనే అంటుంది.  కొంతమంది బోధనాసిబ్బంది

**❝ రోహిత్‌తో సహా బహిష్కృతులైన విద్యార్థు లందరూ వారి వారి విభాగాలలో తెలివైన వారు. వారందరికి పేదరికం, వివక్షకు సంబంధించిన దయ నీయమైన కథనాలు ఉన్నాయి. వారు వారి కుటుం బాలలో మొదటి తరానికి చెందిన పట్టభద్రులు.❞**

రాజకీయ ఒత్తిడి ప్రభావంతో అప్పారావు ఆ నిర్ణయం తీసుకున్నట్లుగా ఒప్పుకున్నారు.

వైస్ ఛాన్సలర్ నియామకం దాదాపు ఎప్పుడూ రాజకీయ నిర్ణయంపైనే ఆధారపడు తుంది. అప్పారావు నియామకం దానికి భిన్నంకాదు రెండు దశాబ్దాల పాటు సేవలందిం చిన ఒక అధ్యాపకుడు "అతడు (అప్పారావు) ఈ క్యాంపస్‌లో అంత సీనియర్టీ ఉన్న వ్యక్తికాదు. అతనికి బిజెపి, టి.డి.పి, పార్టీల మద్దతు ఉ ండి ఉంటుంది. అతడు కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడుకు, మరొక టి.డి.పి యం.పి. కేంద్ర మంత్రి సుజనా చౌదరికి బాగా తెలుసు అని, దానితోపాటు అప్పారావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని కోస్తా ప్రాంతంలోని బలమైన కమ్మ సామా జిక వర్గానికి చెందిన వ్యక్తి అని" అంటాడు. టి.డి.పి, కేంద్రంలో మిత్రపక్షంగా ఉన్న పార్టీ కాబట్టి ఈ నిర్ణయం ప్రభావితం చేయబడి ఉ ంటుంది.

నిరవధికంగా సెలవుపై వెళ్ళిన అప్పా రావు, ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్‌గా ఉన్న విపెన్ శ్రీవాత్సవ (ఈయన కూడ సెలవుపై వెళ్ళాడు) ఇరువురిపై గతంలో కులవిద్వేషాల ఆరోపణలు ఉన్నాయి. వారు ఆ ఆరోపణలను నిరాకరించారు. కానీ వారు అంత తేలికగా మారేవారు కాదు. అప్పారావుకు సంబంధించిన కేసు 2002లో అతడు ఛీఫ్ వార్డెన్‌గా ఉన్న సమయంలో విద్యార్థులే నిర్వహించుకునే హాస్టళ్లలో అవినీతి ఆరోపణలు లేకుండా చేయాలని కొన్ని సంస్కరణ లు చేసే ప్రయత్నం చేశాడు. కొనుగోళ్ళ కమిటీ ఏర్పడిన సమయంలో, రొటేషన్ పద్ధతిలో మేనే జర్‌గా ఒక దళిత విద్యార్థి ఉన్నాడు. విద్యార్థులు భయపడినట్లుగానే, భోజన ఖర్చులు పెరిగినాయి. ఆ సంవత్సరం జనవరి 10న, 10 మంది దళిత విద్యార్థులు పెరిగిన ఖర్చులకు సంబందిం చిన సమస్యలపై అప్పారావును కలిసినపుడు అతడు స్పందించలేదు. చిన్న తగాదా జరిగింది. అప్పారావు తనను విద్యార్థులు బాగా కొట్టినట్లు ఆరోపించాడు. ఫలితంగా ఆ 10 మంది దళిత విద్యార్థులు బహిష్కరింపబడినారు. కొన్ని సంవత్సరాల అనంతరం మాత్రమే హెచ్.సి.యు. నుండి వారు తమ డిగ్రీలను పొందగలిగారు. అందులో ఒకరు యూనివర్శిటీ ప్రొఫెసర్ కూడ అయ్యారు.

విపెన్ శ్రీవాత్సవ ఫిజిక్స్ విభాగం డీన్‌గా ఉన్న సందర్భంలో తమిళనాడు నుండి సెంతిల్ కుమార్ అనే దళిత విద్యార్థి పిహెచ్.డి కోర్సులో చేరినాడు. పిహెచ్.డి పూర్తి అయింది అని నిర్ధారించడానికి ఒక వ్రాత పరీక్ష, ఒక మౌఖిక పరీక్ష ఉంటుంది. సెంతిల్ కుమార్ విషయంలో ఏ వివరణ లేకుండా, అదనపు పరీక్ష నిర్వహిం చడం వలన అతని పిహెచ్.డి రెండు సంవత్సరాలు పూర్తయ్యేనాటికి నిర్ధారించబడ లేదు. ఆ క్రమంలో అతడు తన స్కాలర్‌షిప్ కోల్పోయాడు. పి.హెచ్.డి డిగ్రీ వస్తుందన్న ఆశ కోల్పోతాడు. ఫలితంగా 2008 ఫిబ్రవరి 24న ఆత్మహత్య చేసుకున్నాడు.

స్కూల్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం ప్రొఫెసర్ వినోద్ పవరాల నేతృత్వం వహిస్తున్న ఆంతరంగిక కమిటీ నివేదికలో ఈ విధంగా పేర్కొనబడింది. "ఫిజిక్స్ విభాగం రిజర్వేషన్ కేటగిరీకి చెందిన విద్యార్థుల పట్ల పని కట్టుకొని వివక్ష చూపినట్లుగా కమిటీ దృష్టికి రాకపోయి నా, కోర్సుకు సంబంధించిన, కొన్ని అస్పష్టమైన, తేడాల వల్ల ప్రభావానికి లోనైయ్యేది యస్.సి., యస్.టి. విద్యార్థులు అనేది నిజం. ఫలితంగా తమ పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారన్న భావనకు యస్.సి., యస్.టి. విద్యార్థులు లోనవుతున్నారు. యస్.సి. యస్.టి. విద్యార్థుల పట్ల ఆ విభాగం వారు వివక్ష చూపుతున్నారని ఫిజిక్స్ విభాగానికి చెందిన విద్యార్థులందరూ ఈ కమిటీకి తెలియజేశారు".

**'వెలివాడ' నిరసన**

రోహిత్ కేసులో ముందు ఐదుగురు విద్యార్థు లు కమిటీ నిర్ణయాన్ని అంగీకరించి తమ స్నేహితుల గదులలో ఉన్నారు. కానీ యూని వర్శిటీ గదులు చిన్నగా ఉండడంతో అవి జనంతో నిండిపోతున్నాయి. తమకు అన్యాయం జరిగిందన్న భావన వారిని మరింత గాయపరిచింది. దీనిని ప్రతిఘటించాలన్న నిర్ణ యం డిశంబర్‌లో తీసుకొనబడింది. బహిష్కరిం చబడిన ఐదుగురు విద్యార్థులు యూనివర్శిటీ బయట ఉత్తరం వైపు ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ దగ్గర చలిలోనే ఉండాలని నిర్ణయించుకున్నారు. దానిని వారు 'వెలివాడ'గా (అంటే 'ఊరి బయట') పిలుచుకున్నారు. గ్రామాలలో దళితులు ఊరికి బయటనే నివసిస్తారు.

రోహిత్‌తో సహా బహిష్కృతులైన విద్యార్థు లందరూ వారి వారి విభాగాలలో తెలివైన వారు. వారందరికి పేదరికం, వివక్షకు సంబం ధించిన దయనీయమైన కథనాలు ఉన్నాయి. వారు వారి కుటుంబాలలో మొదటి తరానికి చెందిన పట్టభద్రులు. చెముడు గుంట శేషయ్య నెల్లూరు జిల్లాకు చెందిన గ్రామం నుండి వచ్చాడు. మరణించిన అతని తల్లిదండ్రులు వ్యవసాయ కార్మికులు. ఆ గ్రామానికి చెందిన ఒక రెడ్డిభూస్వామికి సహాయకులుగా పనిచేశారు. తన తల్లిదండ్రులు నెలకు 20 రూపాయలు చెల్లించలేక పోవడంతో శేషు కొంత కాలం మాత్రమే ట్యూషన్‌కు వెళ్ళాడు. దళితులు, ఇతర తక్కువ కులానికి చెందిన విద్యార్థులు మాత్రమే వెళ్ళే పాఠశాలకు శేషు 'క్లాస్‌లో విద్యార్థుల నాయకుడు'. భూస్వాములైన రెడ్లు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపేవారు. క్లాస్‌లో విద్యార్థుల నాయకుడు' స్థానం తన పాఠశాల దాటి ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉ పాధ్యాయులు నిర్వహించే 'ప్రైవేట్ ట్యూషన్' దాకా వెళ్లింది. అక్కడ తనతో పాటు ఉన్నత కులాలకు చెందిన వారి పిల్లలు కూడా ఉ ండేవారు. వారు ఎప్పుడైనా తప్పుగా ప్రవర్తిస్తే, 'క్లాస్ లీడర్'గా తమ ఉపాధ్యాయునితో చెబు తానంటే ఉన్నత కులాలకు చెందిన వారు తమను ముట్టుకోవద్దని చెప్పేవారు. కుల వివక్ష అంటే ఏమిటో శేషయ్యకు అప్పుడు అర్థం అయింది.

శేషు, ఇతర బహిష్కృత విద్యార్థులు హెచ్.సి.యు లాంటి విశ్వవిద్యాలయాలలో చదవడానికి చాలా కష్టపడినారు. రిజర్వేషన్‌ల ద్వారా లబ్దిపొందిన అంతకు ముందు తరం దళితులు వారికి ఆదర్శం. హెచ్.సి.యుకు వెళ్ళి న తరువాత హాజరైన ఒక పెళ్ళిని శేషు గుర్తు చేసుకుంటాడు. యూనివర్శిటీలో తన సీనియర్ విద్యార్థి ఒక దళిత జంట వివాహానికి ఆహ్వాని స్తాడు. అక్కడికి సూట్, బూటు వేసుకొనివున్న పెద్దలు కూడ హాజరయినారు. వారు దళిత ఉ ద్యమంలో కూడా చురుకుగా పనిచేస్తారు. తనలాగా మంచి ఇంగ్లీష్ మాట్లాడలేని, గ్రామాల

నుండి వచ్చి ఏ.యస్.ఏ.లాంటి సంఘాలలో పనిచేసే వారు చాలా మంది ఉంటారు అని శేషు అంటాడు. విద్య ద్వారా సామాజిక సమస్యలను అధిగమించవచ్చునే ఆశ ఈ అనుభవం ద్వారా కలిగిందని, ఇది ఒక భిన్నమైన అనుభవం అంటాడు. రిజర్వేషన్ల శకం తరువాత తన సంఘం, ఇతర దళిత సంఘాలు విశ్వవిద్యాలయాలలో బాగా బలపడ్డాయని అంటాడు.

రోహిత్ మరణం విషాదం కావచ్చు. కానీ విశ్వవిద్యాలయాలలో విశాలమవుతున్న, పెరుగుతున్న మేధో పరమైన, సాంస్కృతిక ఉద్యమాల యుగానికి అది సూచికగా ఉంది. గత మూడు సంవత్సరాలుగా హెచ్.సి.యులో జరిగిన ఎన్నికలలో భారత విద్యార్థి ఫెడరేషన్‌తో కలిసి పోటీ చేసి గెలుపొందుతున్న బలమైన విద్యార్థి సంఘాలలో ఒకటిగా ఏ.యస్.ఏ ఉంటూ వస్తున్నది.

**తరగతి గదులలో విభజన**

"ముందు మనం కొత్త వాళ్ళను కలుసుకోవాలనే తొందరలో ఉంటాం. పెద్దవాళ్ళం అయ్యామని, స్వేచ్ఛగా ఉండొచ్చనే భావనలో కూడ ఉంటాం. తరగతులలో బోధన జరిగిన ఒక్కనెలలో, తరగతి గది దానంతట అదే విభజిం చబడుతుంది. నీకు సంబందించిన వారెవరు? నీ స్నేహితులెవరు? ఏ ప్రాంతానికి చెందిన వాడివి? నీకు తెలిసిపోతుంది," అని ప్రాచీన భారతదేశ చరిత్ర పిహెచ్.డి విద్యార్థి ప్రభాకర్ పేర్కొంటాడు. ప్రభాకర్ ఇప్పటికి కొన్ని సంవత్సరాలుగా తన పిహెచ్.డి పూర్తి చేయడానికి పోరాడుతున్నాడు. రోహిత్ మరణించిన వెంటనే వైస్‌ఛాన్సలర్, బండారు దత్తాత్రేయ, స్మృతి ఇరానీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరాహారదీక్షకు పూనుకొని ముందుకొచ్చిన విద్యార్థులలో ఒకడు.

"ప్రొఫెసర్‌లు కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్, హార్వర్డ్ యూనివర్శిటీల నుండి వస్తారు. వారు ఉన్నతస్థాయి ఇంగ్లీష్ మాట్లాడతారు, అర్థం చేసుకోలేని వారి కొరకు ఆ భాష స్థాయిని తగ్గించే విషయం గురించి పట్టించుకోరు. వారిని (ప్రొఫెసర్‌లను) అందుకోలేకపోతున్నారన్నట్లుగా పట్టణ ప్రాంతాల నుండి వచ్చే ధనవంతుల పిల్లలు ఈ విద్యార్థుల వైపు చూస్తారు" అని ప్రభాకర్ అంటాడు. 2008లో ఒక విద్యార్థి మరణం తరు వాత విద్యార్థులకు కోచింగ్ ఇవ్వాలని ఒక కమిటీ సూచించింది. విద్యార్థుల అవసరాలు తీర్చగలిగిన ఆ కోచింగ్ ఇప్పించడంలో పాలక వర్గం విఫలమయింది.

విద్యార్థులు ఒకే నేపథ్యం కలిగిన విద్యార్థులతో స్నేహం చేస్తే ఆ క్యాంపస్ చాలా అనుకూలంగా ఉంటుంది. కానీ అది విద్యార్థుల జీవితాలను కూడ తెలియపరుస్తుంది. వెంటనే ఒక విధమైన నిరుత్సాహం వచ్చేస్తుంది. విద్యా విషయ కంగా బాగా చేయలేకపోతున్నామనేది కూడా ఒత్తిడి పెరగటానికి కారణం అవుతుంది.

> "తరగతులలో బోధన జరిగిన ఒక్కనెలలో, తరగతి గది దానంతట అదే విభజిం చబడుతుంది. నీకు సంబందించిన వారెవరు? నీ స్నేహితులెవరు? ఏ ప్రాంతానికి చెందిన వాడివి? నీకు తెలిసిపోతుంది," అని ప్రాచీన భారతదేశ చరిత్ర పిహెచ్.డి విద్యార్థి ప్రభాకర్ పేర్కొంటాడు."



విద్యార్థులపై చర్యలు తీసుకోమని ఒత్తిడి చేసిన బంగారు దత్తాత్రేయ, స్మృతి ఇరాని

ఇవన్నీ అణగారిన వర్గాల నుండి వచ్చిన విద్యార్థుల అవసరాలు తీర్చడానికి, సమగ్రతను కాపాడే దిశగా కళాశాల పాలనా విభాగం ముందున్న కొత్త సవాళ్ళు. కుల ప్రాతిపదికన బోధన, బోధనేతర సిబ్బంది విభజనను ప్రారంభించిన పాలకవర్గంలోనే విద్వేషాలున్నాయని అధికారులు ఆలస్యంగా తెలుసుకున్నారు.

2013లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్పందిస్తూ కళాశాల క్యాంపస్‌లో జరిగే ఆత్మహత్యలను సుమోటోగా తీసుకొని,విద్యావిషయక సమస్యలను పరిష్కరించడం, దళిత, ఆదివాసి, మహిళల ప్రత్యేక అవసరాలు తీర్చగలిగే సలహాదారుల నియామకం, పి.హెచ్.డి విద్యార్థుల ప్రవర్తనను నియంత్రించే నియమ నిబంధనలను సమీక్షించడం లాంటి కొన్ని చర్యలను సిఫారసు చేసింది.

"భారతదేశంలో ఉన్నత విద్య ఒక క్రమ పద్ధతిలో సవర్ణ హిందువులకు అనుకూలంగా, దళిత ఆదివాసి విద్యార్థుల పట్ల వివక్షను ప్రదర్శిస్తుంది". అని యు.జి.సి. మాజీ ఛైర్మన్ సుఖదేవ్ థోరట్ రోహిత్ ఆత్మహత్య సందర్భంగా మాట్లాడుతూ పేర్కొంటాడు.


రోహిత్ క్యాంపస్‌లో పొందిన అనుభవం, దళిత కుటుంబ నేపథ్యం నుండి వచ్చిన విద్యార్థుల అనుభవాలకు భిన్నంగా లేదు. అతడు చదువులలో ముందుండి ఎదుగుతున్న నాయకుడు. తన సూసైడ్ నోట్‌లో వ్రాసినట్లు తాను నీడలో ఉండి తన చూపును నక్షత్రాలపై ఉంచాడు.

ఈ విషాద ఘటనకు దారి తీసిన నిరసన సభలోని మాట ప్రతిధ్వనించాలంటే, కళాశాల క్యాంపస్‌లలో, విద్యార్థులలో, విద్యా విషయక అంశాలలో, సాంస్కృతిక జీవనంలో దేశవ్యాప్తంగా నాటకీయమైన మార్పురావాలి. ఒక్క రోహిత్ మరణిస్తే, ప్రతి ఇంట్లో ఇంకొక రోహిత్ పుట్టాలి.

**(అనువాదం: బోడపట్ల రవీందర్)**

# ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్ర

సి.పి. చంద్రశేఖర్



రచయిత ప్రఖ్యాత ఆర్థిక నిపుణులు

సరళీకృత ఆర్థిక విధానాల ప్రభావం వలన ప్రభుత్వ రంగం క్రమక్రమంగా కనుమరుగవుతోంది. అత్యంత విలువైనటువంటి ప్రభుత్వ రంగ ఆస్తులు కారుచౌకగా ప్రయివేటు వారి పరం అవుతున్నాయి. ఇటువంటి దాడి యొక్క పరిణామాలు శ్రామికవర్గం మీద, దేశాభివృద్ధి మీద తీవ్ర ప్రభావం చూపనున్నాయి.

ఈ సంవత్సరం జనవరి మొదటి భాగంలో, భారతీయ జనతాపార్టీ సారథ్యం వహిస్తున్న "నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్" ప్రభుత్వం యొక్క ఆర్థిక మంత్రిత్వ శాఖ రెండు భిన్నమైన సంకేతాలను వెలువరించింది. మొట్టమొదటిది ఏమనగా, మందగమనంతో ఉన్న ఆర్థికాభివృద్ధిని తిరిగి సరైనబాటలో పెట్టడానికి ప్రభుత్వ రంగంలో పెట్టుబడులను ప్రభుత్వం పెద్ద ఎత్తున పెంచుతుందని ఆర్థికశాఖా మంత్రి అరుణ్ జైట్లీ గారి ప్రకటన. గత సంవత్సరం ప్రభుత్వం పెట్టుబడులు పెద్ద ఎత్తున పెట్టింది. దానిని అలాగే కొనసాగిస్తూ పెంచుకుంటూ పోతాము. ప్రపంచ ఆర్థిక మందగమనాన్ని ఎదుర్కొంటున్నప్పుడు ప్రభుత్వ రంగ పెట్టుబడులే మనకు శ్రేష్ఠమైన మార్గం అని ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్టర్ ఫైనాన్స్ కంపెనీ 10వ వార్షిక సమావేశంలో పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ రంగ సంస్థల మౌలిక వసతుల ప్రాజెక్టులకు దీర్ఘకాలిక ఋణాలను అందించే సంస్థ. (ఐ.ఐ.ఎఫ్.సి.ఎల్).

ఈ వార్త వచ్చిన రోజే, మరొక వార్త బయటకు వచ్చింది. ఆర్థికశాఖ రైల్వేలకు రాసిన లేఖ అది. అందులో రైల్వేలకు 2015-16 బడ్జెట్‌లో కేటాయించిన 40,000 కోట్ల కేటాయింపులో 12,000వేల కోట్లు కోత కోస్తున్నామని, రైల్వేలు 28,000 వేల కోట్లతో సర్దుకోవాలని తెలిపింది. 2015-16 బడ్జెట్ కేటాయింపులు సమీక్షించిన పిమ్మట ప్రణాళికా కేటాయింపులలో సీలింగ్ విధించామని, ప్రభుత్వం యొక్క ఆర్థిక వనరులు దృష్టితో ఉంచుకుని, అలాగే ఖర్చులు జరుగుతున్న తీరుతెన్నులు గమనించి ఈ నిర్ణయం తీసుకున్నమని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. రైల్వేశాఖ యొక్క ఉదాశీన పెట్టుబడులు, ప్రభుత్వం యొక్క ఆర్థిక వనరుల కొరత మీద ఈ నింద వ్రాయబడింది.

ఏదిఏమైనప్పటికి, తగినంత మేరకు నిధులు లేకపోవటమే ప్రధాన కారణంగా చెప్పబడుతున్నది. ఏడవ పే కమిషన్ రికమండేషన్ ప్రకారం రైల్వేలకు కేటాయించవలసిన నిధులను తాము ఇవ్వలేమని కూడా ఆర్థిక మంత్రిత్వశాఖ తెలిపింది. ఏడవ పే కమిషన్ సూచనలను అమలు చేయడానికి కావాల్సిన సాధారణ ఆదాయం, దాని ఆచరణ బాధ్యత ఎక్కువగా ఉండటం వలన, రైల్వేలకు ఇవ్వాల్సిన దానికన్నా ఎక్కువ ఇవ్వటం వలన ఆ మొత్తాన్ని ఇవ్వటం సాధ్యం కాదని పేర్కొంది. అంతేకాదు, ఇక ప్రత్యేక విభాగంగా వాణిజ్యపరంగా నడుస్తున్న రైల్వేలు తమకు కావాల్సిన ఆదాయ వనరులను తమకు వచ్చే ఆదాయ మార్గాల ద్వారానే సమకూర్చుకోవాలని సలహా ఇచ్చింది.

అంతిమంగా సందేశం చాలా స్పష్టంగా ఉంది. ఇకనుండి రైల్వేలు తమకు అదనంగా పెరిగిపోతున్న ఖర్చులకు అనుగుణంగా నిధులను సమీకరించుకునేందుకు స్వంతంగా కృషి చేయాలి. అదనంగా పెట్టుబడులు పెట్టడానికి కావాల్సిన నిధులను కూడా స్వంతంగా పెంపొదించుకునేందుకు కృషి చేయాలి. ప్రభుత్వం అదనంగా పన్నులు వేసి, వనరులు సేకరించి రైల్వేలకి పెట్టుబడి పెట్టే పరిస్థితిలో లేదు. కనుక రైల్వేలు అదనంగా ఖర్చు పెట్టాలంటే తమ ఖర్చులను తగ్గించుకోవాలి. ఛార్జీల పెంపకం ద్వారా అదనపు ఆదాయాన్ని, మిగులును సమకూర్చుకోవాలి. కాని ఇక్కడ ఈ విషయానికి ఒక ప్రాధాన్యత ఉంది. 2014-15 ఆర్థిక సర్వే ప్రకారం, ప్రభుత్వ పెట్టుబడులు పెట్టడానికి, పెంచడానికి రైల్వేలు ప్రధాన వాహకంగా ఉంటుందని ఉద్ఘాటించింది. తద్వారా ఆర్థిక అభివృద్ధి, పెరుగుదలకు అది ఉపయుక్తంగా ఉంటుందని తెలిపింది. సర్వే పదజాలంలో చెప్పాలంటే దీర్ఘకాలిక, మధ్యంతర అభివృద్ధి కొనసాగాలంటే, ప్రభుత్వ పెట్టుబడులే చోదక శక్తిగా నిలుస్తాయని పేర్కొంది.

సర్వే రిపోర్టులోని అధ్యాయంలో ఇలా చెప్పబడింది. బడ్జెట్ ద్వారా రైల్వేకి అదనపు కేటాయింపులు చేయగలిగితే అదే రానున్న కాలంలో అభివృద్ధికి రైల్ ఇంజన్‌లా పనిచేస్తుందని స్పష్టీకరించబడింది. కాని, ఇప్పుడు ఆర్థిక మంత్రిత్వశాఖ పంపిన లేఖను గమనించినట్లయితే పెద్దఎత్తున అదనంగా తాము ఖర్చు పెడుతున్న నిధులన్నిటినీ, ఛార్జీలు పెంచడం ద్వారా రాబట్టుకునే స్థితికి రైల్వేలను నెట్టివేయడమేకాక, మరో రకంగా ప్రయివేటు రంగానికి ఆకర్షణీయమైన లాభాలను అందించే మార్గాలను సూచించటం ద్వారా వారిచేత పెట్టుబడులను పెట్టించే ప్రయత్నం చేస్తోంది. కేంద్ర ఆర్థిక శాఖామంత్రి అరుణ్ జైట్లీ గారు ఇటీవల ఒక ప్రకటనలో రైల్వేలు ఇప్పుడు సరియైన దారిలోకి వచ్చాయని, అందువలనే తాము ప్రయివేటు రంగాన్ని, విదేశీ పెట్టుబడులను మౌలిక వసతుల కల్పనరంగంలోకి ఆహ్వానిస్తున్నామని తెలిపారు. త్వరలో రైల్వేలు తమ ప్రణాళికను ప్రకటిస్తాయని నాలుగు వందల రైల్వేస్టేషన్స్ అభివృద్ధికి సంబంధించిన టెండర్లు ప్రకటించబోతున్నామని అన్నారు. ఇకనుండి ప్రభుత్వ రంగం ఇప్పటి దాకా ఏ పాత్రనయితే నిర్వహించిందో దాని నుంచి తప్పుకోవాలని, ఆ స్థానాన్ని ప్రయివేటు రంగం భర్తీ చేయాలని దీనర్థం. ఇంతకాలం అంత పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టి, ఒడిదుడుకులను ఎదుర్కొంటూ తక్కువ లాభాలు వస్తాయనే నెపంతో దూరంగా ఉన్న ప్రయివేటు రంగం ఇప్పుడు ధైర్యంగా ముందుకు రావచ్చని వారి ఆలోచన.

ఇంతకాలం ఈ పాత్ర నిర్వహించని

ప్రయివేటు రంగం ఇప్పుడు ఆ పని చేయాలని కోరుకోవడం అంటే అది ఖచ్చితంగా నయా ఉదారవాద విధానాల అమలు వలన పన్నుల ద్వారా అదనపు ఆదాయ వనరులు పోగు చేసే పరిస్థితి లేకపోవటం. రెండోది ద్రవ్యలోటు, ప్రభుత్వ అప్పులు విపరీతంగా పెరిగిపోయాయి. స్థూలజాతీయోత్పత్తిలో ఉండదగిన శాతాని కన్నా ప్రభుత్వ రుణాలు తక్కువగా ఉన్నప్పటికీ పరిస్థితి ఇలా ఉంది. మూడవది, అనుమతినిస్తే మౌలిక వసతుల రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ప్రయివేటు రంగం సిద్ధంగా ఉంది. అలాగే ప్రయివేటు రంగం మరింత మెరుగైన యంత్రాం గాన్ని, ఉత్తమ ఫలితాలను, లాభాలను అందిస్తుంది.

**అమ్మకానికి ప్రభుత్వ రంగం**

ఇక్కడ అందరూ కావాలని విస్మరిస్తున్న అంశం ఏమిటంటే భౌగోళికంగా, సామాజి కంగా మౌలిక వసతుల కోసం నిరంతరంగా పెట్టుబడులు పెట్టడానికి కావాల్సిన వనరులను సమకూర్చుకోలేకపోవటం. బడ్జెట్‌లో ప్రతిపా దించిన అంచనాల ప్రకారం పన్నుల ఆదాయం సమకూరకపోవటం సమస్య కానే కాదు. అసలు కావాల్సిన ఆదాయానికి తగ్గట్టుగా బడ్జెట్‌లో పన్నుల ఆదాయం ప్రతిపాదించకపోవటం ఒక ముఖ్య విషయమయితే, రెండోది ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరించడం ద్వారా ప్రభుత్వం సాధించుదామనుకున్న వనరులు అంది రాలేకపోవటం. 2015-16 బడ్జెట్ ప్రతిపాదనల ప్రకారం ప్రభుత్వ రంగంలో పెట్టుబడుల ఉపసంహరణ వల్ల 69,500 కోట్ల రూపాయల ఆదాయం రావాలి అందులో 41 వేలకోట్ల రూపాయలు ప్రభుత్వరంగ సంస్థల వాటాలను అమ్మడం ద్వారా, 28,500 కోట్ల రూపాయలు ప్రభుత్వ రంగ సంస్థల వాటాలను అమ్మటం ద్వారా రావాలి. కాని సంవత్సరం మధ్యకు రాగానే ప్రభుత్వం ఆ అంచనాలను 30 వేల కోట్లకి తగ్గించేసింది. మార్కెట్ పరిస్థితులు సరిగాలేదని ప్రకటించింది. అసలు జరిగిన అమ్మకాల విలువ ఇంకా తగ్గవచ్చు అమ్మకానికి వేసిన అంచనాలు పెద్దఎత్తున ఉన్నప్పటికీ, వాస్తవాలు ఆ పద్ధతులో జరగటం లేదు. ఇది కూడా సాకుగా చూపించి ప్రభుత్వ రంగాన్ని నిర్లక్ష్యంతో చూసే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను దేగలా తన్నుకు పోలేని పరిస్థితిని గమనిస్తే ఒక రకంగా పెట్టుబడుల ప్రవాహాన్ని అడ్డుకుని, ప్రజలకు మౌలిక వసతుల కల్పన ద్వారా అభివృద్ధి చక్రాన్ని వేగ

> **"2004-05 సంవత్సరం నుండి 2013-14 సంవత్సరం వచ్చే సరికి లాభాలు గడిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య 143 నుండి 163కి పెరిగింది. ఈ సంస్థల యొక్క మొత్తం లాభాలు ఈ కాలంలో 74,432 కోట్ల నుండి 1,49,164 కోట్లకు పెరిగాయి."**




**నవరత్న కంపెనీలలో ఒకటైన బిహెచ్ఇఎల్**

వంతం చేయాలనే లక్ష్యం వదులుకోవడం, నయా ఉదారవాద ఆర్థిక విధానాలలో భాగంగా ప్రభుత్వరంగం మీద ప్రభుత్వానికి మారిన దృక్పదమే కారణం.

ప్రభుత్వ రంగ సంస్థల మీద ఈ చిన్న చూపుకి కారణంగా మూడు అంశాలు ప్రధానంగా ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలలో ఎక్కువ శాతం లాభదాయకంగా లేనటువంటివి సముచిత నిర్ణయాలు తీసుకోవడంలో విఫలం అవటం వలన, యాజమాన్యం అసమర్థత, , అవసరమైనంత కన్నా కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉండటం ఒక కారణం. రెండోది ఈ రకమైన యాజమాన్య సంస్థల వైఫల్యానికి ఏ వ్యక్తినీ బాధ్యులను చేయకపోవటం, కనపడని అనేక ఇతర కారణాలు, బంధుప్రీతి లేదా లంచగొండి తనం నిర్ణయాల మీద ప్రభావం చూపటం, మూడోది, ప్రభుత్వ ఆర్థిక వనరులను ఊడ్చుకు తినేలా వీటి ప్రణాళికలు రచించుతుండటం.

**నిజంగా లాభాలు రావటం లేదా?**

పైన చెప్పిన కారణాలలో కొన్ని లేదా అన్నీ ఒక పార్శ్వంలోనూ ఏదో కొంతమేరకు కొన్ని సందర్భాలలో వాస్తవమే కాని, అదే వాస్తవం కాదు. నయా ఉదారవాద విధానాల ప్రారంభ సంవత్సరాలలో, ప్రభుత్వరంగ సంస్థల ఉత్పత్తుల ధరల నిర్ణయంలో స్వయం ప్రతిపత్తి కల్పించటం ద్వారా పెట్టుబడుల నిర్ణయాలలో కూడా స్వతంత్రత ఇవ్వటం వలన అనేక సంస్థలలో లాభాల శాతం గణనీయంగా పెరి గిందని నిక్కచ్చిగా గణాంకాలే తెలియజేస్తు న్నాయి.

2013-14 సంవత్సరానికి సంబంధించి అధికారికంగా వెలువడిన కేంద్ర ప్రభుత్వ సంస్థల సర్వే ప్రకారం 290 ప్రభుత్వ రంగ సంస్థలలో దాదాపు 213 నుండి 234 సంస్థల ఆదాయ వివరాలు అందుబాటులోకి వచ్చాయి. 2004-05 సంవత్సరం నుండి 2013-14 సంవత్సరం వచ్చే సరికి లాభాలు గడిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల సంఖ్య 143 నుండి 163కి పెరిగింది. . ఈ సంస్థల యొక్క మొత్తం లాభాలు ఈ కాలంలో 74,432 కోట్ల నుండి 1,49,164 కోట్లకు పెరిగాయి. అలాగే నష్టాల లో నడుస్తున్న అన్ని ప్రభుత్వ రంగ సంస్థల నష్టం మొత్తం కేవలం 20,055 కోట్లు మాత్రమే ఉంది. ఇది మొత్తం సంస్థల లాభాల కన్నా చాలా తక్కువగానే ఉంది. మొత్తం ప్రభుత్వరంగ సంస్థలు డివిడెండ్లుగా ఇచ్చినవి 65,115 వేల కోట్ల రూపాయలు ఉండగా ప్రభుత్వానికీ పన్నులుగా చెల్లించినది. 8,700 కోట్ల రూపాయలు. వాస్తవాలు ఈ విధంగా ఉన్నా ఇంకా ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వం యొక్క వనరులను కొల్లగొడుతున్నాయని ప్రచారం చేస్తున్నారు. అసలు ప్రభుత్వ రంగ సంస్థలలో కొన్ని తక్కువ లాభాలతో, కొన్ని నష్టాలతో నడవటానికి కారణం యాజమాన్య అసమర్థతే కారణం కాదు. అనేక ఇతర కారణాలు ఉన్నాయి. ప్రభుత్వరంగ సంస్థల స్థాపన ఏ నేపథ్యంలో జరిగిందో మనం గమనిస్తే అవి అర్థమవుతాయి. పంచవర్ష ప్రణాళికలు మొదలు అయినప్పటి నుండి దాదాపు నాలుగు దశాబ్దాలు ఈ కార్యక్రమం నడిచింది. ప్రధాన కారణం ఏమిటంటే ఆనాడు మౌలిక వసతుల కల్పనలో, పరిశ్రమల రంగంలో పెట్టుబడులు

> **"ఇందులో బి.ఎస్.ఎన్.ఎల్ గతంలోనే తన బాధ్యతతో దేశవ్యాప్తంగా ల్యాండ్‌లైన్ అనుసంధానం కోసం కావాల్సిన మౌలిక వసతు లను కల్పించింది. ఫోన్ల వాడకం తక్కువగా ఉన్న ప్రాంతాలకు కూడా వసతులు కల్పించింది. ఆర్థికంగా ఉపయుక్తంగా లేని ప్రాంతాలకు కూడా అనుసంధానం జరిగింది."**

పెట్టడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

ప్రయివేటు రంగ సంస్థలు మౌలిక వసతుల కల్పన రంగంలో పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టాడానికి ముందుకు రాలేదు. ఎందుకంటే, దీర్ఘకాలిక పెట్టుబడులు, లాభాలు శాతం చాల స్వల్పం, ఎన్నో ఒడిదుడుకులు, ఆశించిన మేరకు ఆదాయం రానటు వంటి పరిస్థితి. అదే సమయంలో ఈ రకమైన పరిశ్రమలు ఏర్పాటు మొత్తం పారిశ్రామిక రంగం అభివృద్ధికి మౌలిక వసతులు రంగం అభివృద్ధి కీలకంగా మారింది. అందువలనే ప్రభుత్వం ఇక్కడ తప్పనిసరి పరిస్థితులలో పెట్టుబడులు పెట్టాల్సివచ్చింది. మూడవ పంచవర్ష ప్రణాళికలో ప్రభుత్వరంగ సంస్థలకు ఇవ్వాల్సిన సహాయానికి సంబంధించిన చర్యలను గురించి స్పష్టంగా పేర్కొన్నారు. "కొన్ని మూలాధారమైన పరిశ్రమలలో భారీ పెట్టుబడులు పెట్టాలని విదేశీ సంస్థలతో, లేదా ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటు కావాలని, స్వల్పకాలంలో లాభాలు ఆశించకుండా, దీర్ఘకాలంలో ఉపయుక్తంగా ఉండేలా భరోసా ఇచ్చే విధంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, అటువంటి పరిశ్రమల ఏర్పాటులో ప్రయివేటు రంగం మీద ఆధారపడటం సరియైన చర్యకాదని స్పష్టంగా పేర్కొంది. అందువలన ప్రయివేటు రంగం చేయలేని ఈ పనిని తప్పని పరిస్థితిలో ప్రభుత్వం పెట్టుబడులు పెట్టి, ఆ బాధ్యతను నెత్తిన వేసుకుంది. కొన్ని ప్రభుత్వ రంగ సంస్థల లాభాలు అత్యంత స్వల్పస్థాయిలో ఉండటం దీని పర్యవసానమే.

ముఖ్యమైన అంశం ఇంకొకటి ఉంది. కొన్ని కీలకమైన రంగాలలో పెట్రోలియం నుండి న్యూక్లియర్ ఎనర్జీ, రైల్వేలు, టెలికమ్యూనికేషన్ వంటివాటిలో అనివార్యంగా ప్రభుత్వరంగమే ఉండాలి. ప్రయివేటురంగానికి అవకాశం ఇవ్వకూడదు. న్యూక్లియర్ ఎనర్జీలాంటి వాటిల్లో పెట్టుబడులపై తక్కువ లాభాలు వస్తాయి. తక్కువ సేవా రుసుముతో పట్టణ ప్రాంతాలలో, అలాగే దేశంమొత్తం అనుసంధానం చేసి తక్కువ లాభాలతో లేదా కొద్దిపాటి నష్టాలలో నైనా నడపాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది.

2013-14లో అత్యంత ఎక్కువ నష్టాలతో నడుస్తున్న సంస్థలు ఎయిర్ ఇండియా, భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ అని తెల్సినా మనం ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. మొత్తం ప్రభుత్వ రంగ సంస్థల నష్టాలలో ఐదింట రెండువంతులకుపైగా ఈ రెండు సంస్థల నష్టాలే ఉన్నాయి. ఇందులో బి.ఎస్.ఎన్.ఎల్ గతంలోనే తన బాధ్యతతో దేశవ్యాప్తంగా ల్యాండ్‌లైన్ అనుసంధానం కోసం కావాల్సిన మౌలిక వసతులను కల్పించింది. ఫోన్ల వాడకం తక్కువగా ఉన్న ప్రాంతాలకు కూడా వసతులు కల్పించింది. ఆర్థికంగా ఉపయుక్తంగా లేని ప్రాంతాలకు కూడా అనుసంధానం జరిగింది. ప్రయివేటు సంస్థలు చేయలేనటువంటి పని ఇది.

ఇవికాక తక్కువ లాభాలతో నడిచేటటువంటి టెక్స్‌టైల్స్ లాంటి పరిశ్రమలు కూడా ఉన్నాయి. వచ్చినటువంటి అదనపు లాభాలు అన్నీ తరలించుకుపోవటం, మిగులును ఇతర సంస్థలకు తరలించటం, పెట్టుబడుల లోటును తిరిగి భర్తీ చేయకపోవటం, యంత్రాలను ఆధునీకరించకపోవటం వలన ఇవి దివాళా తీసేస్థితికి చేరాయి. వేలాదిమంది కార్మికవర్గం బజారునపడే పరిస్థితుల్లో తప్పనిసరిగా ప్రభుత్వాలు వాటిని స్వాధీనం చేసుకుని జాతీయం చేశాయి. నేషనల్ టెక్స్‌టైల్స్ కార్పొరేషన్ దీనికి ఒక ఉదాహరణ. పునర్వ్యవస్థీకరణ జరిగిన తరువాత కూడా టెక్స్‌టైల్ నష్టాలు 213 కోట్లకు చేరాయి. అందుకని ఏ లక్ష్యాల కోసం ప్రభుత్వం రంగాన్ని ఏర్పాటు చేశారో, ఆ లక్ష్యాల కోసం చాలా ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటు కార్పొరేట్ సంస్థల్లా కాకుండా సామాజిక దృక్పథంతో పని చేస్తున్నాయి. ఆ సంస్థల యొక్క ఉత్పత్తుల ధరల నిర్ణయ విధానాలను పరిశీలిస్తే వాటి సారం అర్థమవుతుంది. అదే కార్పొరేట్ రంగంలో పరిశ్రమలు ఆపరేటింగ్ ఖర్చు కన్నా అదనపు శాతాన్ని ధరగా నిర్ణయించి, లాభాలను సృష్టిస్తుంటాయి. మార్కెట్ భరించగలిగేంత వరకు, అమ్మకాలకు ఇబ్బంది లేనంతవరకు, అయిన ఖర్చుమీద అదనపు భారం మోపి, లాభాలు పెంచుకొనేందుకు ప్రయత్నిస్తూనే ఉంటారు.

దీనితో పోల్చిచూస్తే సరళీకరణ విధానాలకు ముందు ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థల ఉత్పత్తుల ధరలను పరోక్ష పన్నులుగా భావించేవారు. కొన్ని ప్రత్యేక రంగాలలో ఈ పన్ను చాలా తక్కువగా ఉంచేవారు. ప్రభుత్వ రంగ సంస్థల ఉత్పత్తుల ధరలుగా సబ్సిడీ ఇచ్చి కొనుగోలుదారులకు అందించే వారు. ఇది ప్రత్యేకంగా అత్యవసర వస్తువుల రంగంలో ఉపయోగించేవారు. ఉదాహరణకు రవాణా, ముడి సరుకులు తక్కువ ధరలకు రావటం వల్ల చిన్న తరహా పరిశ్రమలు, ఇతర ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి అది దోహదమవుతుంది. (ఉదాహరణకు ఉకు, అల్యూమినియం) ఈ రంగాలలో ఒకవేళ నష్టాలు వచ్చినా, పెట్టుబడుల ద్వారా మద్దత్తు ఇవ్వటానికి, ప్రభుత్వం ప్రత్యక్ష లేదా పరోక్ష పన్నుల ద్వారా, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా సంస్థల ఉత్పత్తుల ధరల నిర్ణయం అనేది ప్రభుత్వం యొక్క మొత్తం పన్నులు, సబ్సిడీ విధానంలో కీలకంగా ఉంటుంది.

అందువలన, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రవేశించిన రంగాలను బట్టి, దాని ఉత్పత్తుల ధరలను బట్టి వాటిని భాగాలుగా విడగొట్టవచ్చు. కొన్ని సంస్థలకు తప్పనిసరిగా నష్టాలు వస్తాయి, ఉదా: నేషనల్ టెక్స్ టైల్ కార్పొరేషన్‌లోని సంస్థలు, కొన్ని సంస్థలు నష్టాలు పాలుకాకపోవచ్చు. కొద్దిపాటి లాభాలలో ఉండవచ్చు. ఉదాహరణకు ఉక్కు, ఎరువుల రంగంలో కొన్ని సంస్థలు భారీగా లాభాలు సంపాదించవచ్చు. ఎందుకంటే అవి ఆ రంగంలో దాదాపు గుత్తాధిపత్యంతో ఉండటం, ధరలను మార్చుకునే అవకాశం వల్ల వాటికా అవకాశం ఉంటుంది. ఇందుకు ఉదాహరణ పెట్రోలియం రంగం. అందువలన ప్రభుత్వ రంగ సంస్థలు బహుముఖ రూపాలలో, పన్నుల ద్వారా, డివిడెండ్ల ద్వారా, పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ప్రభుత్వానికి తాను తీసుకున్న దాని కన్నా చాలా ఎక్కువగానే ఆదాయం పోగుచేసింది.

మొత్తం మీద అర్థమయ్యే దేమిటంటే, ప్రభుత్వ రంగ సంస్థల పనితీరు, లాభాలు అనేవి ప్రభుత్వానికి ప్రధానాంశాలు కానేకావు. అదే కనుక నిజమయితే ప్రభుత్వరంగ సంస్థలకు స్వయం ప్రతిపత్తి కలిగించటం, వనరులు అందించటం, లక్ష్యాలను చేరుకోవాలని యాజ

(మిగతా 34వ పేజీలో)

# యెమెన్ విషాదం సామ్రాజ్యవాదుల పాపం



రచయిత ప్రముఖ అంతర్జాతీయ పరిణామాల విశ్లేషకులు

**విజయ ప్రసాద్**

నెల రోజులు గడిస్తే, సౌదీ నాయకత్వంలో యెమెన్‌పై బాంబుల దాడి జరిగి సంవత్సరమౌతుంది. దీని ద్వారా వ్యూహాత్మ కంగా సాధించింది ఏమీ లేదు. 26 మార్చి 2015న సౌదీ బాంబుదాడి మొదలు పెట్టినప్పు డు వెన్ను విరిగిన యెమెన్ రాజకీయ చదరంగం ఎంతటి సంక్లిష్టతను ఎదుర్కోందో, ఇప్పుడూ అదే సంక్లిష్టతలో కొట్టు మిట్టాడుతున్నది.

సౌదీ దాని మిత్ర పక్షాలు యెమెన్ పై ఎందుకు దాడి చేయాల్సి వచ్చింది? ఇంతటి తీవ్ర స్థితికి పురిగొల్పిన పరిస్థితులు ఏమిటో ఇంతవరకు తెలియరాలేదు. 2011 లోని సంధికాలపు ఒప్పందం జరగడానికి దారి తీసింది. అధ్యక్షుడైన మంసౌర్ హదీ తాను 2015 లో రాజీనామా చేసిన సంవత్సరం ముందు నుండే ఆతని మాట సాగడం లేదు. అనేక బృందాలు నూతన ఒప్పందం ద్వారా అధికారం కోసం చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు. సానా (యెమెన్ రాజధాని) ముట్టడి అనివార్యం కాలేదు. ఇలా జరగటం ఎవర్నీ ఆశ్చర్చపచలేదు. సౌదీ బాంబుల దాడి కొనసాగుతూనే ఉంది.

సానాను ఎవరు స్వాధీనం చేసుకున్నారు? రెండు వైరి రాజకీయ పక్షాలుగా ఉన్న హౌతీలు, అలీ అబ్దుల్లా సాలెహ్ నాయకత్వంలోని జనరల్ పీపుల్స్ కాంగ్రెస్ కలిసి హదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా యెమెన్ రాజధాని అయిన సానాను స్వాధీనం చేసికున్నాయి. 2004 నుండి 2010 వరకు అలీ అబ్దుల్లా సాలెహ్, హౌతీలకు వ్యతిరేకంగా యుద్ధం చేశాడు. అయినప్పటికి వాళ్లిద్దరు ఈ అంశంలో ఒకటైయ్యారు.

రాజధాని సానాను స్వాధీనం చేసుకున్నప్పటికీ, సానా ఉత్తర భాగంలోని రేమట్ అల్ హుమయ్ద్ లో రెండు పక్షాల మధ్య ఘర్షణలు జరిగి, వారి మధ్య విభేదాలు బట్ట బయలైనాయి. వాళ్ళ అంతర్గత బలహీనత బయట పడింది. కొంత కాలం గడిస్తే, వాళ్ళ మధ్య శత్రుత్వం మరింతగా తీవ్రమయ్యేటట్లుంది.

కాని ఈ పరిస్థితిని చేరకముందే సౌదీ దాని మిత్ర పక్షాలు జరిపిన బాంబుదాడుల ఫలితంగా వైరి పక్షాలుగా ఉన్న హౌతీలు, సాలెహ్‌ల మధ్య మైత్రి పటిష్టపడి, సౌదీ అరేబియాపై స్కడ్ క్షిపణులను ప్రయోగించే, అత్యంత నైపుణ్యం గల మిలిటరీ సిబ్బందిని వినియోగించుకో కలిగాయి. యెమెన్ విధ్వసమైన ప్పటికి, వాళిద్దరి మధ్య మైత్రి సౌది, దాని మిత్ర పక్షాల దాడిని నివారించగలిగాయి.

యెమెన్ యొక్క ఘొరమైన యుద్ధ విషాదాలలో దాని సంక్లిష్టమైన దేశీయ రాజకీయాలు ఒకటి. ఈ రాజకీయాలు ఇరాన్, సౌదీ అరేబియాల మధ్య నెలకొన్న ప్రాంతీయ, భౌగోళిక రాజకీయ స్పర్ధల చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. ఇరాన్ సాలెహ్, హౌతీలతో అంటీ అంటని సంబంధాలనే నిర్వహిస్తున్నది. ఉమ్మడి షియా సంబంధాలుగా పిలవబడే వారి మధ్య సంబంధాలు బలహీనంగా ఉన్నాయి. యెమెన్‌కి చెందిన జైదీ షియా ఇరాన్ యొక్క 12 షియా ఇమాముల వారసత్వాన్ని, సిద్ధాంతాన్ని అంగీకరించే వాడు కాదు.

ఇరాన్ పలుకుబడిపై సౌదీ అరేబియాకు ఉండే అనుమానాస్పద ధోరణి ఇక్కడ ప్రధాన పాత్ర వహిస్తుంది సంయుక్త రాజ్యమా లేదా వేర్పాటువాదమా, ఉత్తరం దక్షిణం, రిపబ్లికన్ లౌకిక వాదమా లేదా ముస్లిం రాజ్యమా లాంటి యెమెన్ ఇతర సమస్యలు మరుగున పడ్డాయి. కొనసాగుతున్న ఘర్షణలో సౌదీ అరేబియా జోక్యం పరిస్థితుల్ని సంక్లిష్టపరిచి, శాంతి సామరస్య భావనను దాదాపు అసాధ్యం చేసింది.

సౌదీయులు సాలెహ్, హైతీయుల్ని బలహీన పరచాలనుకుంటే తమ వేగుల విభాగం ద్వారా ఆ రెండు పక్షాల మధ్యనున్న అంతరంగిక విభేధాల గుట్టును చేజిక్కించుకోవాల్సి ఉండేది. వాళ్ళను వేరుచేసి విడదీయటమే సౌదీయుల ముందున్న చక్కటి సున్నితమైన మార్గం. కాని మార్చి 26 నుండి మొదలైన బాంబుల వర్షం సాలెహ్, హైతీయుల్ని ఏకం చేసింది. సౌదీయులు ఎందుకు ఇలా చేస్తున్నారు? వాళ్ళు వ్యూహాత్మకంగా ఆలోచించటం లేదా?? పోనీ ఇరాన్ మీద వాళ్ళ కుండే ద్వేషంతో ఇలా చేస్తున్నారా?? సౌదీ అరేబియాలోని స్థానిక సమస్యలు వాళ్ళను యుద్ధం వైపు మళ్ళిస్తున్నాయా?? వాళ్ళ అంతరంగం అంతు చిక్కటం లేదు.

యుద్దానికి ముందే సల్మాన్ రాజు సింహాసనాన్ని అధిరోహించి, తన కొడుకైన మొహమ్మద్ బిన్ సల్మాన్ ను రక్షణ మంత్రిగా నియమించాడు. మొహమ్మద్ బిన్ సల్మాన్‌ను స్థానికంగా ఎంబిఎస్‌గా పిలుస్తారు. బాంబింగ్ మొదలైన తర్వాతి రోజున ఎంబిఎస్ మిలటరీ నిర్వహణ కార్యాలయంలో మ్యాపులను పరిశీలిస్తూ, పైలట్లతో ఫోనులో మాట్లాడుతూ టెలివిజన్‌లో కనిపించారు. ఆయన రక్షణ మంత్రిత్వ శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు వాస్తవంగా కనపడటానికే యెమెన్ యుద్ధం ఒక అవకాశంగా వచ్చినట్లుంది. కాని అది ఇప్పుడు అతని మెడకు ఉచ్చులా తయారైంది. యుద్ధాన్ని గెలవకుండా సౌదీ అరేబియా యుద్దాన్ని విరమించలేదు. దాని రాచరికపు చట్టబద్ధత యుద్ధంలో ఫలితంపై ఆధారపడి ఉంది. దాని ప్రేరణలకు యెమెన్ బలి అయింది.

యెమెన్ అంతర్జాతీయ క్రైసిస్ గ్రూప్ తన నూతన నివేదికలో, “శాంతి సాధ్యమా” అని శాంతిపై ఒక సముచితమైన ప్రశ్న వేస్తునే లోతైన అనుకూల అంచనాన్ని అందిస్తున్నది. స్థానిక, ప్రాంతీయ పరిణామాలు శాంతికి అనుకూలంగా లేవని ఆ బృంద రచన కర్తలు వ్రాస్తున్నారు. రియాద్, తెహ్రాన్ల మధ్య సంబధాలు సన్నగిల్లుతున్న కొద్ది, ప్రాంతీయ సమస్యలకు పరిష్కారాలు మృగ్య మౌతున్నాయి. దేశంలో కూడా వివిధ

**“2కోట్ల 30లక్షల యెమెన్ దేశీయులలో కోటీ 40లక్షల మంది ఆహార రక్షణ కోల్పోయారని యెమెన్‌లోని యూనిసెఫ్ ప్రతినిధి జులియన్ హార్నీస్ వెల్లడించారు. దాదాపు 10 లక్షల మంది పిల్లలు తీవ్రమైన పోషకాహారలేమిని అనుభవిస్తూ, శ్వాసకోస సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు.”**



సౌదీ దాడుల్లో గాయపడిన బాలుని వైద్యం కోసం తీసుకెళ్తున్న స్థానికులు

పార్టీల మధ్య విశ్వాసం దెబ్బతింది. విచ్చిన్న వాద ధోరణి ఇప్పుడు ప్రబలంగా ఉంది.

1990లోని యెమెన్ ఐక్యత ముక్కలయ్యేటంతగా ప్రమాదంలో పడింది. టైజ్ నగరం ఇద్దరి స్వాధీనంలో ఉండి, రెండు శక్తులూ పాతసరిహద్దు దగ్గర కూర్చోటానికే పరిమితమయ్యాయి. దక్షిణ ప్రతిఘటన, హౌతీల సాయుధ బలగాలు ముక్కలుగా ఉన్న యెమెన్ రక్షణ దళం అంతటి ప్రాధాన్యతను పొందాయి. “చారిత్రకంగా హింసకు విచ్చినవాదం చోదక శక్తి కాకపోయినప్పటికి బహుళ ప్రచారంలో ఉంద”ని కాన్ ఫ్లిక్‌లు గ్రూప్ వ్రాస్తున్నది. గతం నుండి కొనసాగుతున్న పగసాధింపు సమస్యలు విపరీతంగా పెరిగాయి. తెగల ప్రాతిపదికన పేట్రేగుతున్న కక్షలు ఘర్షణలను సజీవంగా నిలబెట్టుతున్నాయి,

ఐక్యరాజ్య సమితి ప్రక్కకు నెట్టి వేయబడింది. దానికి అక్కడి సమస్యలు సిరియా సమస్యలతో సమానంగా ఉన్నాయి. భౌగోళిక, రాజకీయ ఘర్షణలు, తుపాకి ఆధిపత్యం కారణంగా క్షేత్రస్థాయిలో ఐక్కరాజ్య సమితి ఆధ్వర్యంలో చర్చలతో సమస్యను పరిష్కరించుకునే వాతావరణం కానరావడం లేదు. క్రైసిస్ గ్రూప్ తన నివేదికలో గణనీయంగా ఉండే పశ్చిమ దేశాల పాత్రను ఈ వ్యవహారాల్లో తక్కువగా చూపింది. ఘర్షణలో తటస్థ పరిశీలకుల పాత్రను నిర్వహించకుండా పశ్చిమ దేశాలు సౌదీలకు ఆయుధాలను అందిస్తూ వారి పక్షాన చేరాయి. షీలా కార్పికో సంపాదకీయంలో రాబోతున్న పుస్తకంలో యెమెన్ వ్యవహారంలో పశ్చిమ దేశాల పాత్రను వివరించటం జరిగింది. యుద్దానికి పశ్చిమ దేశాల మద్దతు సౌదీల అత్యాశను పెంచుతూ, అమెరికా ఆకాంక్షలను బలహీనపరుస్తుంది.

దైవ ప్రచారకుని రథం యెమెన్ చేరింది. దాని రెండు అశ్వాలలో ఒకటి యెమెన్ ను గడగడలాడిస్తున్న కటిక క్షామం. యెమెన్ లో క్షీణిస్తున్న ప్రజల జీవన ప్రమాణాలతో ఐక్యరాజ్య సమితి ఏజెన్సీలు తీవ్రంగా ఆందోళన పడుతున్నాయి. ఆ దేశంలో సగభాగం క్షామంతో తల్లడిల్లుతున్నదని ప్రపంచ ఆహార కార్యక్రమం నెల రోజుల క్రితం ప్రకటించింది. 2కోట్ల 30లక్షల యెమెన్ దేశీయులలో కోటీ 40లక్షల మంది ఆహార రక్షణ కోల్పోయారని యెమెన్‌లోని యూనిసెఫ్ ప్రతినిధి జులియన్ హార్నీస్ వెల్లడించారు. దాదాపు 10 లక్షల మంది పిల్లలు తీవ్రమైన పోషకాహారలేమిని అనుభవిస్తూ, శ్వాసకోస సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. 20 లక్షల మంది పిల్లలు స్కూళ్ళకు వెళ్ళలేకున్నారు. ఈ ఘర్షణలకు పూర్వమే మధ్య ప్రాచ్యంలో కడు పేదదేశంగా ఉన్న యెమెన్‌పై ఈ యుద్ధం యొక్క దీర్ఘకాలిక పర్యవసానాలు ఎంత తీవ్రంగా ఉంటాయో ఎవరైనా ఉహించ వచ్చునని హార్నీస్ అంటున్నారు.

దైవ ప్రచారకుని రెండవ అశ్వం అతివాదం. క్రైసిస్ గ్రూప్ అభిప్రాయం ప్రకారం యుద్ధం వల్ల అరేబియా ద్వీపకల్పపు అల్‌ఖైదా హద్రమౌంట్ ప్రాంతంలోని ముకల్లా లాంటి నగరాలపై పూర్తి పట్టుకలిగి, ఈ యుద్ధంలో టైజ్ నగరంలోని దక్షిణ ప్రతిఘటన తదితర ప్రాంతాలలో చాలా చురుకుగా ఉంది. అది సౌదీ విమాన స్థావరాల్ని గుర్తించి, దాని మూలంగా అనేక ప్రయోజనాలను పొందగలిగింది. ఈ మధ్యలో అరేబియా ద్వీపకల్పపు ఆల్‌ఖైదా నుండి ఇస్లామిక్ రాజ్య బృందం పేర, ఒక చీలిక పక్షం బయటకు వచ్చింది. సానా నగరం నందలి జయ్ది మసీదు దగ్గరలో 140 మందిని చంప గలిగిన సామూహిక దాడిలో ఆది తన స్థాపనను 20.3. 2015న ప్రకటించింది. “మధ్య ప్రాచ్య ప్రకంపనలలో, యెమెన్ యుద్ధ తీవ్రత సాపేక్షంగా గుర్తింపబడలేదు. కాని 2800 మందికి పై బడి, సామాన్య పౌరులు ఈ యుద్ధంలో మరణించారు. వీరిలో అత్యధిక భాగం విమాన దాడులలో ప్రాణాలు పోగొట్టుకున్నారు. వినాశకరమైన క్షామంతో ఆ దేశం మానవత సంక్షోభంతో కునారిల్లుతున్నది. శరణార్థుల సమూహాలు ఆ ప్రాంతాన్ని మరింతగా అతలాకుతలం చేస్తున్నాయి. ” అని క్రైసిస్ గ్రూప్ భావిస్తుంది.

ఈ సముచితమైన అంచనా ఎవరినన్నా మేలుకొలుపుతుందా? అలా జరగాల్సిన అవసరం లేదు. సౌదీ అరేబియా మిత్ర పక్షమైన యునైటెడ్ ఆరబ్ ఎమిరేట్స్, “ఒహూల్ “అల్–రౌమి” ని తన మొదటి “ఆనందం 88 మంత్రి (మినిస్టర్ ఫర్ హపీనెస్) గా నియమించింది. పొరుగు దేశమైన యెమెన్‌లో విషాదం తాండవిస్తుంటే, ప్రక్క దేశంలో అటువంటి మంత్రి నియామకం ఇబ్బందిగానే ఉంది బహుశా! దుబాయ్, షార్జా లాంటి భూతల స్వర్గాలలోని మాల్స్‌లలో, సానా, టైజ్ నగరాలలోని భవంతులలో బాంబుల దాడిలో క్షణ క్షణం భయ కంపితులౌతున్న చిన్నారులకు ఆనందం కలిగించడం కోసమన్నా. ఈ నూతన మంత్రి కృషి చేస్తాడేమో చూద్దాం.

**అనువాదం : కొండముది లక్ష్మీప్రసాద్**

ప్రత్యామ్నాయ ఆర్థిక నమూనా

# చైనా గ్రామంలో సోషలిస్టు సహకార ఉత్పత్తి-పంపకం

కారల్ రాట్నర్



***కారల్ రాట్నర్ మంత్లీ రివ్యూ మాసపత్రిక ఫిబ్రవరి సంచికలో రాసిన “నయా ఉదారవాదంలో ఉన్నతస్థాయి సహకార సంస్థలు- సోషలిస్టు ప్రత్యామ్నాయ సహకార సంస్థలు” వ్యాసంలో చైనాలోని నాన్జి గ్రామ సహకార సమాఖ్యకు సంబంధించిన అంశాలను మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం.***

చైనాలోని కొన్ని గ్రామీణ స్థాయి సహకార ఉత్పత్తి సంఘాలలో సోషలిస్టు సహకార ఉత్పత్తి, రాజకీయ సంబంధాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఇవి రాబర్ట్ ఓవెన్ ఊహించిన సహకార గ్రామాలైన న్యూ లానార్క్, న్యూ హార్మొని తరహాలో ఉన్నాయి.

వీటిని గురించిన పెద్ద ఉదాహరణ హెనాన్ ప్రావిన్స్‌లోని నాన్జి గ్రామం. ఈ గ్రామం 3000ల మంది జనాభాతో, 850 కుటుంబాలతో రెండు చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో విస్తరించి ఉంది. 26 పరిశ్రమలు, ఆరు కో ఆపరేటివ్ కార్పొరేషన్‌లతో గ్రామం మొత్తం ఒక చట్టబద్ధమైన సమాఖ్య ( కార్పొరేషన్)గా ఉంది. 21 మందితో కూడిన నాయకత్వ కమిటి గ్రామ వ్యవహారాలను నిర్వహిస్తుంది. ఈ కమిటిలో తొమ్మిది మంది చైనా కమ్యూనిస్టుపార్టి అధికారులు, గ్రామ నాయకులు, కార్పొరేట్ సంస్థల నాయకులు ఉన్నారు. కమిటిలోని కొంతమంది నాయకులు కౌంటిస్థాయి సంఘాలు, చైనా కమ్యూనిస్టుపార్టి సంఘాలలోనూ సభ్యులుగా ఉన్నారు. నాన్జి అధ్యక్షుడు వాంగ్ హాంగ్ బిన్ కమ్యూనిస్టుపార్టి స్థానిక కార్యదర్శిగా ఉన్నాడు. లక్షలాది డాలర్ల విలువచేసే ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తున్న నాన్జి గ్రామ సహకార సమాఖ్యకు ఆయన నాయకునిగా ఉంటూ, ఎటువంటి బోనస్‌లు తీసుకోకుండా నెలకు 37 డాలర్లను మాత్రమే జీతంగా తీసుకొంటున్నాడు. గ్రామ ప్రభుత్వ సంస్థలు కార్పొరేషన్‌లను, గ్రామ ఆర్థిక వ్యవహారాలను, పాఠశాలలను, ప్రజావసరాలను, పోలీసు, సామాజిక సేవలను పర్యవేక్షిస్తాయి. మొత్తం భూమి, వనరులు, పారిశ్రామిక సంస్థలు గ్రామ ప్రజల ఉమ్మడి ఆస్థులుగా ఉన్నాయి. ప్రజలందరూ కలిసి గ్రామ కమిటిని ఎన్నుకొంటారు.

1970వ దశాబ్దంలో నాన్జి పేదరికంతో వెనుకబడిన ప్రాంతంగా ఉండేది. ఇక్కడ విస్తారంగా గోధుమ పండుతున్నప్పటికీ ఒక్క గోధుమపిండి మిల్లు కూడా ఉండేది కాదు. కమ్యూనిస్టుపార్టి సభ్యులు తమ బంధువులు, స్నేహితుల వద్ద అప్పులు తీసుకొని, ఒక నిర్మాణ సంస్థ ద్వారా గోధుమపిండి మిల్లును నిర్మించారు. 1979లో నిర్మాణం పూర్తయిన ఆ మిల్లులో రోజుకు 20 టన్నుల గోధుమలను మర ఆడించేవారు. నిరంతరం అమ్మకాలు కొనసాగించటం కోసం పెకింగ్‌లోని గోధుమపిండి ఉత్పత్తుల ఫ్యాక్టరితో 15 సంవత్సరాలకు ఒప్పందం చేసుకున్నారు. 1985లో ఈ మిల్లు తన స్వంత గోధుమపిండి ఉత్పత్తులను ప్రారంభించింది.

1976లో పనిచేయకుండా ఉన్న మధ్య తరహా ఇటుకల ఫ్యాక్టరి మాత్రమే గ్రామంలో వ్యవసాయేతర ఆస్థిగా ఉండేది. కొత్త ఇళ్ళు కట్టుకోవటానికి గ్రామస్తులకు ఇటుకలు కావలసి వచ్చాయి. ఇటుకలు కావలసిన గ్రామస్తులు ఇటుకల కోసం ముందుగానే డబ్బు చెల్లించటం ద్వారా నిధులను సమీకరించి, ఫ్యాక్టరిలో పునరుత్పత్తిని ప్రారంభించారు. ఈ విధంగా 43,000 డాలర్లను పోగుచేయటం ద్వారా 1981లో ఇటుకల ఫ్యాక్టరిలో ఉత్పత్తిని మొదలు పెట్టారు. 1991 నాటికి రెండు కోట్ల డాలర్ల అమ్మకాలతో నాన్జి హెనాన్ ప్రావిన్స్‌లో అత్యంత సంపద్వంతమైన గ్రామంగా ఉంది.

ఇక్కడి సంక్షేమ వ్యవస్థ స్వయం ఉపాధి చూసుకుంటున్నవారితో కలిపి మొత్తం గ్రామస్తులందరికి మంచినీరు, విద్యుత్, బొగ్గు, ఇళ్ళు తదితరాలను ఉచితంగా అందజేస్తుంది. హోళ్ళి, లాంతర్ల పండుగ, ఆకురాలు కాలం మధ్యలో వచ్చే పండుగ, నూతన సంవత్సరం తదితర పండుగలకు అందరికి మాంసాన్ని ఉచితంగా అందిస్తారు. కుటుంబం యొక్క సైజును బట్టి అవసరం ప్రాతిపదికగా అన్నింటిని నిర్ణీత

**“ ఆహారం, ఇల్లు, మందులు, విద్య, ఇతర అవస రాలు వారి యొక్క డబ్బు, తెలివితేటలు, పనిచేసే టైం, తదితరాల ఆధారంగా కేటాయించబడవు. మీరు గ్రూపు సభ్యులు కాబట్టి మీకుకావలసిన వాటన్నింటిని గ్రూపు మీకు సమకూరుస్తుంది. సభ్యుల శక్తిసామర్థ్యాలతో నిమిత్తం లేకుండా గ్రూపులోని ప్రతి సభ్యుడ్ని సమానంగా చూస్తు న్నారు. ”**



గ్రామంలో సహకార రంగ పరిశ్రమలో కార్మికులు

మొత్తంలో అందిస్తారు.

ప్రజల కోసం ఫర్నిచర్‌తో కూడిన అపార్ట్‌మెంట్లను నిర్మించటానికి సమాఖ్య గ్రామకమిటి తన ఆదాయంలో కొంతభాగాన్ని కేటాయించింది. 1992-97 మధ్య కుటుంబం యొక్క పరిమాణాన్ని బట్టి తమకు కేటాయించబడ్డ ఉచిత అపార్ట్‌మెంట్లలోకి ప్రజలు వెళ్ళి అక్కడ నివసిస్తున్నారు. గ్రామ సమూహాలు, వివిధ జాతులకు చెందినవారు కలిసివుండే భవనాలలో నివసిస్తున్నారు. శారీరక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని పెద్దవయసు వారికి కింది ఫ్లాట్లు, యువకులకు పైభాగంలోని ఫ్లాట్లను కేటాయిస్తున్నారు. ప్రతి అపార్ట్‌మెంటులోనూ ఒకే విధమైన నాణ్యత గల ఫర్నిచర్, పరికరాలు, సెంట్రల్ ఎయిర్ కండిషన్, హీటింగ్ పరికరాలను అమర్చారు. నెలకు సరిపోయేలా మాంసం, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, పానీయాలు, వంటనూనెలు, చిరుతిళ్ళు తదితరాలను ప్రతినెలా గ్రామస్తులందరికి సరఫరా చేస్తారు. గ్రామస్తులకు విద్య, వైద్యం, వివాహాలు, అంత్యక్రియలు తదితర అవసరాలను కూడా గ్రామకమిటీయే తీరుస్తుంది. గ్రామ ఆసుపత్రిలో నయం చేయలేని తీవ్రమైన జబ్బులు చేస్తే రోగులు పెద్ద పట్టణాలకు వెళ్ళి, ఉచితవైద్యం పొందే సదుపాయాన్ని గ్రామకమిటీయే కల్పిస్తుంది. గ్రామం బయటికి వెళ్ళి చదువుకోవటానికి అయ్యే ఛార్జీలను, వసతి, ట్యూషన్ ఫీజులను గ్రామకమిటి చెల్లిస్తుంది. వృద్ధులకు ఉచిత ఆహారం, వైద్యం, నివాసం, వినోదం తదితరాలతో కూడిన ఉచిత నర్సింగ్‌హోంలను గ్రామకమిటి నిర్వహిస్తున్నది.

గ్రామస్తులందరికీ ఉద్యోగాన్ని గ్యారంటి చేశారు. వారు కోరుకొంటే ఎపుడైనా గ్రామం విడిచి వెళ్ళవచ్చు. ఎపుడైనా తిరిగి రావచ్చు. అనేక సంస్థల మేనేజర్లు తమ స్వంత పరిశ్రమలను స్థాపించుకొనటానికి గ్రామం విడిచి వెళ్ళారు. మార్కెట్ ఆర్థికవ్యవస్థలో పోటీకి తట్టుకోలేక అందరూ విఫలమై, నాన్జికి తిరిగివచ్చి వివిధ సంస్థల నిర్వాహకులుగా పనిచేస్తున్నారు.

ప్రజల హోదా, స్థాయిని (పనిలో నైపుణ్యం, నిల్వచేసిన ధనాన్ని) బట్టికాక వారి అవసరాన్నిబట్టి అనేక రాయితీలను కల్పిస్తున్నారు. సరుకులు, సేవల వాణిజ్యీకరణను కనీసస్థాయికి తగ్గించటం, మానవత్వంతో అవసరాన్ని బట్టి వాటిని అందజేయటం ద్వారా సమానత్వాన్ని పెంపొందిస్తూ, అసమానతలను నామమాత్రపు స్థాయికి తగ్గించారు. నీకు పెద్ద కుటుంబం ఉన్నట్లైతే నీకు పెద్దయిల్లు అవసరం అవుతుంది. నీకు పెద్ద ఇంటిని కేటాయిస్తారు. నీవు అనారోగ్యంతో ఉంటే నీకు ఎక్కువ వైద్యసేవలు కావలసి ఉంటాయి. నీకు వైద్యసేవలను అందిస్తారు. అవసరమైన ప్రయోజ నాల్ని పొందటానికి డబ్బు ప్రాతిపదికగా లేదు. వాస్తవంగా ఏ ఉద్యోగం చేస్తున్నామనేదానితో నిమి త్తం లేకుండా ప్రతివారు నెలకు 50 డాలర్ల కనీస వేతనాన్ని పొందుతున్నారు.

మానవుల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తిని, పంపిణిని నిర్వహించటం వలన మార్కెట్ ఆధారిత ఆర్థికవిధానాలు పక్కకు నెట్టబడతాయి. సభ్యుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని గ్రూపుల వారీగా ప్రణాళికలను రూపొందించారు. గ్రూపు లోని సభ్యుల అవసరాలను తీర్చటానికి గ్రూపు కృషి చేస్తుంది. సభ్యుల అవసరాలను తీర్చటానికి ఉమ్మడి ఉత్పత్తిని వినియోగించుకొంటూ, గ్రూపును అభివృద్ధి చేయటానికి సభ్యులు కృషిచేస్తారు. ఆహారం, ఇల్లు, మందులు, విద్య, ఇతర అవస రాలు వారి యొక్క డబ్బు, తెలివితేటలు, పనిచేసే టైం, తదితరాల ఆధారంగా కేటాయించబడవు. మీరు గ్రూపు సభ్యులు కాబట్టి మీకుకావలసిన వాటన్నింటిని గ్రూపు మీకు సమకూరుస్తుంది. సభ్యుల శక్తిసామర్థ్యాలతో నిమిత్తం లేకుండా గ్రూపులోని ప్రతి సభ్యుడ్ని సమానంగా చూస్తు న్నారు. కాబట్టి నిజమైన సర్వమానవ సమానత్వం అంటే ఇదే. విశ్వవ్యాప్త మానవహక్కులను, మానవత్వ గౌరవాన్ని కాపాడటమే ఇది. ( దీనికి భిన్నంగా స్థాయి, ఆదాయాన్ని బట్టి ఎంచుకొనే సమాజంలో పరిమితమైన శక్తిసామర్థ్యాలు గలవారిని అగౌరవపరుస్తూ, వారికి అందాల్సిన సామాజిక సదుపాయాలలో కోతపెడతారు. మార్కెట్ ఆధారిత ఆర్థికవ్యవస్థలో సార్వజనీన మానవహక్కులు అపహాస్యం చేయబడతాయి).

వాస్తవమైన సహకారం, న్యాయపరంగా, నిష్పాక్షికంగా వ్యవహరించటం అనే అంశాలను పూర్తిగా మార్చివేస్తాయి. అది వ్యక్తులు వ్యక్తిగతంగా చేసిన పనికి తగిన ప్రతిఫలం ఇచ్చేస్థానంలో గ్రూపుసభ్యులు చేసిన పనికి ప్రతిఫలం ఇవ్వటంగా ఉంటుంది. వ్యక్తులు చేయగలిగిన పనిని తమ శక్తిమేరకు చేస్తే వారు భిన్నమొత్తాల్లో పనిచేసినా వారందరికీ సమానమైన పరిహారం ఇవ్వటం న్యాయమే అవుతుంది. అందువలన పని, తెలివి తేటలు,

శక్తిసామర్థ్యాలు, ఉత్పత్తుల విలువను లెక్కిం చాల్సిన పనిలేదు. అవసరాల ప్రాతిపదికగా చేసే ఉత్పత్తి, పంపిణి మారకం విలువపై ఆధారపడిన మార్కెట్ లావాదేవీలను పక్కన పెడుతుంది.

ఈ విధంగా కావలసిన అవసరాలను తీర్చటం మార్కెట్ ఆధిపత్యానికి, మార్కెట్‌ను సాధనంగా వినియోగించుకొనే అవకాశాలకు స్వస్థి పలుకుతుంది. విద్యనో, మందులనో కొనుక్కోవటం కోసం చేసిన ఉత్పత్తిని మారకం చేసుకొని డబ్బు సంపాదించటానికి నీవు పనిచేయటం లేదు. మందులు, విద్య నీకవసరం కాబట్టి నీవు వాటిని పొందుతున్నావు. నీ విద్య, మందుల అవసరాలను తీర్చటానికి గ్రూపు ప్రత్యక్షంగా పూనుకుంటున్నది. నీ అవసరాలను సమైక్యంగా తీర్చటం కోసం కొన్ని విధాలైన, కొంత మొత్తం పనులను గ్రూపు ప్రత్యేకంగా కేటాయిస్తున్నది. సరుకుల మార్కెట్ ప్రజల అవసరాలను వ్యక్తిగతమైనవిగా చేసి, ఎవరికి వారు తమ అవసరాలను తీర్చుకోవటం కోసం వ్యక్తిగతంగా నిధులు సమకూర్చుకొనే విధానాన్ని రుద్దుతున్నది. సహకార విధానం దాన్ని పక్కనపెట్టి, వ్యక్తుల అవసరాలను గ్రూపు యొక్క అవసరాలుగా మార్పుచేసింది.

సామాజీకరించబడిన అవసరాలు వ్యక్తుల ను, గ్రూపును కలిపి ఐక్యంగా ఉంచుతాయి. వ్యక్తి గతం చేయబడిన అవసరాలు వ్యక్తిని గ్రూపు నుండి విడదీసి దూరం చేస్తాయి. సాంస్కృతిక, మానసిక అభివృద్ధి ఫలితంగా తలెత్తిన అవసరాలను సామాజికంగా అర్థం చేసుకోవటం, తీర్చటం -అవసరాలను సమగ్రంగా పరిశీలించటం, వాటిని తీర్చటానికి అనుసరించే విధానం- సమాజాన్ని నిర్వహించటంలో కీలకస్థానం ఆక్రమిస్తాయి. నిర్దిష్టమైన అవసరాలు ఒక రాజకీయ, ఆర్థికోత్పత్తి విధానంలో ముఖ్యాంశాలుగా ఉంటాయి. ప్రజల అవసరాలను తీర్చటానికి సహకారంపై ఆధారపడిన సామాజిక నిర్మాణం అవసరమౌతుంది. సహకారం నిరంతరం నిర్దిష్టమైనరూపంలో, ఒక నిర్దిష్టమైన ఉత్పత్తి విధానంతో, లేక ఉత్పత్తి నిర్వహించబడుతున్న విధానంతో కలిసి ఉంటుంది.

సామాజిక అలవాట్లు, ఆచారాలను నూత న విధానాలు, సంబంధాలు తక్షణమే రూపు మాపలేవని నాన్జి గుర్తించింది. అటువంటి ఆలోచ నలను ప్రజలలో విలువ లేకుండా బట్టబయలు చేసి, వాటి స్థానంలో నూతన ఆలోచనలను ప్రచారంలో పెట్టేవరకూ

“ఉత్పత్తి, పంపకం, నిజాయితీగా వ్యవహరించటం, సామా జిక మద్దత్తు, సభ్యుల అవసరాలు తీర్చటంలో నాన్జి సహకార విధానం నిర్దిష్టమైన పెట్టుబడిదారీ వ్యతిరేక, సామాజిక యాజమాన్యంలో ఉంది.”



గ్రామ కూడలిలో లెనిన్, స్టాలిన్ తదితర మార్క్సిస్టు మహోపాధ్యాయుల చిత్రపటాలు

గ్రామస్తులు సహకార విధానాన్ని వ్యతిరేకిస్తూ పాత భావాలతోనే ఉన్నారు. వ్యక్తులు స్వీయ పరిశీలన చేసుకోవటానికి, వారి పనిని ఇతరులు అంచనా కట్టటం ద్వారా నూతన విధానాలను, సంబంధాలను వ్యతిరేకిస్తున్న వారి ప్రతికూల భావాలను సరిచేయటానికి ఈ పరివర్తనా కాలంలో కృషి జరిగింది. సహకార దృక్పథం, ఇతరులను సన్నద్ధం చేయటం, సమయ పాలన తదితర అంశాలపై నాన్జి గ్రామస్తులను వారి సూపర్‌వైజర్లు అంచనా వేశారు. చట్టవ్యతి రేకంగా వ్యవహరిస్తున్నవారు అలా వ్యవహరించిన ఘటనల సంఖ్య, తీవ్రత, పదేపదే అదేవిధంగా వ్యవహరిస్తున్న తీరు మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకొని, అటువంటి వారికి అంది స్తున్న సంక్షేమ ప్రయోజనాలను క్రమబద్ధంగా తగ్గించటం ద్వారా వారిని శిక్షించటానికి చర్యలు తీసుకున్నారు.

పశ్చిమ దేశాలలోని సహకార సంఘాల కన్నా నాన్జి సహకార విధానం మరింత మానవ త్వంతో కూడిన, అభివృద్ధి దిశలో ఉందని హా చేసిన పరిశోధనల ద్వారా స్పష్టమౌతున్నది.

ఉత్పత్తి, పంపకం, నిజాయితీగా వ్యవహరించటం, సామా జిక మద్దత్తు, సభ్యుల అవసరాలు తీర్చటంలో నాన్జి సహకార విధానం నిర్దిష్టమైన పెట్టుబడిదారీ వ్యతి రేక, సామాజిక యాజమాన్యంలో ఉంది. మార్కెట్ ఆర్థిక విధానాలను కనిష్ఠస్థాయికి తగ్గించేందుకు సాధనాలుగా ఉపయోగపడే, అహంకార ధోరణిని తగ్గించే సహకార ఉత్పత్తి విధానం అమలు జరుగు తున్నది. అది పెట్టుబడిదారీ విధాన పర్యవసానా లను తొలగిస్తూ, దాన్ని మార్చేందుకు కృషి చేస్తున్నది. ఈ విధమైన సర్వమానవ సమానత్వంపై ఆధార పడిన నిజమైన సహకార వ్యవస్థను నెలకొల్ప టానికి సోషలిస్టు సహకార విధానాలను అమలు చేయటం అవసరం.

పశ్చిమ దేశాల సహకార సంఘాలలో సరు కుల ఆధారిత ఆర్థిక విధానాలను, రాజకీయాలను, యధాతథ పరిస్థితులను కొనసాగించే మానసిక స్థితిని, నిబంధనలను అమలుచేయటానికి ప్రయత్ని స్తుంటారు. అవసరం, సరఫరా ఆర్థిక సూత్రాలను వారు ఆమోదిస్తారు. వ్యక్తుల అవసరాలను తీర్చటానికి సాధనంగా వ్యక్తుల జీతభత్యాలను పరి

> **❝ఉత్పత్తి, పంపకం, నిజాయితీగా వ్యవహరించటం, సామా జిక మద్దత్తు, సభ్యుల అవసరాలు తీర్చటంలో నాన్జి సహకార విధానం నిర్దిష్టమైన పెట్టుబడిదారీ వ్యతిరేక, సామాజిక యాజమాన్యంలో ఉంది. ❞**

నేషనల్ కోఆపరేటివ్ బిజినెస్ అసోసియేషన్ (యన్‌సిబిఎ), ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ అసోసియేషన్ (ఐసిఎ) లాంటి సంస్థలు మార్గదర్శులుగా ఉన్నాయి.

సహకార సంఘాలను నడిపేవారు అనుసరించాల్సిన ఒక నమూనాగా నాన్జి సహకార సంఘాన్ని పరిగణించాల్సి ఉంటుంది. మార్క్స్ చేసిన ఈ దిగువ వ్యాఖ్యకు నాన్జి తగినదిగా ఉంది. '' సహకార ఉత్పత్తి మోసపూరితమైనదిగానూ, అదొక ఉచ్చులాగానూ కాకుండా ఉండాలి. అది పెట్టుబడిదారీ ఉత్పత్తి

గణిస్తారు. సహకార వ్యతిరేక, యధాతథ విధానాలను కొనసాగించే ఇటువంటి సహకార సంఘా లు నిజమైన సహకార విధానాల ద్వారా సర్వ మానవ సమానత్వాన్ని సాధించటాన్ని నిరోధిస్తాయి.

నాన్జి గ్రామం మొత్తం సహకార విధానంలో ఉండటం దానిని పశ్చిమ దేశాల సహకార సంఘాల కన్నా ఉన్నతంగా నిలబెట్టే మరో ముఖ్యాంశంగా ఉన్నది. అనేక విధాలుగా భిన్నమైన, వివిధ రకాల కార్యకలాపాలను నిర్వహిస్తున్న సంస్థలను సమన్వ యం చేసి, ఒక పెద్ద సహకార వ్యవస్థలో అంతర్భా గంగా చేయటంలో ఇది ప్రధానాంశంగా ఉన్నది. ఇది స్థానిక ఆర్థిక, పాలనాపరమైన శక్తులను ప్రాంతీయ, ఫెడరల్ ప్రభుత్వాలకు అనుసంధానం చేయటం ద్వారా స్థానిక కార్యకలాపాలకు, సంస్థల కు నిధులు ఇవ్వటం, వాటి కార్యకలాపాలను సమన్వ యం చేయటంలో తోడ్పాటునందిస్తుంది. పశ్చిమ దేశాల సహకార సంఘాలలోని స్థానికతత్వాన్ని అధిగమించటానికి ఇది తోడ్పడుతుంది. సహకార విధానాన్ని జాతీయ రాజకీయ విధానంతో మిళితం చేయటంతో అది సహకార విధానాన్ని ఒక జాతీయ సామాజికాంశంగా ప్రచారం చేయటానికి, అధ్యయనం చేయటానికి,



గ్రామంలోని సహకార గృహ సముదాయం. గ్రామంలో ప్రతిఒక్క కుటుంబానికీ ఇటువంటి ఇళ్లున్నాయి

పాఠశాలల్లోనూ, పని ప్రదేశాలలోనూ, ప్రభుత్వ సంస్థలలోనూ వ్యాప్తి చేయటానికి దోహదం చేస్తుంది. గ్రామీణ సహకార సంఘాలలో సోషలిస్టు ఆర్థిక, రాజకీయ విధానా లను అభివృద్ధి చేయటంలో చైనా కమ్యూనిస్టుపార్టీ ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తున్నది. పశ్చిమదేశాల సహకార సంఘాలకు ఈ విధమైన సోషలిస్టు రాజకీయ సహకారం కాని, మార్గనిర్దేశం కానిలేదు. వాటికి విధానాన్ని అధిగమించి ముందుకు పోవాలి. ఉమ్మడి ప్రణాళిక కనుగు ణంగా ఐక్య సహకార సంఘాలు జాతీయ ఉత్పత్తిని క్రమబద్దీకరించటం ద్వారా దానిని తమ చేతుల్లోకి తీసుకొని, పెట్టుబడిదారీ విధానానికి సహజసిద్ధ మైన ఉత్పత్తిలో అరాచకానికి, నియమిత కాలాల్లో సంభవిస్తూ పెట్టుబడిదారీ విధానాన్ని కుదిపి వేస్తున్న సంక్షోభాలను నివారించటానికి పూను కుంటే, అది కమ్యూనిజం కాక మరేమౌతుంది? '' దీనిని సాధించా లంటే చైనా సమాజంలో సోషలిజాన్ని, కమ్యూనిజాన్ని కోరుకొంటూ సర్వవ్యాపితమైన ఉద్యమం రావాల్సి ఉంటుంది. ఒక గ్రామ సహకార సంఘంలో సహకారం గాని, సోషలిజం కాని ఉండదు. చైనా అమలు జరుపుతున్న మార్కెట్ అనుకూల ఆర్థిక సంస్కరణలు నాన్జి, ఇతర సహకార సంఘాలను, జాతీయ సోషలిస్ట ప్రభుత్వాన్ని దెబ్బతీస్తాయి. ఏమైనప్పటికి సహకార అభివృద్ధిని సాధించాలనుకొనే దేశాలకు నాన్జి ఇప్పటికే అనుసరించదగిన ఒక నమూనాగా అభివృద్ధి అయింది. **(అనువాదం : ఎ. కోటిరెడ్డి)**



మావో భారీ కటౌట్

పుస్తక సమీక్ష

లెనిన్ ప్రసిద్ధ వ్యాసం (కరపత్రం)

# ముంచుకొస్తున్న ముప్పు దాన్ని ఎదుర్కోవడం ఎలా?

ఎన్.వి.ఎస్ నాగభూషణ్

ఈ వ్యాసాన్ని లెనిన్, పార్టీ ఆదేశాల మేరకు ఫిన్లాండ్‌లో రహస్య జీవితం గడుపుతున్న సమయంలో 1917, సెప్టెంబర్ 10-14 తేదీల మధ్య రాశాడు. ఆ సమయంలో రష్యా మొదటి సామ్రాజ్యవాద యుద్ధం (1914-18)లో నిండా మునిగి ఉంది. యుద్ధం కారణంగా ఘోర కడగండ్లు అనుభవిస్తున్న జనాన్ని విప్లవం వైపు వెళ్ళకుండా చూసేందుకు పాలకపక్షమైన ఎస్.ఆర్.లు (సోషలిస్టు రివల్యూషనరీలు), మెన్షివిక్కులూ, ప్రజలకు శాంతినీ, రైతాంగానికి భూమినీ, ఆకలిగొన్న వారికి రొట్టెనూ త్వరలోనే ఇస్తామని వాగ్దానం చేశారు. అయితే వారు సామ్రాజ్యవాద ప్రయోజనాలకు అనుగుణంగా పెట్టుబడిదారులు, భూస్వాములతో కుమ్మక్కై, యుద్ధాన్ని కొనసాగిస్తూ, ప్రజల్ని మరికొంతకాలం ఓపిక పట్టమని మభ్యపుచ్చుతున్నారు. మరొకప్రక్కన విప్లవకారుల గొంతునొక్కేందుకు ప్రధాని కెరెన్స్కీ, పెట్టుబడిదారుల అండతో సైనిక తిరుగుబాటుకు ప్రయత్నించిన జనరల్ కోర్నీలోవ్ దళాల్ని, శ్రామిక ప్రజలు రెడ్‌గార్డుల నాయకత్వంలో ఓడించారు. దాంతో భయపడ్డ పెట్టుబడిదారులు, కరువు రక్కసి మొండి చేతితో విప్లవాన్ని గొంతు నులిమే ఆశతో, ఉద్దేశ్యపూర్వకంగా ఆర్థిక ఇబ్బందుల్ని తీవ్రం చేసేందుకు యత్నించారు. ఈపరిస్థితుల్లో లెనిన్, ప్రజలనూ, ప్రభుత్వాన్నీ హెచ్చరిస్తూ, ఈ వ్యాసాన్ని రాశాడు. ఇప్పుడు ఈ వ్యాసంలోని అంశాల్ని క్లుప్తంగా తెలుసుకుందాం. ఈ వ్యాసం 13 ఉప శీర్షికలుగా విభజించబడింది:

### కరువు దాపురిస్తోంది

రష్యా త్వరలో ఘోరమైన ముప్పుకు గురికాబోతుందనీ, రైల్వే రవాణా వ్యవస్థ అస్తవ్యస్త స్థితిలో స్తంభించిపోతోందనీ, దీనికితోడు పెట్టుబడిదారులు కావాలని సృష్టిస్తున్న విచ్ఛిన్న చర్యలవల్ల తిండిగింజల సరఫరా జరగక, ఫ్యాక్టరీలు ఉత్పత్తి నిలిచిపోయీ, తత్పర్యవసానంగా మొత్తం రిపబ్లిక్, ప్రజాస్వామ్యం, సోవియట్లు, శ్రామిక, రైతుసంస్థలు కూలిపోతాయనీ, తద్వారా రాజరిక పునరుద్ధరణ జరిగి, భూస్వాములకూ, బూర్జువాలకూ అపరిమిత అధికారాలు దక్కుతాయని పెట్టుబడిదారులు ఆశిస్తున్నారనీ వ్యాసారంభంలోనే లెనిన్ హెచ్చరించాడు.

ఈ దాపురించబోయే కరువు ముప్పు గురించీ, దాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించీ పత్రికలూ, పార్టీలూ, సోవియట్లూ, ఎన్నో హెచ్చరికలు, సూచనలు చేసినా, ప్రభుత్వం ఏ చర్యలూ తీసుకోవడం లేదని ఆయన విమర్శించాడు.

బూర్జువా విప్లవం (తాత్కాలిక విప్లవంలో జార్‌ని దింపేసి, ఫిబ్రవరి 1917లోనే ద్వంద్వాధికారం ఏర్పడి) జరిగి అప్పుడే ఆరు నెలలు గడిచినా, పొంచి వున్న ప్రమాదం మరింత దగ్గర పడిందని ఆయన గుర్తుచేస్తాడు. ఆ ఆర్నెల్లకాలంలో నిరుద్యోగం పెరిగిపోయింది. రష్యాలో కావలసినన్ని తిండిగింజలు, ముడిపదార్థాలు వున్నా, తిండి కొరత ఏర్పడింది. యుద్ధంవల్ల జాతీయ జీవితపు ప్రతిరంగంలోనూ అస్తవ్యస్థ స్థితి మరింత ఎక్కువవుతుందనీ లెనిన్ హెచ్చరిస్తాడు.

అయితే ఈ ముప్పునూ, కరువునూ ఎదుర్కొనే సరళమైన, సూటియైన, ఆచరణయోగ్యమైన చర్యల్ని తీసుకోకపోవడానికి కారణం, భూస్వాములకూ, పెట్టుబడిదారులకూ వచ్చే ఊహాతీత లాభాల్ని దెబ్బతీస్తాయన్న ఉద్దేశ్యంతోనే అని అందరికీ తెలుసుననీ, అందువల్లనే రాబోయే ముప్పునూ, కరువునూ ఎదుర్కొనేందుకు ప్రభుత్వ అజమాయిషీ, తనిఖీ, అకౌంటింగ్ వంటి చర్యలను సరిగ్గా అమలు చెయ్యడంలేదనీ విమర్శించాడు.

### ప్రభుత్వపు పూర్తి క్రియాశూన్యత

అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసే అన్నిరకాల అజమాయిషీ, తనిఖీ, అకౌంటింగ్ ప్రక్రియలకు తూట్లు పొడిచే పని 'విప్లవ ప్రజాస్వామిక' సంస్థల్లో కూడా నిరాఘాటంగా కొనసాగుతోందని ఆయన ఎద్దేవా చేస్తాడు. 'రాజరిక రూపాల స్థానంలో రిపబ్లికన్ ప్రజాస్వామిక ప్రభుత్వ రూపాలను ప్రవేశపెట్టినంతమాత్రాన, పెట్టుబడిదారీ దోపిడీ ఆర్థికసారంలో ఏ విధంగానూ మార్పురాదు. ఆ లాభాలు కొనసాగాలంటే పోరాట రూపాలను మాత్రం మార్చాలి" ఈ వాస్తవాన్ని శాస్త్రీయ సోషలిజం సమర్థకులంతా చాటి చెబుతారు. దీన్ని మెన్షివిక్కులూ, ఎస్.ఆర్.లూ తమ వాళ్ళ మంత్రిపదవులూ, ఇతర సుఖవంతమైన పదవులూ పొందగానే మర్చిపోయారుగానీ, పెట్టుబడిదారీ పెద్దమనుషులు మాత్రం మర్చిపోలేదంటాడు లెనిన్. అందువల్లనే తమ లాభాల కొనసాగింపుకోసం వారు ఒకపక్క అజమాయిషీని ఆమోదిస్తూనే, మరోప్రక్క ఆ అజమాయిషీని "క్రమబద్ధమైన ప్రభుత్వ నియంత్రిత పద్ధతి"లో ఉండాలని పట్టుబడతారని ఆయన అంటాడు. పైకి ఆకర్షణీయంగా కనిపించే ఈ పదాల చాటున, ఆ అజమాయిషీని భగ్నం చేసే నిర్జీవ సంస్థల ఏర్పాటు ఉంటుందని ఆయన చెబుతాడు.

ఈ విషయానికి సమర్థనగా పై రెండు పార్టీలు అధికారంలో వున్న సోవియట్ల అధికార పత్రిక "ఇజ్వేస్తియా"లో ప్రకటించబడ్డ ఒక అజమాయిషీ సంస్థ ప్రకటనను చూపిస్తాడు. అందులో "ఆర్థిక జీవితాన్ని నియంత్రితం చేసేందుకు ప్రభుత్వం కింద నెలకొల్పబడిన సంస్థల పూర్తి క్రియాశూన్యత' ఉన్నట్లు ఒప్పుకోబడింది. ఇది మెన్షివిక్, ఎస్.ఆర్.లు తమ పతనానికి తామే చేసిన ఒప్పుకోలు ప్రకటన అంటాడాయన.

నిజానికి జారిజమ్ ఆర్థిక జీవిత నియంత్రణావసరాన్ని గుర్తించి అందుకు కొన్ని సంస్థల్ని నెలకొల్పిందనీ, అయినా ఆర్థిక అస్తవ్యస్థ స్థితి తీవ్రంగా పెరిగిపోయిందనీ, దీన్ని నివారించేందుకు పటిష్టమైన చర్యలు చేపడతామని మిశ్రమ ప్రభుత్వంలో చేరుతూ మే 6న మెన్షివిక్కులూ, ఎస్.ఆర్.లూ ప్రకటించారనీ, ఆ పార్టీ మంత్రులు 'త్సెరితెలి' చెర్నోవ్'లు ఆ బాధ్యతను తామే స్వీకరిస్తున్నట్లు ఒట్టు పెట్టుకు మరీ చెప్పారని, ఆ తేదీ గడిచిపోయి సుదీర్ఘమైన నాలుగు నెలలు గడిచేసరికి, ఆ ఆర్థిక అస్తవ్యస్థితి మరింత భయంకర రూపం దాల్చిందని ఆయన గుర్తుచేస్తాడు.

మొదట'కాడెట్'లతో (కాన్‌స్టిట్యూషనల్ డెమొక్రటిక్ పార్టీ - జారిజాన్ని సమర్థించేపార్టీ)తో జతకట్టిన పై రెండు పార్టీలవారూ, ఇప్పుడు బూర్జువాలతోనే సాక్షాత్తు మిశ్రమ ప్రభుత్వం ఏర్పరచి, పరిస్థితుల్ని మెరుగుపరుస్తామని వాగుతున్నారంటూ ఆయన ఈసడిస్తాడు.

> **❝ బ్యాంకుల జాతీయకరణ వల్ల కలిగే లాభాల్ని గురించి చెబుతూ ఆయన, బ్యాంకులు తయారుచేసే బ్యాలెన్స్ షీట్లు మోసపూరిత కల్పిత సంస్థల, వ్యక్తుల సేవ వగైరాలు ఎంతో జిత్తులు, కుయుక్తులతో నిండి ఉంటాయనీ, అందువల్ల విడివిడి బ్యాంకులపై అజమాయిషీ పటిష్టంగా ఉండలేదనీ, దాన్ని అరికట్టాలంటే బ్యాంకుల్ని విలీనం చెయ్యడం ఒక్కటే మార్గమనీ ఆయన వివరిస్తాడు. ❞**

3) అజమాయిషీ చర్యలు అందరికీ తెలిసినవే, వాటిని అమలు చెయ్యడం తేలిక:

నిజానికి అజమాయిషీ పద్ధతుల గురించి ప్రభుత్వంలోని పార్టీలేగాక, బూర్జువాల వివిధ సంస్థలు కూడా ఎంతో పరిశోధించాయనీ, అయినప్పటికీ ఈ సమస్య పరిష్కరించబడలేదనీ అంటూ లెనిన్, అజ్ఞానులైన గ్రామీణుల కళ్ళల్లో దుమ్ముకొట్టేందుకే ఇలా చేస్తున్నారు గానీ, యుద్ధ పరిశ్రమపై జారిజం అజమాయిషీ కమిటీని నెలకొల్పినప్పటికే, అందుకు సంబంధించిన ముఖ్యమైన పద్ధతులు దానికి తెలుసుననీ, చెబుతూ, అందుకోసం జనాభాని వృత్తిరీత్యా, లేక శ్రమశాఖరీత్యా ఐక్యం చెయ్యడమే ఆ పద్ధతి అంటూ దాన్ని బయటపెడతాడు లెనిన్. అయితే వారిని ఐక్యం చెయ్యడానికి జారిజం భయపడి, దాన్ని నిరోధించేందుకు కృషి చేసిందని ఆయన విమర్శిస్తాడు.

యుద్ధపు విపరీత ఆర్థికభారాలు, కడగండ్లు, కరువువల్ల విపరీతంగా బాధపడుతున్న యుద్ధమగ్న దేశాలు చాలాకాలం కిందటే ఆ విషయంలో అజమాయిషీకి సంబంధించి జనాల్ని ఐక్యం చెయ్యడం, ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొనే పలు రకాల సంఘాల్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం వగైరాలు, అభివృద్ధి చెందిన యుద్ధమగ్న దేశాలు వాటి గురించి పలు చట్టాలు చేశాయనీ, వాటిని రష్యన్ భాషలోకి అనువదించి పలు పత్రికలు ప్రకటించాయని ఆయన గుర్తుచేస్తాడు. వాటినిప్పుడు చిత్తశుద్ధితో అమలు చెయ్యడమే మిగిలి ఉందనీ, అయితే వారలా చెయ్యాలని అనుకున్న వారిలో ఆటంకం ఉందనీ, అదేమిటంటే పెట్టుబడిదారుల విపరీత లాభాలు బయటపడి, వాటి పునాది కూలిపోతుందన్న భయమేనని ఆయన వ్యంగ్యంగా అంటాడు.

ఏమైనా, విప్లవ ప్రజాస్వామిక ప్రభుత్వం అని పేరు పెట్టుకున్న ఈ ప్రభుత్వం, తను అధికారంలోకి రాగానే అజమాయిషీకి సంబంధించిన నిబంధనల్ని ఆమోదించి, వాటితో జనాభాని స్వయంగా తనిఖీ చెయ్యాలని విజ్ఞప్తి చేసి ఉండాలని, నిబంధనల్ని పాటించని పెట్టుబడిదారులపై కఠిన శిక్షలు అమలు చేస్తే ఎప్పుడో అజమాయిషీ ఖచ్చితంగా అమలు జరిగి ఉండేదని అంటూ, అజమాయిషీ ప్రధాన చర్యల్ని ఈ క్రింద పేర్కొని, వాటి గురించి వివరంగా చర్చిస్తాడు.

ప్రధాన చర్యలు: 1) అన్ని బ్యాంకుల్ని ఒకే బ్యాంకుగా సంలీనం చేసి, దాని లావాదేవీలపై ప్రభుత్వం అజమాయిషీ, లేదా బ్యాంకుల జాతీయాకరణ, 2) సిండికేట్ల (పంచదార, నూనె, బొగ్గు, ఇనుము వగైరా) జాతీయాకరణ 3) వాణిజ్య గోపనపు రద్దు 4) పరిశ్రమల, వర్తకుల నిర్బంధ సంలీనం (అంటే యూనియన్లుగా) 5) వినిమయ దారుల సంఘాల్లోకి జనాభాని నిర్బంధంగా సంఘటితం చేసి, దానిపై అజమాయిషీ అమలు.

ఇప్పుడు పై చర్యల గురించి వరుసగా తెలుసుకుందాం...

4) బ్యాంకుల జాతియాకరణ:

ఆధునిక ఆర్థిక జీవితానికే గాక, మొత్తం పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థకి కూడా జీవనాడీ కేంద్రాలు బ్యాంకులని మనందరికీ తెలుసు. బ్యాంకుల దావాదేవీల్ని నియంత్రించకుండా, తిండి గింజలపై గానీ లేదా మొత్తం సరకుల ఉత్పత్తి పంపిణీలపై గానీ అజమాయిషీ, నియంత్రణ చెయ్యాలనుకోవడం కోట్లాది రూబుళ్ళ గురించి కళ్ళు మూసుకొని, చిల్లర నాణాలకు వెంపర్లాడటం లాంటిదంటాడు లెనిన్. బ్యాంకులు ఈ రోజు వర్తకంతో, పరిశ్రమలతో ఎంతటి సన్నిహితంగా ఉన్నారంటే, బ్యాంకులపై చెయ్యి వెయ్యకుండా, విప్లవ ప్రజాస్వామ్యంలో ముఖ్యమైన దేన్నీ సాధించలేమంటాడాయన. అయితే బ్యాంకుల జాతీయకరణ చాలా క్లిష్టమైందనీ, ఈ చర్యవల్ల వ్యక్తిగత ఆస్తి కూడా జప్తు అవుతుందనీ ప్రచారం చేసేవాళ్ళు పెట్టుబడిదారులు, వారి సమర్థకులూ, బూర్జువా పత్రికలేనని ఆయన అంటాడు. నిజానికి బ్యాంకులు నిర్వహించే పెట్టుబడిమీద స్వామ్యం కోసం బాండ్లు, సర్టిఫికెట్లూ వగైరాలను జారీ చేస్తాయని, బ్యాంకుల్ని జాతీయం చెయ్యడం వల్ల, వాటి విలువలో ఎలాంటి మార్పూ రాదని ఆయన స్పష్టం చేస్తాడు.

ఇక బ్యాంకుల జాతీయకరణ వల్ల కలిగే లాభాల్ని గురించి చెబుతూ ఆయన, బ్యాంకులు తయారుచేసే బ్యాలెన్స్ షీట్లు మోసపూరిత కల్పిత సంస్థల, వ్యక్తుల సేవ వగైరాలు ఎంతో జిత్తులు, కుయుక్తులతో నిండి ఉంటాయనీ, అందువల్ల విడివిడి బ్యాంకులపై అజమాయిషీ పటిష్టంగా ఉండలేదనీ, దాన్ని అరికట్టాలంటే బ్యాంకుల్ని విలీనం చెయ్యడం ఒక్కటే మార్గమనీ ఆయన వివరిస్తాడు. దీనిద్వారా లక్షల కోట్లు ఎక్కణ్ణుంచి, ఎక్కడికి, ఎలా ప్రవహిస్తున్నాయో ప్రభుత్వం తెలుసుకోగలగడం వల్ల, దానిమీద అజమాయిషీ కలిగి ఉంటుందని, తద్వారా సమస్త ఆర్థిక జీవితం మీద, ప్రధాన సరుకుల ఉత్పత్తి ,పంపిణీమీద కుహనా అజమాయిషీగాక, వాస్తవికమైన అజమాయిషీని నెలకొల్ప గలుగుతందనీ ఆయన వివరిస్తాడు. దీనితోపాటు, మరికొన్ని సులభ చర్యలవల్ల ఆస్తుల్నీ, ఆదాయాన్నీ మరుగుపరచడాన్ని నివారించే విధంగా రాబడి పన్ను పటిష్టంగా వసూలు చెయ్యవచ్చునని ఆయన స్పష్టం చేస్తాడు.

నిజానికి బ్యాంకుల్ని జాతీయకరణ చెయ్యడం కోసం బృహత్ప్రయత్నాలేమీ అక్కర లేదనీ, కేవలం ఒకే ఒక ఉత్తర్వు జారీ చేయగానే, డైరెక్టర్లూ, ఉద్యోగులే దాన్ని అమలు చేస్తారనీ చెబుతూ, పెట్టుబడిదారీ విధానమే దాన్ని ఆచరణ యోగ్యం చేసిందని ఆయన అంటాడు. ఇందుకు కొద్దివారాల వ్యవధి చాలునని ఆయన చెబుతాడు. అయితే ఈ చర్యని బ్యాంకుల మేనేజర్లు, ఉన్నతోద్యోగులూ ప్రతిఘటించవచ్చునని, ఎందుకంటే, అధిక ప్రతిఫలం ముట్టే పద్దుల్నీ, లాభదాయకంగా దగా చేసే అవకాశాన్నీ వీరు కోల్పోతారు గనుక అంటాడాయన. అందువల్ల ఈ చర్య అమలులో ఆలస్యం చేసినా, మోసం చేసినా మేనేజర్ల, బోర్డు సభ్యుల, వాటాదార్ల ఆస్తుల్ని జప్తు చేసి, జైలుశిక్షలు విధిస్తామంటే, వెంటనే అమలౌతుందని ఆయన చెబుతాడు. అలాగే వీరి మోసాల్ని కనిపెట్టేందుకు పేద ఉద్యోగుల్ని నియమించి, బహుమతి ప్రకటిస్తే, సులువుగా అమలౌతుందని స్పష్టం చేస్తాడు.

ఈ జాతీయాకరణ చర్యవల్ల కార్మికులకీ, రైతులకీ, చిన్న పరిశ్రమదారులకీ, మొత్తంగా ప్రజలకీ ఎంతో ఉపయోగకరమనీ, శ్రమలో పొదుపు జరిగి ఉన్న ఉద్యోగులతోనే ఎక్కువ బ్రాంచీల్ని ఏర్పాటు చేసి, దేశ ప్రజలందరికీ వీటి సేవలు అందుబాటులోకి తీసుకురావచ్చుననీ, సన్నకారు వ్యక్తులకు కూడా

పరపతి సౌకర్యం అందుతుందనీ, అలాగే ద్రవ్యపర లావాదేవీలన్నీ బాహాటంగా జరగడం వల్ల ప్రభుత్వానికి అజమాయిషీ తేలిక అవుతుందనీ, ఇదంతా 'పెద్ద మనుషులకు' కమీషన్ ఇవ్వకుండానే, అంటాడాయన. దేశరక్షణ దృష్ట్యా సైనిక పాటవాన్ని పెంచినా, ఖర్చు తక్కువవుతుంది కాబట్టే, దీన్ని పెట్టుబడిదారులూ, బూర్జువా ప్రొఫెసర్లూ, వారికి ఊడిగం చేసే ప్లెహనోవ్‌లాంటి వాళ్ళూ ఈ చర్యకి వ్యతిరేకంగా భీషణ పోరాటం చేస్తారని ఆయన నర్మగర్భంగా వ్యాఖ్యానిస్తాడు.

> **❝ జాతీయాకరణ చర్యవల్ల కార్మికులకీ, రైతులకీ, చిన్న పరిశ్రమదారులకీ, మొత్తంగా ప్రజలకీ ఎంతో ఉపయోగకరమనీ, శ్రమలో పొదుపు జరిగి ఉన్న ఉద్యోగులతోనే ఎక్కువ బ్రాంచీల్ని ఏర్పాటు చేసి, దేశ ప్రజలందరికీ వీటి సేవలు అందుబాటులోకి తీసుకురావచ్చుననీ, సన్నకారు వ్యక్తులకు కూడా పరపతి అందుతుందనీ, అలాగే ద్రవ్యపర లావాదేవీలన్నీ బాహాటంగా జరగడం వల్ల ప్రభుత్వానికి అజమాయిషీ తేలిక అవుతుందనీ, ఇదంతా 'పెద్ద మనుషులకు' కమీషన్ ఇవ్వకుండానే, అంటాడాయన. ❞**

అయితే జర్మనీ, అమెరికాలాంటి అగ్రగామి రాజ్యాలు ఈ చర్య తీసుకోకుండానే ఆర్థిక నియంత్రణను చేస్తున్నాయి కదా అని కొందరు అనవచ్చుగానీ, ఆ రెండు దేశాలూ సామ్రాజ్యవాద దేశాలైనందున తమ సంస్కరణల్ని అభివృద్ధి నిరోధక బ్యూరాక్రటిక్ పద్ధతుల్లో అమలు జరుపుకుంటాయి. కానీ మనం ఇక్కడ విప్లవ ప్రజాస్వామిక పద్ధతుల గురించి మాట్లాడుకుంటున్నాం. ఈ తేడాని మనం లాంఛనప్రాయమైన పదబంధంగాగాక, దాని అర్థాన్ని సాకల్యంగా ఆలోచించాలి. ప్రజాస్వామ్యవాదిగా ఉండటం అంటే, ఆచరణలో అల్ప సంఖ్యాకులవిగాక, అధిక సంఖ్యాకుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవడం, హానికరమైన, కాలదోషం పట్టిన ప్రతిదాన్నీ కృతనిశ్చయంతో, నిర్దాక్షిణ్యంగా నిర్మూలించడమని అర్థం అంటూ వివరిస్తాడు లెనిన్. అమెరికాలోగానీ, జర్మనీలోగానీ పాలకవర్గాలు విప్లవ ప్రజాస్వామ్యవాదులుగా చెప్పుకోవడం లేదు, రష్యాలో ఎస్.ఆర్‌లూ, మెన్షివిక్కులూ మాత్రం తమకి ఆ పేరు వర్తిస్తుందని చెప్పుకొంటున్నారంటూ ఆయన ఎత్తిపొడుస్తాడు.

ఇక జర్మనీలో ఉన్న నాలుగు, అమెరికాలో ఉన్న రెండు బడా ప్రైవేటు బ్యాంకులు అభివృద్ధి నిరోధక బ్యూరాక్రటిక్ పద్ధతిలో లోపాయికారీగా, ప్రభుత్వోద్యోగులకు లంచాలు మేపి, లావాదేవీల రహస్య గోపనం కోసం, ప్రభుత్వం నుండి 'అతీత లాభాల'కోసం, దగా ఆర్థిక లావాదేవీల కోసం తమ ప్రైవేటు స్వభావాన్ని కాపాడుకోవటం వాటికి సులభంగా, సౌకర్యవంతంగా, మరింత లాభదాయకంగా ఉంటుంది. ఆ రెండు దేశాలు కార్మికులకూ, రైతులకూ యుద్ధకాలపు కఠిన నరకాన్నీ, పెట్టుబడిదారులకు స్వర్గాన్నీ కల్పించే రీతిలో 'ఆర్థిక జీవితాన్ని నియంత్రితం' చెయ్యడంవల్ల, కార్మికులకు పస్తులూ, పెట్టుబడిదారులకు మాత్రం అత్యంత లాభాలూ, అంటూ ఆయన వివరిస్తాడు. ఇదే మార్గం రిపబ్లికన్ సామ్రాజ్యవాద రష్యాలో కూడా సాధ్యం కనుకే కాడెట్లే గాక, ఎస్.ఆర్.లూ, మెన్షివిక్‌లూ కూడా విపరీత లాభాలు పొందే బ్యాంకుల 'పవిత్ర' హక్కును బలపరుస్తున్నారు. అంచేత వీరు రష్యాలోని ఆర్థిక జీవితాన్ని అభివృద్ధి నిరోధక బ్యూరాక్రటిక్ పద్ధతిలో నియంత్రించాలనుకుంటున్నారు. వీరికది తరచుగా సోవియట్ల ఉనికివల్ల కష్టంగా కనిపిస్తోంది. దాంతో సోవియట్లను రద్దుచేసేందుక్కూడా ప్రయత్నిస్తున్నారు' అంటూ ఆయన ఆ కటువైన నిజాన్ని బయటపెడతాడు.

అలాగే బ్యాంకుల జాతీయాకరణతో పాటు, ఇన్స్యూరెన్స్ వ్యాపారాన్నీ అదే సమయంలో, అదే పద్ధతిలో జాతీయాకరణ చెయ్యడం కూడా ఎంతో ఉపయోగకరమని, తద్వారా ప్రీమియం తగ్గి, శ్రమ, నిధుల వినియోగం పెరగకుండానే, పాలసీదారుల సంఖ్య పెరగడాన్ని సాధ్యం చేస్తుందని ఆయన చెబుతాడు.

5) సిండికేట్ల జాతీయకరణ:

పెట్టుబడిదారీ విధానమే గనుక లేకపోయినట్లైతే, సోషలిజం దిశగా ఏ చర్యలూ సాంకేతికంగా ఆచరణ సాధ్యమై ఉండేవి కావంటాడు లెనిన్. ఎందువల్లనంటే ఆ విధానం ఆర్థికవ్యవస్థలో వివిధ శాఖల మధ్య పరస్పర సంబంధం, పరాధీనతనూ సృష్టిస్తుంది. అలా అది పెట్టుబడిదారీ పూర్వపు ఆర్థికవ్యవస్థ నుండి విభేదిస్తుందని ఆయన వివరిస్తాడు. ఆధునిక పెట్టుబడిదారీ విధానంలో ఉత్పత్తిమీద బ్యాంకులు పెత్తనం చేస్తుండటంతోపాటు, ఆర్థికవ్యవస్థ యొక్క వివిధ శాఖల పరస్పరాధీనత శిఖరస్థాయిలోకి వెళ్ళి, బ్యాంకులూ, పారిశ్రామిక, వాణిజ్యరంగాలూ విడదీయరానంతగా కలిసిపోయాయి. ఒకవైపున దీనికర్థం, వాణిజ్య, పారిశ్రామిక సిండికేట్లపై ప్రభుత్వ గుత్తస్వామ్యాన్ని (జాతీయం) ఏర్పాటు చెయ్యకుండా, ఒక్క బ్యాంకుల్ని మాత్రమే జాతీయం చెయ్యడం అసాధ్యం అని. రెండోవైపున దీనికర్థం ఏమంటే, ఆర్థిక కార్యకలాపాల నియంత్రణను చిత్తశుద్ధితో అమలు జరిపితే, అది ఏకకాలంలో బ్యాంకుల, సిండికేట్ల జాతీయాకరణను అవసరం చేస్తుందని అంటూ వివరిస్తాడాయన.

ఉదాహరణకు పంచదార సిండికేటును తీసుకుంటే, ఇది జారిజంలోనే ఏర్పడి, పెట్టుబడిదారులకు విపరీత లాభాలు సమకూర్చి, ఉద్యోగులను ఎటువంటి హక్కులూ లేని బానిసల స్థితికి దిగజార్చిందని, ప్రభుత్వపు అజమాయిషీ ఉన్నా అది యజమానుల ప్రయోజనాలకు అనుగుణంగా నియంత్రించబడిందనీ, ఆయన గుర్తుచేస్తాడు. అందువల్ల ఇప్పుడు చెయ్యాల్సింది ఒకరకమైన అకౌంటింగ్‌ను, కార్మికుల అజమాయిషీని ప్రవేశపెట్టి, అభివృద్ధి నిరోధక నియంత్రణను కాస్తా, విప్లవ ప్రజాస్వామిక నియంత్రణగా మార్చడమేనని ఆయన స్పష్టం చేస్తాడు. ఇందుకు ఒకే ఒక్క కలం పోటు చాలుననీ, అయితే అందుకో షరతు మాత్రం ఉందనీ, అదేమిటంటే, ఎస్.ఆర్.లూ, మెన్షివిక్కులూ ఈ పంచదార ప్రభువులతో పొత్తు ఒదులుకోవడమేనని ఆయన చెబుతాడు. అలాగే నూనె సిండికేటును, బొగ్గు సిండికేటును, జాతీయకరణ చెయ్యాలని ఆయన స్పష్టం చేస్తాడు. అలాకాకుండా అధికారాన్ని పెట్టుబడిదారుల చేతుల్లోకి వదిలి, వారిని శిక్షించకుండా, అన్నింటికీ కార్మికుల్ని నిందిస్తూ పరిస్థితుల్ని అస్తవ్యస్తం చేసి, తద్వారా మరో సైనిక తిరుగుబాటుకి బాటలు వేస్తున్నారని ఆయన తీవ్రంగా నిందిస్తాడు.

6) వాణిజ్య గోపనాన్ని రద్దు చెయ్యడం :-

వాణిజ్య గోపనాన్ని రద్దు చెయ్యకుండా ఉత్పత్తి వినిమయాలమీద అజమాయిషీ శుష్క వాగ్దానం గానే మిగిలిపోతుంది. ఈ చర్య తీసుకోమని పత్రికలు, ముఖ్యంగా 'ప్రావ్ద' (అందుకే ఈ పత్రికను కేరెన్స్కీ ప్రభుత్వం మూసివేసింది) ఎంత పోరినా, పట్టించుకోలేదని లెనిన్ అంటాడు.

పెట్టుబడిదారీ దేశాల్లో వాణిజ్య గోపనాన్ని రద్దుచెయ్యడం అసలు సాధ్యమే కాదని

> **“సన్నకారు ఉత్పత్తిలో ఉత్పత్తి సామాజికం చెయ్యబడక, చెదిరిపోయి, అనైక్యంగా ఉండటం వల్ల వాటిలో వాణిజ్య గోపనం అనివార్యం. అదే భారీ ఉత్పత్తిలో రహస్య గోపనాన్ని కాపాడు కుంటే, మొత్తం ప్రజల ప్రయోజనానికి వ్యతిరేకంగా, కొద్దిమంది హక్కుల్నీ, లాభాల్నీ కాపాడ్డమే. ఈ విషయాన్ని జాయింట్ స్టాక్ కంపెనీల్లో గుర్తించడం వల్లనే, వాటి అకౌంట్లని ప్రచురించాలన్న చట్టం ఏర్పడింది అని ఆయన గుర్తుచేస్తాడు.”**

పెట్టుబడిదారులు వాదిస్తారు. అందుకే వీరు చెప్పే కారణాలు ఉత్పత్తి సాధనాలపై వ్యక్తిగతస్వామ్యం, విడి వ్యాపార సంస్థలు మార్కెట్‌మీద ఆధారపడటం, వాణిజ్యానికి సంబంధించిన ఖాతా పుస్తకాలకీ, బ్యాంకింగ్ వగైరా వాణిజ్య లావాదేవీలకూ 'పవిత్ర అనుల్లం ఘనీయత' అవశ్యంగా ఉండటం! అయితే ఇలా చెప్పేవాళ్ళు అందరికీ తెలిసిన రెండు వాస్తవాల్ని గమనించకుండా తమని తాము మోసం చేసుకోవడమేగాకుండా, ఇతరుల్నీ మోసం చేస్తారని ఆయన చెబుతాడు. వాటిలో మొదటి వాస్తవం ఏమంటే, భారీ పెట్టుబడి, రెండోది యుద్ధము. భారీ పెట్టుబడి అయిన బ్యాంకులు, సిండికేట్లు, పెద్ద ఫ్యాక్టరీలు వగైరాలు, వాణిజ్య గోపనపు హేతుబద్ధ ఛాయల్ని తొలగించి, వాటిని మోసం, ఆర్థిక కుంభకోణాలుగా, ఊహాతీత అధిక లాభాల్ని మరుగుపరిచేందుకు ఒక పరికరంగా మార్చివేస్తోందని ఆయన అంటాడు. ఈ భారీ పెట్టుబడిదారీ వ్యవస్థ తన సాంకేతిక స్వభావరీత్యా, సామాజికీకృత ఆర్థిక వ్యవస్థగా మారింది. అంటే అది కోట్లాది ప్రజల కోసం పనిచేస్తూ, తన లావాదేవీల ద్వారా వేలాది కుటుంబాల్ని సమైక్యం చేస్తోంది. అది ఏ వాణిజ్య ఖాతా పుస్తకాలూ పెట్టుకోని, అందుచేత వాణిజ్య రహస్య గోపనాన్ని రద్దు చెయ్యడంతో సంబంధం లేని సన్నకారు చేతివృత్తి పనివాళ్ళ ఆర్థిక వ్యవస్థలాంటిది కాదని ఆయన వివరిస్తాడు. ఇంతటి భారీ వర్తకంలో లావాదేవీలు వందలాది మందికి తెలిసి ఉంటాయి. ఇలాంటి వాటిలో రహస్య గోపనం ఉత్పత్తి పంపిణీలపై గాక, చట్టా వ్యాపారానికి, ప్రత్యక్ష దగాకి తోడ్పడుతుందని ఆయన వ్యాఖ్యానిస్తాడు.

సన్నకారు ఉత్పత్తిలో ఉత్పత్తి సామాజికం చెయ్యబడక, చెదిరిపోయి, అనైక్యంగా ఉండటం వల్ల వాటిలో వాణిజ్య గోపనం అనివార్యం. అదే భారీ ఉత్పత్తిలో రహస్య గోపనాన్ని కాపాడుకుంటే, మొత్తం ప్రజల ప్రయోజనానికి వ్యతిరేకంగా, కొద్దిమంది హక్కుల్నీ, లాభాల్నీ కాపాడ్డమే. ఈ విషయాన్ని జాయింట్ స్టాక్ కంపెనీల్లో గుర్తించడం వల్లనే, వాటి అకౌంట్లని ప్రచురించాలన్న చట్టం ఏర్పడింది అని ఆయన గుర్తుచేస్తాడు. అందువల్ల విప్లవ ప్రజాస్వామిక పద్ధతిలో వ్యవహరించాలంటే వాణిజ్య గోపనాన్ని రద్దుచేసి, అకౌంట్లను ప్రచురించటం విధాయకం చెయ్యడమేగాక, రికార్డుల్ని తనిఖీ హక్కు, అజమాయిషీకి ప్రతి పౌర బృందానికీ, ఉద్యోగుల, కార్మికుల సంఘాలకూ, రాజకీయ పార్టీలకూ కల్పించాలని ఆయన స్పష్టం చేస్తాడు.

ఇక యుద్ధం విషయానికి వస్తే, నేడు వాణిజ్య పారిశ్రామిక సంస్థల్లో అధికం స్వేచ్ఛాయుత మార్కెట్‌కోసం గాక, ప్రభుత్వం కోసం యుద్ధం కోసం పని చేస్తున్నాయి. కనుక ఇప్పుడు తక్షణ సమస్య ప్రభుత్వ ఖజానాని దోచుకోవడాన్ని బహిర్గతం చేసి, ఖండించడమే. పెట్టుబడిదారీ 'యుద్ధ' ఆర్థిక వ్యవస్థలంటే, చట్టబద్ధమైన ప్రభుత్వ ఖజానా దోపిడీయే. ప్రభుత్వంలోని మూడు పార్టీలూ (కాడెట్లూ, ఎస్.ఆర్.లూ, మెన్షివిక్కులూ) ఆ దోపిడీకి సహాయకులూ, కుమ్మక్కుదారులే. ఎలా అంటే, నేడు ప్రతిరోజూ రష్యాకి యుద్ధం వల్ల 5 కోట్ల రూబుళ్ళ వ్యయమౌతోంది. అందులో అధిక భాగం సైనిక కాంట్రాక్టర్లకి వెడుతుండగా, 1 కోటికి పైగా వారితో కుమ్మక్కయిన ఉద్యోగుల 'నిజాయితీపరమైన ఆదాయం'. ఈ యుద్ధ కాంట్రాక్టర్లకి రుణాలిచ్చే పెద్ద వ్యాపార సంస్థలూ, బ్యాంకులూ ఊహకందనంత లాభాలార్జిస్తున్నాయి. ఇదంతా ప్రభుత్వాన్ని కొల్లగొట్టడం ద్వారానే వస్తోంది. యుద్ధంలో లక్షలాది మరణాల సందర్భంగా ఈ దోపిడీకి మరో పేరేదీ పెట్టలేమంటూ ఆవేదన వ్యక్తం చేస్తాడాయన. సాధారణంగా అప్రియమైన, సున్నిత విషయాన్ని దాటవేసే బూర్జువా పత్రికలు కూడా ఈసంగతి రాస్తున్నా, అజమాయిషీ, నియంత్రణల గురించి మాటలతో ప్రభుత్వం సరిపుచ్చుకుంటోందని అంటూ, అదేగనుక నిజమైన విప్లవ ప్రజాస్వామిక వాదులైనట్లయితే, ఈ విషయాన్ని చేతల్లో నిరూపించాలని గట్టిగా అంటాడు.

7) సంఘాల్లో నిర్బంధంగా సమైక్య పరచడం :-నిర్బంధ సమైక్యం అంటే ప్రభుత్వమే పెట్టుబడిదారీ విధానాన్ని త్వరితం చేసే ఒక సాధనం. మరోవైపు అజమాయిషీకి, జాతీయ శ్రమ పొదుపుకూ ఒక పూర్వ షరతు. జర్మనీలో ఇది ఇంతకుముందే అమల్లో ఉంది. రష్యాలో ప్రభుత్వంలోని మూడు పార్టీల తప్పువల్ల స్తబ్దంగా ఉంది అంటూ విమర్శించిన లెనిన్, జర్మనీలో ఈ చట్టం ద్వారా ఏర్పడ్డ తోళ్ళ పరిశ్రమ సంఘం గురించి వివరిస్తాడు. ఈ సంఘపు బోర్డులో అజమాయిషీకి ఒక ప్రభుత్వ ప్రతినిధి ఉంటాడు. ఈ సంఘం వల్ల ఏ ఒక్క యజమానీ ఒక్క కోపెక్కూ నష్టపోడు. అంతేగాక ఈ అజమాయిషీ విప్లవ ప్రజాస్వామిక రూపాన్నో, దిశనో నిర్ణయించదు. అలాగే ఈ చర్యకు ముందు ఎలాంటి సమాచార సేకరణా అక్కరలేదు. దీనికి కావలసిందల్లా తమ అతీత లాభాల్నుంచి కొంత వదులుకోవాలని పెట్టుబడిదారులు కృతనిశ్చయంతో ఉండటమేనని చెబుతూ ఆయన, ఈ చట్టాన్ని రష్యాలో వెంటనే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తాడు. అంతేగాక ఈ చట్టం అమలులో పౌరశక్తుల, ముఖ్యంగా నిమ్న తరగతుల అజమాయిషీ విధిగా ఉండాలనీ, ఎందుకంటే అణచబడ్డ వారిలో వీరత్వం, ఆత్మ త్యాగం, కామ్రేడ్లీ క్రమశిక్షణ ప్రదర్శించే సామర్థ్యం అధికంగా ఉంటాయని ఆయన వివరిస్తాడు. ఈ చట్టాన్ని అమలు చెయ్యని యజమానులు, బోర్డు సభ్యులూ, బడా వాటాదార్లని కఠినంగా శిక్షించాలి. అలాగే ఈ చట్ట అమలు బాధ్యతను వారి తర్వాత, కార్యాలయోద్యోగులపైనా, కార్మికులపైనా ఉంచాలి. వారు యూనియన్‌గా ఏర్పడి సమగ్రమైన అకౌంట్లను ఏర్పరుస్తారు. అయితే ప్రధానంగా ముడి పదార్థాల కొనుగోళ్ళు, సరుకుల అమ్మకాలకీ జాతీయ వనరుల, శక్తుల పొదుపుకు సంబంధించిన కార్యకలాపాల్నీ ఏకీకృతం చెయ్యడం జరుగుతుంది. వేర్వేరు సంస్థలు ఒక సిండికేటుగా మారినప్పుడు ఈ పొదుపు బృహత్తర పరిణామాన్ని అందుకుంటుంది. అయితే ఈ యూనియనీకరణ ఆస్తి సంబంధాల్నిగానీ, ఆస్తి పరిమాణాన్నిగానీ మార్చదు. ఈ విషయాన్ని మనం గట్టిగా నొక్కి చెప్పాలి. ఎందుకంటే, సోషలిస్టులు, ప్రత్యేకంగా బోల్షివిక్కులు వారి ఆస్తుల్ని హరిస్తారని సన్నకారు, ఆస్తిపరుల్ని బూర్జువా పత్రికలు నిరంతరంగా భయపెడుతున్నాయి. సోషలిస్టు విప్లవం జరిగినా, వారి ఆస్తుల్ని సోషలిస్టు హరించరు, హరించజాలరు అంటూ విశదపరుస్తాడు లెనిన్.

అయితే మరీ సన్నకారు సొంతదారుల్ని సంఘాలుగా విలీనం చెయ్యడంలో

సాంకేతిక, సాంస్కృతికపరమైన రెండు తీవ్ర ఇబ్బందులున్నాయంటాడాయన. అవి మరీ చిన్నవవడం వల్ల సాంకేతికంగా ప్రాథమిక మైనవి కావడం లేదా వాటి సొంతదారులు నిరక్షరాస్యులు కావడం. అందువల్ల వీటిని చట్టం నుంచి మినహాయించవచ్చును. కానీ పెద్ద సంస్థలే నిర్ణయాత్మక ప్రాముఖ్యం కలిగి ఉంటాయి కనుక, వాటిపట్ల కఠినంగా వ్యవహరించాలని ఆయన చెబుతాడు.

"మరీ సన్నకారు సొంతదారుల్ని సంఘాలుగా విలీనం చెయ్యడంలో సాంకేతిక, సాంస్కృతికపరమైన రెండు తీవ్ర ఇబ్బందులున్నాయంటాడాయన. అవి మరీ చిన్నవవడం వల్ల సాంకేతికంగా ప్రాథమికమైనవి కావడం లేదా వాటి సొంతదారులు నిరక్షరాస్యులు కావడం. అందువల్ల వీటిని చట్టం నుంచి మినహాయించవచ్చును. కానీ పెద్ద సంస్థలే నిర్ణయాత్మక ప్రాముఖ్యం కలిగి ఉంటాయి కనుక, వాటిపట్ల కఠినంగా వ్యవహరించాలని ఆయన చెబుతాడు."

8) వినిమయ నియంత్రణ:-

ఆధునిక పెట్టుబడిదారీ దేశాల్లో వినిమయం ఎలా నియంత్రించాలన్న దానికి రొట్టె రేషన్ కార్డులే ఒక ఉదాహరణ అంటాడు లెనిన్. యుద్ధం మూలంగా అన్ని యుద్ధ మగ్న దేశాలతో చాలా తటస్థ దేశాలూ, వీటన్నింటితో పాటు రష్యా కూడా వినిమయ నియంత్రణకు పూనుకొని, రొట్టె రేషన్‌కార్డులను ప్రవేశపెట్టి, ఆ తర్వాత ఈ రేషన్ కార్డుల్ని, కొన్ని ఇతర వస్తువులక్కూడా వర్తింపజేశాయి. ఏమైనా తిండి గింజల్లో ప్రధానమైన వాటిని మాత్రం అందరికీ సరిపోయేలా పంపిణీ చెయ్యడమే ఈ రేషన్ కార్డు లక్ష్యం. అంతే తప్ప. మరింకేం చెయ్యాలన్న ఆలోచన లేదు. విలాస వస్తువులు, ప్రియంగా, ప్రజలకు ఎలాగూ అందుబాటులో ఉండవు కాబట్టి, వాటిని తాకనైనా తాకరు. ఇక అన్ని యుద్ధ మగ్న దేశాల్లోనూ, చివరికి ఛాందసంగా నియంత్రించే జర్మనీలో సైతం, ధనికులు నిరంతంగా ఈ రేషనింగ్‌ని తప్పించుకోవడం చూడవచ్చు. సెన్సార్‌షిప్ ఖచ్చితంగా అమలు జరిగే బూర్జువా పత్రికల్లో సైతం, ధనికులు ఆరోగ్య కేంద్రాల్లో తమకు కావలసినంత తెల్లరొట్టెను ఎలా పొందుతారో, విలాస వస్తువుల్ని వినిమయ వస్తువులుగా ఎలా మార్చుకుంటారో కథనాలు తరచు కనిపిస్తుంటాయి. ఈ విధంగా అభివృద్ధి నిరోధక పెట్టుబడిదారీ రాజ్యాలన్నింటితోపాటు రష్యాలోనూ, కార్మికుల చొరవను ప్రోత్సహించేందుకు భయపడి, వారిని మరింత డిమాండ్ చేసే ధోరణిని ప్రేరేపించేందుకు భయపడి, జనానికి తిండి పెట్టేందుకు పరమావశ్యకమైన చర్యలకు మాత్రం పరిమితం చేసే, అభివృద్ధి నిరోధక లక్ష్యాన్ని క్షణకాలం కూడా కనుమరుగు అవ్వనివ్వరు అంటాడాయన. కానీ, శాంతికాలంలో అతిగా మెక్కి, యుద్ధకాలంలో ప్రత్యేక హక్కులు కలిగిన సంపన్నులమీద మాత్రం వినిమయ నియంత్రణ కోసం ఎలాంటి ప్రయత్నాలూ చెయ్యరంటూ విమర్శిస్తాడు.

అయితే, ఇప్పుడే విప్లవం జరిగిన రిపబ్లిక్ రష్యాలో ప్రజాబాహుళ్యపు క్రోధాన్ని రెచ్చగొట్టే విధంగా ఈ ధనికులు రేషన్ కార్డుల విషయాన్ని దాటవేస్తున్నారనీ, నిజానికి వారీ పనిని తెలిగ్గా, చాటుగా, అధిక ధరలు చెల్లించి చేస్తున్నారనీ, పలుకుబడి ఉంటే (అది ధనికులకే ఉంది) కావలసినంత పెద్ద మొత్తంలో రేషన్ సరుకు దొరుకుతోందనీ, జనమేమో పస్తులుంటున్నారనీ, ఈ విధంగా వినిమయ వస్తు నియంత్రణ అత్యంత సంకుచిత బ్యూరాక్రటిక్ అభివృద్ధి నిరోధక చట్టానికి పతరిమితం చెయ్యబడిందనీ, 'క్యూ'ల విషయంలో కూడా జనమంతా తీవ్ర బాధలు పడుతుంటే, ధనికులు ఇందుకోసం ప్రత్యేక నౌకర్లని పెట్టుకుంటూ తప్పించుకుంటున్నారనీ, ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తాడు.

కనుక నిజమైన విప్లవ ప్రజాస్వామిక ప్రభుత్వం అయితే ముంచుకొస్తున్న ఈ ముప్పును ఎదుర్కొనేందుకు ఈ కింది చర్యల్ని తీసుకొని ఉండేది అంటూ, వాటిని వరుసగా చెబుతాడు: 1) మొత్తం జనాభాని వినిమయదార్ల సంఘాల్లో సంఘటితం చెయ్యడం 2) ధనికులచేత వేతనం లేకుండా వినిమయ సంఘాలకు గుమస్తా పనులు చేయించడం 3) యుద్ధ భారాలు అందరికీ ఆచరణలో సమానంగా పంచి, అన్ని సరుకుల్నీ అందరికీ సమానంగా పంపిణీ చేయడం 4) సమాజంలోని పేద వర్గాలు ధనికులపై అజమాయిషీ జరపడం.

9) ప్రభుత్వం చేత ప్రజాస్వామిక సంస్థల కృషి విచ్ఛిత్తి:- ఇప్పటివరకూ మనం ముప్పునూ, కరువునూ ఎదుర్కొనే వివిధ పద్ధతుల్ని గమనించా మనీ, ఒకవైపు ప్రజాస్వామ్య వాదులకీ, మరోవైపు ప్రభుత్వానికీ, ప్రభుత్వాన్ని సమర్థించే ఎస్.ఆర్.లూ, మెన్షివిక్కుల కూటమికీ మధ్య ఉన్న వైరుధ్యాలు పరిష్కరించడానికి సాధ్యంకానివనీ చూశాం అని చెబుతూ లెనిన్ దీన్ని ఆచరణలో రుజువు చేసేందుకు నమూనా ప్రాయమైన రెండు గుణపాఠాలను చూపిస్తాడు. అందులో మొదటిది 'ఫల్చిన్‌స్కీ' పాలన, కాగా రెండోది 'పెషెహొనోవ్' పాలన, పతనాల చరిత్ర. వాటిని ఆయన ఈ కింది రీతిగా వివరిస్తాడు.

జారిజంలోనే ముప్పును, కరువునూ ఎదుర్కొనేందుకు పీడిత వర్గాల కార్మికులూ, రైతులూ, ముఖ్యంగా పేద రైతులు యూనియనీకరణ చెందడం మొదలెట్టగా, జారిజం దాన్ని అడ్డుకొనేందుకు ఎంతైనా కృషి చేసింది. జార్ పతనానంతరం పలు ప్రజాస్వామిక సంస్థలు రష్యా అంతటా తలెత్తి, వేగంగా పెంపొందుతూ, ఇంధనం, ఆహారం విషయాల్లో కమిటీలుగా ఏర్పడి ముప్పుకి వ్యతిరేకంగా పోరాటం చేస్తుండగా, తనని తాను రిపబ్లికన్, విప్లవాత్మక ప్రభుత్వమని చెప్పుకునే ఈ ప్రభుత్వం, గత ఆరేళ్ల కాలంలోనూ పై ప్రజాస్వామిక సంస్థలకు వ్యతిరేకంగా పోరాడి, వాటిని ఓడించింది. ఈ పోరాటంలో 'పల్చిన్‌స్కీ' తను బాహాటంగా పైకి రాకుండా, 'త్సెరితేలి' లాంటి మంత్రుల్ని ముందు పెట్టుకొని ప్రభుత్వం మాటున వ్యవహరిస్తూ, పెట్టుబడిదారుల అమితలాభాల్ని దెబ్బతియ్యకుండా ఏ తీవ్ర చర్యనూ తీసుకోవడం కుదరదు గనుక, పై ప్రజాస్వామిక సంస్థలు తీసుకున్న ప్రతి చర్యనూ తీవ్రంగా అడ్డుకొని, భగ్నం చేశాడు. నిజానికతడు పెట్టుబడిదారుల సేవకుడైనందున, ఆ సంస్థల్ని రద్దుచేయించేదాకా నిద్రపోలేదు. సహజంగానే అతడి వీరకృత్యాలు' కొద్దిగానే పత్రికల కెక్కాయి. కరువుకి వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని అతడెలా భంగపరిచాడో, శ్రామికవర్గానికి నిజమైన అధికారం దక్కనప్పుడు, అంతా ప్రజా విచారణలోకి తీసుకురాబడి, వెల్లడవుతుందంటూ లెనిన్ తీవ్రంగా హెచ్చరిస్తాడు. అయితే అతడొక మినహాయింపు అనీ, చివరికి అతణ్ణి తొలగించారు కదా అని ఎవరైనా అనవచ్చు. నిజానికతడు మినహాయింపు కాదు, సాధారణ నియమం. అతని స్థానాన్ని అదే మాదిరి పల్చిన్‌స్కీలు ఆక్రమించి, అలాగే వ్యవహరించి, అలాగే పెట్టుబడిదారుల ప్రయోజనాలను పరిరక్షించారని ఆయన గుర్తుచేస్తాడు.

ఇక 'పెషెహొనోవ్' రాజీనామా ఉదంతానికి వస్తే, ఈయన ఒక పరమ సాత్విక నరోద్నిక్ అని అందరికీ తెలుసు. అయితే ఆహార

**" బూర్జువా ఆస్తి పవిత్రత గురించి ప్రజాస్వామ్య విరుద్ధమైన దురభిప్రాయాలు, మనలో ఎంతగా జీర్ణించుకుపోయాయో చెప్పటానికి ఒక ఉదాహరణనిస్తాడాయన. కార్మికుని ఆదాయ వ్యయాల గురించిన సమాచారాన్ని ఒక ఇంజనీరో, బ్యాంకరో ప్రచురిస్తే, దాన్ని సరైందిగా భావిస్తారనీ, అదే ఒక బూర్జువా ఆదాయ దాపరికానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సహాయం చేసేందుకు ఒక ఉద్యోగిగానీ, కార్మికుడుగానీ ప్రయత్నిస్తే దాన్ని, వేగుపని చెయ్యడంగా బూర్జువాలు గొడవ చేస్తారని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తాడు. "**

పదార్థాల సప్లయ్ విషయంలో, ప్రజాస్వామిక సంస్థల తోడ్పాటుతో, నిజాయితీగా వ్యవహరించాలనుకున్నాడు. బూర్జువాలతో ఎలాంటి రాజీకైనా ఒప్పుకొనే ఈ ప్రజా సోషలిస్టు, చివరికి రాజీనామా చెయ్యాల్సి రావడానికి కారణం – కెరెన్స్కీ ప్రభుత్వం పెట్టుబడిదారుల్ని, భూస్వాముల్ని, కులాక్కుల్ని మెప్పించేందుకుగాను ధాన్యపు నిర్ణీత ధర పెంచడమే! అలా పెంచాలని ప్రభుత్వం నిర్ణయించడానికి కొద్దిరోజుల ముందు, జాతీయ ఆహార కమిటీలో, ధనిక శక్తుల ప్రతినిధి అయిన 'రొలోవిచ్'– ప్రభుత్వం ధాన్యం నిర్ణీత ధరల్ని పెంచబోతోందని బహిరంగంగా ప్రకటించాడు. అయితే రైతు సోవియట్ల, కార్మిక, సైనిక సోవియట్ల ప్రతినిధులిద్దరూ, రష్యాలో విప్లవం ఉన్నంత వరకూ, ఆహార కమిటీల్లో చర్చించకుండా ప్రభుత్వం అలాంటి చర్య తీసుకోవడం సాధ్యంకాదని, అతని ప్రకటనను ఖండించారు. అయితే చివరికి ధనికుల ప్రతినిధి చెప్పిందే రైటని తేలింది. ప్రజాస్వామ్య వాదులకంటే చాలా ఎక్కువ సమాచారం పెట్టుబడిదారులకే తెలిసింది. నిజానికి అధికారం వారి చేతుల్లోనే వుంది. కరెన్స్కీ ఒక ఉత్సవ విగ్రహం మాత్రమే. దాన్ని అవసరమైనప్పుడు వాడుకొంటారు. ఆ విధంగా కోట్లాది కార్మికుల, రైతుల ప్రయోజనాలు, బహుకొద్దిమంది ధనికుల ప్రయోజనాలకోసం త్యాగం చేయబడ్డాయని అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తాడు లెనిన్. ఈ చర్యను ఎస్.ఆర్.లూ, మెన్షివిక్కులూ 'అదొక వినాశకర చర్య' అంటూ కాగితాలపై నిరసన తీర్మానానికి పరిమితమయ్యారనీ, తద్వారా వీరు ప్రజలకు, విప్లవానికీ ద్రోహం చెయ్యడం దీన్ని నిరసించిన బోల్షివిక్కులు ప్రజాస్వామ్యపు నిజమైన నాయకులవుతున్నారన్న వాస్తవాన్ని వెల్లడిస్తాడాయన.

10) ఆర్థిక పతనం, దాన్ని ఎదుర్కొనే చర్యలు:–

నిర్ణీత ఆహారధాన్యాల పెరుగుదలకు మరో పార్శ్వం – కాగితపు డబ్బు జారీ, దీనివల్ల జీవన వ్యయం పెరగడమేగాక, ఆర్థిక పతనం కూడా జరుగుతుంది. కాగితపు డబ్బు జారీ నిర్బంధ రుణపు అతి హీన రూపమనీ, దీనివల్ల, పేదల పరిస్థితి మరింత అధ్వాన్నమౌతుందనీ అందరికీ తెలును. కెరెన్స్కీ ప్రభుత్వం ఎస్.ఆర్.లూ, మెన్షివిక్కుల తోడ్పాటుతో ఈ చర్యకే ఇప్పుడు పూనుకుందని లెనిన్ ఆరోపిస్తాడు.

కాగితపు డబ్బు జారీ భారీగా జరిగితే, అది చట్టా వ్యాపారానికీ, పదార్థాల, యంత్రాల ధరలు పెరుగుతాయి కాబట్టి ఉత్పత్తి విస్తరణ, అవరోధానికీ దారితీస్తుంది. అంతేగాక పెట్టుబడిదారులకు విపరీత లాభాలు వస్తాయి కాబట్టి ఆ లాభాల సంపదను మరుగుపరచడం ఎక్కువవుతుంది. అప్పుడు అతి పెద్ద ఆదాయంపై అధిక రేట్ల ఆదాయపు పన్నును ప్రవేశపెట్టాలి. రష్యా ప్రభుత్వం ఆ పని చేసింది గానీ, అది నామమాత్రంగానే ఉంది. ఎందుకంటే డబ్బు విలువ అతి వేగంగా పడిపోతోంది. రహస్య గోపనం ఎక్కువయ్యేకొద్దీ, సంపదను, మరుగుపరచడం ఎక్కువవుతుంది. కనుక పన్నును నామమాత్రంగాక, నిజమైందిగా చెయ్యాలంటే, నిజమైన అజమాయిషీ, బ్యూరాక్రటిక్ అజమాయిషీగాక, పీడిత వర్గాల పటిష్ట అజమాయిషీ ఉండాలి కానీ నేటి రష్యా ప్రభుత్వం బూర్జువా వర్గంతో పొత్తు నాశనం కాకుండా ఉండడానికి బ్యూరోక్రటిక్ అజమాయిషీని ప్రవేశపెట్టి, దాన్నే 'విప్లవ ప్రజాస్వామిక అజమాయిషీ' అని పిలుస్తూ మోసం చేస్తోందంటాడు లెనిన్.

అయితే కాగితపు డబ్బు జారీని ప్రోత్సహిస్తున్నారు గానీ, పేదల విషయంలో దీని ఉపయోగం ఏదీ లేదు. ధనికుల విషయంలో మాత్రం దీనికి తోడు బ్యాంకుల జాతీయకరణ, వాణిజ్య గోపనం రద్దు చర్యలు జతకలిస్తే, ఉపయోగం ఉంటుంది. అయితే బూర్జువా వర్గపు ప్రత్యేక హక్కులు నాశనం చేస్తాయేమోనన్న భయంతో ఇది కుంటుపడుతోంది. అందువల్ల ప్రజాస్వామ్యం వాస్తవంగా విప్లవాత్మకం అయితే, ఇది సరిగ్గా అమలు జరుగుతోందని ఆయన చెబుతాడు.

ఇక బూర్జువా ఆస్తి పవిత్రత గురించి ప్రజాస్వామ్య విరుద్ధమైన దురభిప్రాయాలు, మనలో ఎంతగా జీర్ణించుకుపోయాయో చెప్పటానికి ఒక ఉదాహరణనిస్తాడాయన. ఒక కార్మికుని ఆదాయ వ్యయాల గురించిన సమాచారాన్ని ఒక ఇంజనీరో, బ్యాంకరో ప్రచురిస్తే, దాన్ని సరైందిగా భావిస్తారనీ, అదే ఒక బూర్జువా ఆదాయ దాపరికానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సహాయం చేసేందుకు ఒక ఉద్యోగిగానీ, కార్మికుడుగానీ ప్రయత్నిస్తే దాన్ని 'పొంచి కనిపెట్టడం', వేగుపని చెయ్యడంగా బూర్జువాలు గొడవ చేస్తారని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తాడు.

11) సోషలిజం దిశగా పురోగమించేందుకు భయపడితే, మనం ముందుకెళ్ళగలమా?:–

ఇప్పటిదాకా తను సూచించిన చర్యలిన్న ఎస్.ఆర్‌లూ, మెన్షివిక్కుల పత్రికలు, అవి ప్రజాస్వామ్య విరుద్ధమైన, అవి అప్పుడే సోసలిస్టు చర్యలని అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి ప్రస్తావిస్తూ లెనిన్, వాటి అంతరార్థం ఏమిటంటే, సోషలిజానికి పయనించేందుకు మనమికా పరిణతులం కాలేదనీ, ఇప్పుడు సోషలిజాన్ని ప్రవేశపెట్టడం మరీ తొందరపాటవుతుందనీ, మన విప్లవం బూర్జువా విప్లవం కాబట్టి, మనం బూర్జువా వర్గానికి పరిచారకులంగా ఉండాలన్నట్లు ఉందనీ అంటూ ఎద్దేవా చేస్తాడు.

నిజానికి వీరికి సామ్రాజ్యవాదమన్నా, పెట్టుబడిదారీ గుత్త సంస్థలన్నా, రాజ్యం అన్నా, విప్లవ ప్రజాస్వామ్యం అన్నా ఏమిటో తెలీదనీ, ఎందుకంటే వాటి గురించి తెలిసిన వారికెవరికైనా సోషలిజం దిశగా ముందుకెళ్ళడం అంటే పురోగమించడమేనని ఒప్పుకు తీరాలనీ ఆయన వాదిస్తాడు. సామ్రాజ్యవాదమంటే గుత్త పెట్టుబడిదారీ విధానం అని చెబుతూ, ఆయన, రష్యా అప్పుడే ఆ విధానంలోకి వచ్చిందని, పంచదార సిండికేటే అందుకొక ఉదాహరణ అని చూపిస్తాడు. మరి రాజ్య యంత్రమంటే... పాలకవర్గపు ఒక సంస్థ. ఉదా:– జర్మనీలో అది భూస్వాముల, పెట్టుబడిదారుల సంస్థ. అందుచేతనే జర్మన్ 'ప్లెహానోవ్'లు (ఫైడెమన్ వగైరాలు) యుద్ధకాలపు, సోషలిజం అని పిలిచేది యుద్ధకాలపు ప్రభుత్వ గుత్త పెట్టుబడారీ విధానం, దీన్ని మరింత సూటిగా, సరళంగా చెప్పాలంటే, కార్మికులకు యుద్ధకాలపు కఠిన శిక్ష, పెట్టుబడిదారీ లాభాలకు యుద్ధకాలపు రక్షణా అని వ్యాఖ్యానిస్తాడాయన.

ఇప్పుడిక భూస్వామ్య పెట్టుబడిదారీ రాజ్య యంత్రం స్థానంలో, ఒక విప్లవ ప్రజాస్వా

**"నిజానికి వీరికి సామ్రాజ్యవా దమన్నా, పెట్టుబడిదారీ గుత్త సంస్థలన్నా, రాజ్యం అన్నా, విప్లవ ప్రజాస్వామ్యం అన్నా ఏమిటో తెలీదనీ, ఎందుకంటే వాటి గురించి తెలిసిన వారికెవరికైనా సోషలిజం దిశగా ముందుకెళ్ళడం అంటే పురోగమించడమేనని ఒప్పుకు తీరాలనీ లెనిన్ వాదిస్తాడు."**

మిక రాజ్య యంత్రాన్ని అంటే విప్లవాత్మక పద్ధతిలో అన్ని ప్రత్యేక హక్కుల్నీ రద్దుచేసే, పూర్తి ప్రజాస్వామ్యాన్ని ప్రవేశపెట్టేందుకు జంకని రాజ్య యంత్రాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించండి. అది నిజమైన విప్లవ ప్రజాస్వామిక రాజ్యయంత్రం గనుక అయినట్లైతే, అది ప్రభుత్వ గుత్త పెట్టుబడిదారీ విధానం అయితే, అనివార్యంగా సోషలిజం దిశగా ఒక అడుగు, ఒకటి కంటే ఎక్కువే అడుగులు అవుతాయన్న విషయం మీరు చూస్తారు అంటూ ఆయన, దాన్ని ఈ క్రింది విధంగా రుజువు చేస్తాడు:

బృహత్తరమైన ఒక సంస్థ గుత్త సంస్థ అయితే, అది మొత్తం జాతికి సేవ చేస్తోందని అర్థం. అదేగనుక ప్రభుత్వ గుత్త సంస్థ అయితే, ప్రభుత్వమే ఆ సంస్థని నడిపిస్తుంది. అది భూస్వాముల, పెట్టుబడిదారుల ప్రయోజనార్థం ఉన్నట్లయితే, అభివృద్ధి నిరోధక బ్యూరాక్రటిక్ రాజ్యయంత్రం అవుతుంది. అలాగాక అది, విప్లవ ప్రజాస్వామ్య ప్రయోజనార్థమైతే, అప్పుడది సోషలిజం దిశగా ఒక అడుగు. ఎందుకంటే, సోషలిజం ప్రభుత్వ పెట్టుబడిదారీ గుత్తాధిపత్యం నుంచి కేవలం తదుపరి ముందడుగు మాత్రమే. దీన్ని మరోలా చెప్పాలంటే సోషలిజం కేవలం, యావన్మంది ప్రజల ప్రయోజనాల కనుగుణంగా సేవ చేసేలా చెయ్యబడిన, ఆ మేరకు పెట్టుబడిదారీ గుత్తాధిపత్యంగా ఉండటం మానుకున్న ప్రభుత్వ పెట్టుబడిదారీ గుత్తాధిపత్యం.

ఇందులో మధ్య క్రమం ఏదీ లేదు. అభివృద్ధి యొక్క వాస్తవ క్రమం ఏమంటే, సోషలిజం దిశగా పురోగమించందే, గుత్త సంస్థలనుంచి పురోగమించడం అసాధ్యం. వాస్తవంలో మనం విప్లవ ప్రజాస్వామ్యవాదులుగా వుండి, సోషలిజం దిశగా చర్యలను తీసుకోనైనా తీసుకోవాలి, లేదా అందులో భయపడుతూనైనా 7ండాలి. అలా భయపడుతున్నట్లయితే, మన విప్లవం బూర్జువా విప్లవం గనుక సోషలిజం ప్రవేశపెట్టడం సాధ్యం కాదంటూ ప్లెహానోవ్, చెర్నావ్ వగారాల్ని ఖండించాలి. అప్పుడు మనం కేరెన్సీలా దిగజారి, రైతుల, కార్మికుల ఆకాంక్షల్ని అణచివేస్తాం. అంతేతప్ప చరిత్రలో, ముఖ్యంగా యుద్ధకాలంలో స్తబ్దంగా వుండిపోవడం అసాధ్యం. మనం పురోగమించాలి, లేదా తిరోగమించాలి. సోషలిజం దిశగా పురోగమించకుండా, ఆ దిశగా చర్యలు తీసుకోకుండా, ముందుకు పోవడం అసాధ్యం. పరోగమించేందుకు భయపడటమంటే అర్థం తిరోగమించడమే. కేరెన్స్కీ చేస్తున్నదదే అంటూ వివరిస్తాడాయన. చరిత్ర గతి తర్కం ఎలాంటిదంటే, యుద్ధం ప్రభుత్వ గుత్త పెట్టుబడిదారీ విధానంలోకి, గుత్త పెట్టుబడిదారీ విధాన పరివర్తనను త్వరితం చెయ్యడం ద్వారా, తద్వారా మానవ జాతిని అది సోషలిజం దిశగా పురోగమింపజేసింది. సామ్రాజ్యవాద యుద్ధం సోషలిస్టు విప్లవ ప్రాంగణం. ప్రభుత్వ గుత్త పెట్టుబడిదారీ విధానం సోషలిజానికి పూర్తి పాదార్థిక సన్నాహం, చరిత్రనిచ్చెనమీద ఒక మెట్టు. ఈ మెట్టుకీ, సోషలిజమనే మెట్టుకీ మధ్య మధ్యంతరమైన మెట్లు ఏవీ లేవు అంటూ విశదం చేశాడాయన.

ఎస్.ఆర్.లూ, మెన్షివిక్కులూ సోషలిజాన్ని సుదూరమైన అంధకార భవిష్యత్తుగా చిత్రిస్తారుగానీ, ఆధునిక పెట్టుబడిదారీ విధానపు కిటికీల నుంచి సోషలిజం తొంగి చూస్తోందని, జర్మనీలో ప్రవేశపెట్టబడిన సార్వత్రిక నిర్బంధ శ్రమ సమీకరణే దానికి ఒక ఉదాహరణగా చూపిస్తాడు. పెట్టుబడిదారీ విధానం చేసే జాతీయ శ్రమ వృధావ్యయం దిశగా వేసే ఒక అడుగు. దాన్ని జర్మనీలో ప్రవేశపెట్టేది భూస్వాములూ, పెట్టుబడిదారులూ కాబట్టి, అది అనివార్యంగా కార్మికులకు యుద్ధకాలపు కఠిన శ్రమశిక్ష అవుతుంది. కానీ కార్మిక, సైనిక రైతు ప్రతినిధుల సోవియట్ల చేత ప్రవేశపెట్టబడి నియంత్రించబడే సార్వత్రిక నిర్బంధ శ్రమ సమీకరణ గురించి ఆలోచించండి. అదింకా సోషలిజం కాదుగానీ, అది ఇంకెంతమాత్రమూ పెట్టుబడిదారీ విధానంగా ఉండబోదు. అది సోషలిజం దిశగా గొప్ప ముందడుగు అవుతుందని ఆయన వ్యాఖ్యానిస్తాడు.

12) ఆర్థిక అస్తవ్యస్థ స్థితికి వ్యతిరేకంగా పోరాటమూ, యుద్ధమూ :-

ముప్పు నివారణ చర్యల పరిశీలనలో మరో ముఖ్య సమస్య, దేశాంగ, విదేశాంగ విధానాన్ని - ఇంకో విధంగా చెప్పాలంటే దురాక్రమణపర సామ్రాజ్యవాద యుద్ధానికీ - విప్లవాత్మక శ్రామిక వర్గ యుద్ధానికీ మధ్య అంటే నేరపూరిత దోపిడీ యుద్ధానికీ-న్యాయబద్ధ ప్రజాస్వామిక యుద్ధానికీ మధ్యగల సంబంధాన్ని మన ముందుకు తెస్తుందని లెనిన్ స్పష్టం చేస్తాడు.

ముప్పును నివారించడానికి తను ఇంతకు ముందు పేర్కొన్న చర్యలన్నీ దేశ సైనిక శక్తిని పెంపొందించి ఉండేవనీ, అలాగే దురాక్రమణపర యుద్ధాన్ని న్యాయబద్ధమైన యుద్ధంగా, ఇంకా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పెట్టుబడిదారులు సాగించే యుద్ధంగా గాక, దోచుకోబడే ప్రజల ప్రయోజనం కోసం శ్రామికవర్గం సాగించే యుద్ధంగా మారిస్తేగానీ, ఈ చర్యల్ని అమలు పరచడం సాధ్యంకాదని ఆయన వివరిస్తాడు. ఇతర యుద్ధమగ్న యూరప్ దేశాలకన్నా రష్యా ధాన్యం, బొగ్గు, ఇనుము, నూనెల విషయంలో మెరుగైన స్థితిలో ఉండటం వల్ల, తానింతకు ముందు చెప్పిన ముప్పు నివారణ చర్యలు తీసుకున్నట్లయితే, జాతీయ శ్రమశక్తి సాధనాల పొదుపు జరిగి, శ్రామికవర్గ స్థితిగతులు మెరుగుపడి, ఆర్థిక నిర్వహణ ఉన్నతస్థాయిలో ఉంటుందనీ, ఆధునిక యుద్ధంలో ఆర్థిక నిర్వహణకి అమిత ప్రాముఖ్యం ఉన్న సంగతి అందరికీ తెలుసుననీ ఆయన వెల్లడిస్తాడు.

అలాగే ఎస్.ఆర్.లూ, మెన్షివిక్కులూ అజమాయిషీకి తూట్లు పొడిచేట్లు బూర్జువాలతో పొత్తు బదులు, సోవియట్లకి అధికారం బదిలీ చేసివుంటే, క్యాడెట్లతోపాటు పదవుల ఆక్రమణ కోసం గాక, కార్మికులూ, రైతులూ పెట్టుబడికి వ్యతిరేకంగా జరిపే యుద్ధంలో వారికి సహాయం చేసి ఉంటే, ఈ సరికి రష్యా ఆర్థికంగా పరివర్తన జరిగి, బ్యాంకులు జాతీయం చెంది, ఆ మేరకు ఇతర పెట్టుబడిదారీ దేశాల కన్నా ఉన్నతస్థితిలో ఉండేదని, ఏ దేశపు బ్యాంకులు వ్యక్తుల చేతుల్లోకన్నా జాతి చేతిలో ఉంటాయో, ఏ దేశపు భూమి కొద్దిమంది భూస్వాముల చేతుల్లోకన్నా రైతు కమిటీల చేతుల్లో ఉంటుందో, ఆ దేశపు సైనిక శక్తి, రక్షణ పాటవం ఉన్నతస్థితిలో ఉంటుందని ఆయన వక్కాణిస్తాడు.

18వ శతాబ్ది అందులో (1792-93) ఫ్రెంచి జాతీయులు ప్రదర్శించిన వీరోచిత దేశభక్తీ, సైనిక వీరకృత్యాలూ రష్యాలో

❝ ప్రస్తుతం సామ్రాజ్యవాద దేశాలతో పాటు ఆ దేశాల పెట్టుబడిదారులతో జార్ రహస్యంగా కుదుర్చుకున్న ఒడంబడికల కనుగుణంగా రష్యా సాగిస్తున్న సామ్రాజ్యవాద యుద్ధం అన్యాయ యుద్ధం. యుద్ధపు సామాజిక స్వభావమూ, దాని నిజమైన అర్థమూ, శత్రు సైనిక స్థానాన్ని బట్టి (ఎస్.ఆర్.లూ, మెన్షివిక్కులూ అనుకుంటున్నట్లు) నిర్ణయింపబడదు. ఏదైనా ఒక యుద్ధం ఏ విధానానికి కొనసాగింపో ఆ విధానం యుద్ధాన్ని నిర్ణయిస్తుంది. ❞

కూడా ప్రదర్శించబడాలంటే 'జాకోబిన్' తరహాలో (ఫ్రెంచ్ బూర్జువా విప్లవకాలంలో వామపక్ష రాజకీయ గ్రూపు అయిన వీరు ఫ్యూడలిజం, నిరంకుశ రాజరిక పాలన రద్దు గురించి అదే పనిగా పట్టుదలగా వాదించారు) కాలం చెల్లిన వాటినన్నింటినీ నిర్దాక్షిణ్యంగా తుడిచెయ్యడంతోపాటు, ఆర్థిక పునరుజ్జీవనం పొందాలి. అంటే జారిజాన్ని తుడిచెయ్యడంతో సరిపెట్టకుండా, భూస్వామ్య విధానాన్ని రద్దు చేస్తూనే, బ్యాంకుల్ని జాతీయం చెయ్యాలి.

ప్రస్తుతం సామ్రాజ్యవాద దేశాలతో పాటు ఆ దేశాల పెట్టుబడిదారులతో జార్ రహస్యంగా కుదుర్చుకున్న ఒడంబడికల కనుగుణంగా రష్యా సాగిస్తున్న సామ్రాజ్యవాద యుద్ధం అన్యాయ యుద్ధం. యుద్ధపు సామాజిక స్వభావమూ, దాని నిజమైన అర్థమూ, శత్రు సైనిక స్థానాన్ని బట్టి (ఎస్.ఆర్.లూ, మెన్షివిక్కులూ అనుకుంటున్నట్లు) నిర్ణయింపబడదు. ఏదైనా ఒక యుద్ధం ఏ విధానానికి కొనసాగింపో ఆ విధానం యుద్ధాన్ని నిర్ణయిస్తుంది. (యుద్ధం రాజకీయ విధానం కొనసాగింపు) యుద్ధాన్ని సాగిస్తున్న వర్గం ఏది, అది ఆ యుద్ధాన్ని ఏ లక్ష్యం కోసం సాగిస్తోంది అన్న విషయాలు నిర్ణయిస్తాయి. రహస్య ఒడంబడికల ప్రకారం ప్రజల్ని దోపిడీ యుద్ధంలోకి నడిపించి, ప్రజలు సముత్సాహంగా ఉండాలని మీరు ఆశించలేరు. రష్యాలో అత్యంత ప్రముఖ వర్గమైన శ్రామికవర్గం, యుద్ధనేర స్వభావాన్ని నానాటికీ స్పష్టంగా గ్రహిస్తోంది. సామ్రాజ్య వాదంతో తెగతెంపులు చేసుకోందే, అన్ని జాతులకీ ప్రజాస్వామిక శాంతిని ప్రతిపాదించందే, తద్వారా ఈ యుద్ధాన్ని దురాక్రమణ పర, దోపిడీ, నేరపూరిత యుద్ధం నుంచి, న్యాయబద్ధ, విప్లవాత్మక, ఆత్మరక్షణ పర యుద్ధంలోకి మార్చందే, ప్రజాస్వామ్యపు వీరత్వాన్ని జాగృతం చెయ్యలేరు. దేశాంగ, విదేశాంగ విధానాల్లో పెట్టుబడిదారుల నుంచి పూర్తిగా వేరుపడిపోవడం మాత్రమే సామ్రాజ్య వాదపు ఇనుప అడకత్తెరలో చిక్కుకున్న మన విప్లవాన్నీ, దేశాన్నీ కాపాడగలదు అంటూ లెనిన్ సంబంధిత వర్గాలకు (ఎస్.ఆర్.లకూ, మెన్షివిక్కులకూ) సవివరంగా హితబోధ చేస్తాడు.

13) విప్లవ ప్రజాస్వామ్య వాదులూ, విప్లవకర శ్రామికవర్గమూ:–

ఇప్పటివరకూ రాబోతున్న ముప్పుని ఎదుర్కొనే సాధనాల్ని విశ్లేషించడం వల్ల చేసిన నిర్ధారణ ఏమంటే, రష్యాలోని ప్రజాస్వామిక వాదులు విప్లవకారులుగా ఉండాలంటే, వారు సుస్థిర విప్లవకర వర్గమైన శ్రామికవర్గంతో కలిసి ముందుకెడుతూ, అది జరిపే పోరాటాల్ని సమర్థించాలి. యుద్ధం కనీవినీ ఎరుగని సంక్షోభాన్ని సృష్టించి, యావత్తు సామాజిక నిర్మాణాన్నీ పెను అఘాతాలకు గురిచేసింది. ఇప్పుడు మానవజాతి తను నశించిపోవడమో, లేదా ఉన్నతమైన ఉత్పత్తి విధానానికి శీఘ్రంగా పరివర్తన సాధించేందుకు తన భవితవ్యాన్ని విప్లవకర వర్గానికి అప్పగించడమో ఎంపిక చేసుకోవాల్సి ఉందని లెనిన్ స్పష్టం చేస్తాడు.

ఇంతకీ రష్యా బాగా వెనుకబడి పోవడం, యుద్ధం కష్టాలూ, జారిజం కుళ్ళిపోవడం, 1905 మొదటి విప్లవం నాటి సంప్రదాయాలు ఇంకా నిలిచి ఉండటం వల్ల – ఇతర దేశాల్లోకంటే, రష్యాలో ముందుగా విప్లవం ప్రజ్వరిల్లింది. రాజకీయంగా రష్యా కొద్దినెలల్లో పురోగామి దేశాల్ని అందుకోవడాన్ని విప్లవం సాధ్యం చేసింది. అయితే ఇది మాత్రమే సరిపోదు. నశించిపోనైనా నశించిపోండి, లేకుంటే పురోగామి దేశాల్ని ఆర్థికంగా కూడా అందుకొని, దాటి ముందుకైనా వెళ్ళాలన్న ప్రత్యామ్నాయాన్ని ముందుకు తెచ్చింది... రష్యాకి ఇది సాధ్యమే. పురోగామి దేశాల అనుభవం, సాంకేతిక విజ్ఞాన, సాంస్కృతిక ఫలితాలు మన ముందున్నాయి. అంతేగాక, యూరప్‌లో యుద్ధం పట్ల పెరుగుతున్న నిరసనా, ప్రపంచ విప్లవ వాతావరణం మనకి నైతికతోడ్పా టునందిస్తున్నాయని ఆయన నొక్కి చెబుతాడు.

ఈ పరిస్థితుల్లో రైతుల పట్ల, శ్రామికుల వైఖరి, రైతుల్ని బూర్జువా వర్గ ప్రభావం నుండి బయటకు లాగాలన్న పాత బోల్షివిక్ భావనకు బలం చేకూరుస్తోందనీ, ఎందుకంటే పెటీ బూర్జువా జనబాహుళ్యంలో రైతులే అధిక సంఖ్యాకులనీ, అలాగే రైతుల్ని బూర్జువా వర్గ ప్రభావంలో ఉంచి, వారిని కార్మికవర్గంతో కాక, బూర్జువా వర్గ ప్రభావంలో ఉంచే అభివృద్ధి నిరోధక క్రియను ఎస్.ఆర్.లూ, మెన్షివిక్కులూ నిర్వహిస్తున్నప్పటికీ, అది క్రమంగా విఫలమవుతోందనీ, అందుకు కారణం ప్రజాస్వామ్యం విప్లవానుభవం వంటివి త్వరగా నేర్చుకోవడమేనన్న విశ్లేషణను ఆయన అందిస్తాడు. అందుకు నిదర్శనంగా ఆగస్టు 31న సెప్టెంబర్ 5న పెట్రో గ్రాడ్, మాస్కో సోవియట్ల లో వారు ఓడింపబడటం (ఆ రెండు సోవి యట్లలో బోల్షివిక్కులు విజయం సాధించారు) అందుకనుగుణంగా సెప్టెంబర్ 10న పెట్రోగ్రాడ్‌లో జరిగిన ఎస్.ఆర్.ల కాన్ఫరెన్స్‌లో వామపక్షం 2/3 మెజారిటీ సాధించడాన్నీ చూపిస్తాడు.

నిజానికి కొందరు బూర్జువాలు ప్రజాస్వామ్యాన్ని వల్లిస్తుంటారనీ, కానీ నిజమైన ప్రజాస్వామిక వాదులకీ, ఈ బూర్జువా ప్రజాస్వామిక వాదులకీ పోలికే లేదనీ, అయినప్పటికీ ఈ బూర్జువా ప్రజాస్వామిక వాదుల్ని చూసి ఎస్.ఆర్.లూ, మెన్షివిక్కులూ తమకు పట్టున్న పెటీ బూర్జువా వర్గమైన రైతాంగాన్ని బూర్జువా వర్గంతో పొత్తులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారనీ, ఇదే వాళ్ళ పొత్తుకీ, మిశ్రమ మంత్రి వర్గానికీ నమూనా ప్రాయుడైన అర్థకాడెట్ కేరెన్స్కీ విధానమంతటికీ తాత్పర్యమనీ, ఈ ఆర్నెల్ల విప్లవ కాలంలో ఈ విధానం ఘోరంగా విఫలమైందనీ ఆయన సూత్రీకరించాడు.

అయితే ఈనాడు విప్లవం ఘోరంగా విఫలమైందనీ, యుద్ధంతోగానీ, ఆర్థిక అస్తవ్యస్థ స్థితిలోగానీ, అది సరిగా వ్యవహరించలేకపోయిందనీ కాడెట్లు విషపూరిత ఆనందంతో ఓలలాడుతున్నారుగానీ, వారి ఆనందం ఎక్కువ కాలం నిలబడదంటాడు లెనిన్. ఇంతకీ విఫలమైంది క్యాడెట్లు, ఎస్.ఆర్.లూ, మెన్షివిక్కులూ మాత్రమేనని, ఎందుకంటే, రష్యాని ఆర్నెల్లు పాలించి, ఆర్థిక అస్తవ్యస్థ స్థితిని పెంపొందించింది వీరి పొత్తేనని ఆయన ఎత్తి చూపిస్తాడు. ఏమైనా, బూర్జువాలతో ఎస్.ఆర్.లు, మెన్షివిక్కుల పొత్తు ఎంత ఎక్కువ విఫలమైతే అంత త్వరగా ప్రజలు గుణపాఠాన్ని నేర్చుకొని, దాన్నుంచి తేలిగ్గా బయటపడే మార్గమైన పేద రైతులకూ, శ్రామికవర్గానికీ మధ్య పొత్తును వారు కనుగొనగలరని పేర్కొంటూ ఆయన వ్యాసాన్ని ఆశాభావంతో ముగిస్తాడు.

❄

# మతోన్మాదానికి మతంతో సంబంధం లేదు...

## సందేహాలు సమాధానాలు



**- బి.వి.రాఘవులు**

**ప్రశ్న : సామాజిక, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా పోరాటంతో పాటు మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడవలసిన ఆవశ్యకత ఉందని భావిస్తున్నాను. దోపిడీ పాలకవర్గాల సైద్ధాంతిక ఆయుధం. 'మతం'. మార్క్సిస్టు' సిద్ధాంతానికి పునాది నాస్తికత్వం. ఆర్థిక దోపిడీ, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడటానికి నాస్తికత్వం గురించి ఎందుకు చెప్పలేకపోతున్నారు? వివరించకోరుతున్నాను.**

**– తుంపాల శ్రీరామమూర్తి,**
**గాజువాక, విశాఖపట్నం.**

మతోన్మాదానికి, మతానికి ఉన్న వ్యత్యాసాన్ని గమనించాలి (ఇంకో ప్రశ్నకు సమాధానం చూడండి). లేనియెడల మత వ్యతిరేకతే కమ్యూనిస్టుల ప్రధాన కార్యక్రమంగా భావించబడే అవకాశం ఉంది.

సిపిఐ(యం) తన నిబంధనావళిలో పార్టీలో ఉండటానికి నాస్తికత్వం ఒక అర్హతగా పెట్టలేదు. ఎందుకంటే మతం–నాస్తికత్వం మొదలైన అంశాలు చాలా సంక్లిష్టమైనవి. మతంలో వర్గ పోరాటానికి తక్షణం ఆటంకమయ్యే అంశాలను, సుదీర్ఘ కాలంలో అదృశ్యం కావల్సిన అంశాలను అర్థం జేసుకుని వ్యవహరించాలని భావిస్తున్నది. దోపిడీ వ్యవస్థలు ఆవిర్భవించిన తర్వాత మతాలకు దోపిడీని రక్షించే స్వభావం అదనంగా చేరింది. ఈ స్వభావం మతాలలో ఇంకా బలపడింది. దోపిడీ సమాజాలను బలపరిచే మతాంశాలను ఎండగట్టడంలో కమ్యూనిస్టులు ఎప్పుడూ వెనుకబడకూడదు.

గతితార్కిక భౌతికవాదం ప్రకృతిలోను, మానవ జీవితంలోను అతీత శక్తులకు, దేవునికి ప్రమేయం లేదని భావిస్తుంది. గతి తార్కిక భౌతికవాదాన్ని అంగీకరించే ప్రతి వ్యక్తి ఆ రకంగా నాస్తికుడుగా మారాలి. గతితార్కిక భౌతికవాదాన్ని అంగీకరించే కమ్యూనిస్టు పార్టీల సభ్యులు కూడా వ్యక్తులుగా నాస్తికత్వాన్ని అనుసరించాలి. ఇది వ్యక్తిగతంగా వ్యవహరించాల్సిన అంశం. ఒకవైపున గతితార్కిక భౌతికవాదినని చెబుతూ, మరోవైపున అతీత శక్తులను నమ్మేవారు కమ్యూనిస్టు పార్టీ సభ్యులైనా, కానివారైనా హిపోక్రాట్స్ అవుతారు.

శాస్త్రవిజ్ఞానం శాస్త్రీయ ఆలోచన అభివృద్ధి కావడానికి నాస్తికత్వం ఒక ముఖ్య పునాది. నాస్థికత్వం గురించి సమాజంలో విస్తృతంగా ప్రచారం జరగాలి. అటువంటి ప్రచారాన్ని నిర్వహించేవారిని ప్రోత్సహించాలి. ప్రజాస్వామ్యంలో మత భావాలను ప్రచారం చేసుకునే వారికి ఎంత హక్కుందో నాస్తిక భావాలను ప్రచారం చేసుకునే వారికి కూడా అంతే హక్కు ఉండాలి.

అయితే కమ్యునిస్టు పార్టీ నాస్తికత్వాన్ని ప్రచారం చేయడం ఒక ముఖ్య రాజకీయ లక్ష్యంగా పెట్టుకోజాలదు. ఆస్థికులు, నాస్థికులు అనే తేడా లేకుండా వర్గ, సామాజిక, ప్రజా పోరాటాలలోకి కూడగట్టే తక్షణ రాజకీయ లక్ష్యంతో కమ్యునిష్టు పార్టీ కృషిజెయ్యాల్సి ఉండడమే దీనికి కారణం.

**ప్రశ్న : కమ్యూనిస్టులు అన్ని రకాల మతోన్మా దాన్ని ఒకే విధంగా విమర్శించడం లేదనీ, హిందూ మతోన్మాదం మీద చేసినంత దాడి మిగతా మతాలపై చేయడం లేదని కొంత మంది ఆరెస్సెస్‌ను కూడా వ్యతిరేకించే, సాధారణ హిందూమత అభిమానుల విమర్శ. ఇది నిజమేనా? మతోన్మాదం మీద దాడి విషయంలో తరతమ బేధాలు చూపవలసిన అవసరం ఉందా?**

కమ్యూనిస్టులు మతాల పుట్టుక పెరుగుదల, దాని సామాజిక పాత్రల గురించి ప్రజలకు వివరిస్తారు తప్ప మతాల మీద దాడి చేయరు. ప్రతి ఒక్క వ్యక్తికి తనకు నచ్చిన మతాన్ని అనుసరించే హక్కు లేదా ఏ మతాన్ని అనుసరించకుండా మతరహితంగా నాస్తికునిగా ఉండే హక్కు ఉండాలని కమ్యునిస్టులు చెప్తారు. మతం వ్యక్తిగత విషయంగా ఉండాలని, రాజ్యం మతం నుండి దూరంగా ఉండాలని డిమాండ్ చేస్తారు. మతం వేరు. మతోన్మాదం వేరు. తన మతమే గొప్పదని, ఇతర మతాలు తమ మతాలకు లోబడి ఉండాలని, రాజ్యం తమ భావాలు, సిద్ధాంతాలకనుగుణంగా ఉండాలని భావించే ఆలోచనలను మతోన్మాదం అంటారు. ఇటువంటి మతోన్మాదం ఏ మతానికి చెందినదైనా సమాజానికి, ముఖ్యంగా సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవితానికి వారి ఐక్యతకు, ఉద్యమాలకు హాని చేస్తుంది. నష్టం కలిగిస్తుంది. అంతేకాక నిరంకుశ పోకడలను వ్యవస్థీకృతం చేసి ప్రజాస్వామ్యానికి, శాస్త్ర విజ్ఞానానికి తీవ్రమైన హానిజేస్తుంది. అందుకే కమ్యూనిస్టులు అన్ని రకాల మతోన్మాదాలను తీవ్రంగా వ్యతిరేకిస్తారు. కమ్యూనిస్టులే కాకుండా మానవత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తారు. మన దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ సందర్భాలలో మతోన్మాదులు పాల్పడిన అకృత్యాలను వ్యతిరేకించిన వ్యక్తులను, సంస్థలను పరిశీలిస్తే ఈ విషయం ఎవరికైనా విదితం అవుతుంది. అన్ని మతోన్మాదాలు ప్రజలకు నష్టదాయకమైనవే. అన్నింటినీ వ్యతిరేకించాల్సిందే. వాస్తవంగా కమ్యూనిస్టులే అన్ని రకాల మతోన్మాదాలను గట్టిగా వ్యతిరేకిస్తారు. ఒక మతోన్మాదం ఇంకో మతోన్మాదం పెరగడానికి తోడ్పడుతుందని, అవి పరస్పర పోషకాలని,మతోన్మాదాన్ని బలహీనం చేయాలంటే అన్నింటిపై పోరాటం చేయాలని కమ్యూనిస్టులు భావిస్తారు.

అయితే ఏ దేశంలోనైనా మతోన్మాద శక్తులన్నీ సమానమైన శక్తి కలిగి ఉండవు. మెజారిటీ మతోన్మాదం ఉంటుంది. మైనారిటీ మతోన్మాదం ఉంటుంది. మెజారిటీ మతోన్మాదం జనాభారీత్యా, రాజ్యం అండరీత్యా ఇంకా కొన్ని రకాల అవకాశాల రీత్యా మరింత ప్రమాదకరంగా తయారవుతుంది. మన దేశంలో హిందూత్వ మతోన్మాదం మెజారిటీ పేరుతో అత్యంత ప్రమాదకరంగా ఉంటే, పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి ఇస్లాం మెజారిటీ దేశాలలో ఇస్లామిక్ మతోన్మాదం మెజారిటీ మతోన్మాదంగా ఉండి ప్రమాదకరంగా ఉన్నది. అందువలన ఏ దేశంలోనైనా అక్కడ ఉన్న మెజారిటీ మతోన్మాదాన్ని ఎదిరించడం ముఖ్య కర్తవ్యంగా ప్రజాస్వామ్యవాదులకు ఉంటుంది. దీనర్థం మైనారిటీ మతోన్మాదాన్ని ఉపేక్షించడం కాదు. విమర్శను, వ్యతిరేకతను తగ్గించుకోవడం కాదు. రెండింటి మధ్య తారతమ్యాలను గమనించడమే.

కమ్యూనిస్టులు నికరంగా రెండు రకాల మతోన్మాదాలపై పోరాడుతున్నారు కాబట్టే అవి రెండూ కమ్యూనిస్టులపై తీవ్ర ద్వేషాన్ని ప్రదర్శిస్తాయి. సంఘపరివార్ శక్తులను నిరంతరంగా, నిష్కర్షగా ప్రతిఘటిస్తున్నాయి. కాబట్టే హిందూ మతాన్ని అనుసరించే లౌకిక

## ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్ర

(18వ పేజీ తరువాయి)

మాన్యాలు, ఉద్యోగులు, ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు ఆమలు జరిగేలా ప్రభుత్వమే పూనుకునేది. ఇందుకు సంబంధించి ప్రభుత్వమే నియమించిన అర్జున్ సేన్ గుప్తా సారధ్యంలోని కమిటి చేసిన సూచనలను పట్టించుకోలేదు.

నిజంగా ఈ రోజు జరుగుతున్నదే మిటంటే ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేయడం, తద్వారా వచ్చిన ఆదాయాన్ని ద్రవ్యలోటును భర్తీ చేయటానికి వాడుకోవడం. ప్రభుత్వ ఖర్చుల కోసం కూడా ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేసే స్థితికి వచ్చారు. ఇది ప్రయివేటు రంగానికి, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలకి సంతోషదాయకం. ఎందుకంటే అత్యంత విలువగలిగిన ఆస్తులను కారు చౌకగా సొంతం చేసుకోవచ్చు, ధరలను నిర్ణయించటంలో వెసులుబాటుని డిమాండ్ చేయటం, అవసరమయితే ఆర్థికంగా కూడా ప్రభుత్వ మద్దతు తీసుకుని దానినే అందంగా పబ్లిక్ – ప్రయివేటు భాగస్వామ్యం అంటున్నారు. అందువలనే పిపిపిలు అంటేనే మొత్తం రిస్కులన్నీ ప్రభుత్వానివని, లాభాలు మాత్రం ప్రయివేటు వారివే అని ఎగబడుతున్నారు. అందువలనే ప్రభుత్వం కనుక ఈ రకమైన రాయితీలు ఇవ్వకపోతే, ప్రయివేటురంగం నుండి ఆదాయం ఈ మాత్రం కూడా రాదని వాదన. అందుకని కార్పొరేట్ రంగం అధిపతులు, దేశీయ, అంతర్జాతీయ కార్పొరేట్ దిగ్గజాలు, కొంతమంది మీడియా అధినేతలు ప్రయివేటీ కరణే ఒక పెద్ద ముందడుగని వాఖ్యానిస్తున్నారు.

కాని ఈ ప్రక్రియ యొక్క ఫలితాలు ఇంకోలా కూడా ఉంటాయి. కార్మికవర్గానికి చాలా నష్టం జరుగుతోంది. వారి నిజవేతనాలు తరిగిపోవటం, పని పద్ధతులు దిగజారిపోవటం జరుగుతాయి. దాని ప్రభావం బయట ఉన్న కార్మికవర్గం మీద కూడా పడుతోంది. ఎందు కంటే వారు ఈ ప్రభుత్వ రంగ కార్మికవర్గాన్ని చూపించి తమ పని పద్ధతులో వేతనాలను, జీవన స్థితిలను మెరుగు పరుచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

## వార్తా పత్రికల రిజిస్ట్రేషన్

**(రూలు 8వ ఫారం IV ప్రకారం)**

**మార్క్సిస్టు మాసపత్రిక ప్రచురణ వివరాలు**

| | | | |
|---|---|---|---|
| 1. | ప్రచురణ స్థలం | : | హైదరాబాద్ |
| 2. | ఏ రకమైన పత్రిక | : | మాసపత్రిక |
| 3. | ముద్రాపకుని పేరు చిరునామా | : | 1-1-60/2, యం.బి. భవన్, ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్, హైదరాబాద్ - 20. |
| 4. | ప్రచురణ కర్త పేరు చిరునామా | : | బి.వి. రాఘవులు 1-1-60/2, యం.బి. భవన్, ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్, హైదరాబాద్ - 20. |
| 5. | సంపాదకుని పేరు చిరునామా | : | ఎస్. వెంకట్రావ్ డోర్ నెం. 27-30-4, యం.బి. విజ్ఞానకేంద్రం, గవర్నరుపేట, విజయవాడ. |
| 6. | పత్రిక యాజమాన్యం | : | భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ |

బి.వి. రాఘవులు అను నేను పైన పేర్కొన్న వివరాలు విశ్వసనీయమైనవని ఇందుమూలముగా తెలియసజేస్తున్నాను.

**సం/-**
**బి.వి. రాఘవులు**
ప్రచురణ కర్త

వాదుల నుండి కమ్యూనిస్టులను వేరుచేయడానికి హిందూత్వ శక్తులు కమ్యూనిస్టుల అభిప్రాయాలను వక్రీకరించి, అబద్ధాలను జోడించి ప్రచారం జేస్తుంటారు. వక్రీకరించడం, అబద్ధాలు సృష్టించడం, అభూత కల్పనలను ప్రత్యర్థులకు వ్యతిరేకంగా వినియోగించడం సంఘ పరివార్ శక్తుల కు అలవాటన్నది తాజాగా జెఎన్‌యులో, పాటి యాలా కోర్టులో జరిగిన ఘటనల సందర్భంగా రుజువయింది. ఫాసిస్టు స్వభావం ఉన్న హిందూ త్వ శక్తులకు అబద్ధాలపై ఆధార పడి బతకడం స్వభావ సిద్ధం. వారి ప్రచారం లో పడి కొంత మంది అమయకంగా మోసపోయే వాళ్ళుంటున్నారు. అటువంటి వారివద్దకు వాస్తవాలను తీసుకెళ్ళాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నది. (పీపుల్స్ డెమోక్రసీ పత్రికలో ప్రకాష్ కారత్‌గారు రాసిన వివరణ కూడా చదివితే సిపిఐ(ఎం) వైఖరి మరింత స్పష్టం అవుతుంది)

**ప్రశ్న : అనేక దాడులను తట్టుకుని త్రిపురలో సిపిఎం ప్రస్తుతం ఒక సానుకూల వాతావరణంలో పురోగమిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇటువంటి క్రమంలోనే గతంలో బెంగాల్‌లో అన్యవర్గ ధోరణులు పెరిగాయి. సభ్యులలో సైద్ధాంతిక స్థాయి తగినంతగా లేకపోవడం అనేది దేశ వ్యాపితంగా పార్టీకి ఉన్న సమస్యగా గుర్తించారు. ఈ విషయంలో త్రిపుర కృషి ఎలా ఉంది?**

**– పి. పాండురంగారావు,** చింతలపూడి,

పరిపాలనా పదవులలో, బాధ్యతలలో సుదీర్ఘకాలం కొనసాగిన చోట కమ్యూనిస్టులలో అన్యవర్గ ధోరణులు పెరిగే అవకాశం ఉందన్న అనుభవం అన్ని దేశాలలోనూ ఉన్నది. పశ్చిమ బెంగాల్‌లో సుదీర్ఘకాలం ప్రభుత్వంలో కొనసాగినందున అవినీతి, ఆశ్రిత పక్షపాతం వంటివి కొంతమంది నాయకులు, కార్యకర్తలలో ప్రవేశించిన మాట వాస్తవం. ఎప్పటికప్పుడు వాటిని ప్రక్షాళన చేస్తున్నా నష్టాన్ని పూర్తిగా నివారించలేకపోయాం. అందువలనే దిద్దుబాటు ఎప్పుడో ఒకసారి కాకుండా నిరంతరం, ప్రతి సంవత్సరం జరగాలని ఇప్పుడు పార్టీ తీర్మానించింది.

త్రిపురలో కూడా సిపిఐ(యం) అనేక సంవత్సరాల నుండి ప్రభుత్వంలో ఉన్నది. అన్యవర్గ ధోరణులు అక్కడ కూడా పొడచూపుతున్నాయి. అయితే పార్టీ ఎప్పటికప్పుడు వాటిని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నది. పశ్చిమ బెంగాల్ అనుభవం తర్వాత మరింత జాగరూకతతో పార్టీ వ్యవహరిస్తున్నది. అన్యవర్గ ధోరణులు పొడచూపిన తర్వాత ప్రక్షాళన జేసుకోవడంతో పాటు, అటువంటి ధోరణులు పొడచూపకుండానే జాగ్రత్తపడడం ముఖ్యం. ఇందుకు పార్టీ మొత్తాన్నీ చైతన్యపర్చ డం, పెదధోరణులను సహించని చైతన్య స్థాయిని సామాన్య సభ్యుల నుండి కార్యకర్తల వరకు పెంచడం ముఖ్యం. అందుకే ఈ మధ్య జరిగిన నిర్మాణ ప్లీనంలో సైద్ధాంతిక కృషిని ముమ్మరం జేయడం గురించి పార్టీ నొక్కి చెప్పింది.

# నూరుల్ హుడా

(2వ పేజీ తరువాయి)

పడింది. కాంగ్రెస్‌కి పెట్టని కోటగా ఉన్న లాఖీపూర్ ప్రాంతంలో, 1972వ సం॥లో జరిగిన అస్సాం అసెంబ్లీ ఎన్నికలలో సిపిఐ (ఎం) అభ్యర్థిగా పోటీచేశారు. 39 శాతం ఓట్లతో ద్వితీయస్థానాన్ని కైవసం చేసుకున్నారు నూరుల్ హుడా. అదే సమయంలో1973 సంవత్సరంలో లాఖీపూర్ ఎంపి అకస్మాత్తు మరణం వలన ఉప ఎన్నికలు వచ్చాయి. "ప్రమోద్ దాస్ గుప్తా" సిల్‌చార్ వస్తూ పార్టీ ఇచ్చిన ఆదేశాన్ని అందించారు. 'ఎంపి'గా పోటీ చేయమన్న పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ నామినేషన్ దాఖలు చేశారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడైన "మహితోష్ పురకాయస్థ"తో పోటీ. గెలుపు అవకాశాలు మృగ్యమని అందరూ భావిస్తున్న సమయంలో భారీ మెజారిటీతో ఎవ్వరూ ఊహించని గెలుపును సాధించారు. ఎందరో నాయకులు నిరంతరం ప్రజల కోసం చేస్తున్న పోరాటాలు, ఉద్యమకారుల, పార్టీ సానుభూతిపరుల కృషి తన విజయానికి మూలమని, వ్యక్తిగత ప్రతిభ కాదని బలంగా విశ్వసించారు కామ్రేడ్ నూరుల్ హుడా! అస్సాం రాష్ట్రంలో బారక్ లోయలో లభించిన ఆ విజయం అపూర్వం. 1974వ సం॥ మార్చి 8న హుడా పార్లమెంటు సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు.

భారతదేశ ప్రజాస్వామ్య విధానాలను నేలకూలుస్తూ ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ చేపట్టిన చర్యల వలన దేశ రాజకీయ చిత్రం మారుతున్న తరుణమది. భారతదేశ చరిత్రలో ఎమర్జన్సీ చీకటి కాలంలో వేలమంది రాజకీయ నాయకులు, ఉద్యమకారులు 18 నెలలకు పైగా జైలులో నిర్బంధించబడ్డారు. యంపిలతో సహా వందల మంది సిపిఐ (ఎం) నాయకులు జైలు జీవితంలోకి నెట్టివేయబడ్డారు. దేశ అంతర్గత భద్రతా చట్టం (ఎంఐఎస్ఎ) పరిధిలోకి తెస్తూ, కామ్రేడ్ జ్యోతిర్మయి బసు, కామ్రేడ్ నూరుల్ హుడా సైతం చెరసాలలో బంధించబడ్డారు. కామ్రేడ్ ఎ.కె. గోపాలన్ తన చారిత్రక ఉపన్యాసంలో ఇందిరాగాంధీ నిరంకుశత్వాన్ని దుయ్యబడుతూ, కామ్రేడ్ 'బసు', 'హుడా'ల నిర్బంధాన్ని తీవ్రంగా అభిశంసించారు. ఎంతోమంది రాజకీయ నాయకులతో పాటుగా 1977వ సం॥ జనవరి 15న ఈ నాయకులూ విడుదల చేయబడ్డారు.

ఎమర్జన్సీ ఎత్తివేయబడిన వెంటనే 1977వ సం॥ మార్చిలో లోక్‌సభకు జరిగిన ఎన్నికలలో పోటీచేసిన కామ్రేడ్ హుడా 45 శాతం ఓట్లు సాధించి అత్యల్ప తేడాతో ఓడిపోయారు. వెనువెంటనే 1978 సంవత్సరంలో సిల్‌చార్ అసెంబ్లీ స్థానం నుండి పోటీ చేసి, జనతాపార్టీ అభ్యర్థి 'కబీంద్ర పురకాయస్థ'పై గెలుపొంది, కామ్రేడ్ నూరుల్ హుడా శాసనసభలో అడుగిడారు.

అస్సాం రాష్ట్ర చరిత్రలో ఇదో అపూర్వ ఘటన. కామ్రేడ్ నూరుల్ హుడాతో పాటు పదకొండు మంది సిపిఐ (ఎం) సభ్యులు చట్టసభలో ప్రాతినిధ్యం వహించారు. నిస్సహాయులు, బాధితుల సమస్యలను ప్రతిఫలింపచేసేలా ప్రధాన ప్రతిపక్ష హోదాలో వ్యవహరిస్తూ, ప్రభుత్వ విధానాలపై అలుపెరుగని పోరాటం చేశారు. కార్మిక-కర్షక అనుకూల విధానాల కోసం అధికారంలో ఉన్న జనతాపార్టీ రాష్ట్ర ప్రభుత్వంతో నిరంతరం పోరాటం చేసిన బృందమది. ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న ఆ కాలంలోనే 1979వ సంవత్సరం తర్వాత ఓ వేర్పాటువాద ఉద్యమం ఊపందుకుంది. అదే "ఆల్ అస్సామ్ స్టూడెంట్స్ యూనియన్". దేశ విభజన కోరుతూ, వేర్పాటు వాదాన్ని ఆశ్రయించి, "పరాయివారు", 'విదేశీయులు' అంటూ విచ్చిన్నగీతం ఆరంభించారు. తత్ఫలితంగా యాభైమంది విలువైన కామ్రేడ్లను పార్టీ కోల్పోయింది.

1983వ సంవత్సరం ఫిబ్రవరి మాసంలో జరగబోతున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను వ్యతిరేకిస్తూ, "నోవాగావ్" జిల్లాలోని "నెల్లీ" ప్రాంతంలో ఒకేరోజున రెండు వేలమంది పేదలు, ఆర్థికంగా వెనుకబడిన ముస్లింలు మూకుమ్మడిగా వధించబడ్డారు. ఆ విపత్కర పరిస్థితులలో జరుగుతున్న సంఘటనలను నిలవరించటానికి, రాష్ట్రంలో శాంతి, సామరస్య వాతావరణాన్ని నెలకొల్పడానికి సిపిఐ (ఎం) విశేషకృషి చేసింది. ఆ విపత్కర కాలంలో తన ఉద్యమ సహచరులతో కలిసి కామ్రేడ్ నూరుల్ హుడా సాగించిన అవిరళ కృషి అస్సాం రాష్ట్రంలో అరుణ పతాకాన్ని సమున్నతంగా ఎగిరే విధంగా చేసింది. వేర్పాటువాదుల నుండి ఎంతగా ప్రతిఘటన ఎదురైనప్పటికీ, అవిశ్రాంతంగా, రాష్ట్ర అసెంబ్లీకి, పార్లమెంటుకీ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా పోటీ చేస్తూనే ఉండేవారు కామ్రేడ్ నూరుల్ హుడా! అత్యంత తీవ్రంగా రిగ్గింగ్ జరుగుతున్న సమయంలో సైతం కామ్రేడ్ హుడా ఏమాత్రం వెనుకంజ వేయలేదు.


1970వ సంవత్సరంలో సిపిఐ(ఎం) అస్సాం రాష్ట్ర కమిటీకి, 1978లో రాష్ట్ర సెక్రటేరియట్‌కు కా॥ నూరుల్ హుడా ఎన్నికయ్యారు. 1985 సం॥లో "కచ్చార్" జిల్లా కమిటీకి కార్యదర్శిగా ఎన్నికై 1990 సంవత్సరం వరకు బాధ్యతలు నిర్వర్తించారు. 1985వ సంవత్సరం డిసెంబర్‌లో జరిగిన 12వ మహాసభలలో సిపిఐ (ఎం) కేంద్రకమిటీ సభ్యులుగా ఎంపికైన కామ్రేడ్ నూరుల్ హుడా 2012 సం॥ ఏప్రియల్‌లో జరిగిన 20వ మహాసభ వరకూ అదే హోదాలో కొనసాగారు. 1967వ సంవత్సరంలో అఖిల భారత కిసాన్ సభలో చేరి ప్రారంభించిన ప్రయాణంలో, అస్సాం ప్రావిన్షియల్ కిసాన్ సభ కమిటీ, ఎఐకెఎస్ కేంద్ర కౌన్సిల్ సభ్యుడిగా విస్తృత సేవలందించారు. 2006వ సంవత్సరం ఆగస్టు నుండీ, ఎఐకెఎస్ సెంటర్‌లో కోశాధికారిగా సైతం సేవలందించారు. తమిళనాడులోని కడలూరులో 2013లో జరిగిన మహాసభ వరకూ అదే బాధ్యతల్లో కొనసాగారు. మణిపూర్, ఛత్తీస్‌ఘఢ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలలో కిసాన్ ఉద్యమ నిర్మాణానికి, విస్తరణకు కామ్రేడ్ నూరుల్ హుడా ఎంతో కృషిచేశారు. 2013వ సంవత్సరంలో కొల్‌కత్తాకు మారిన కామ్రేడ్ నూరుల్ హుడా, 'పశ్చిమ బంగా కిసాన్ సభలో సభ్యులుగా కొనసాగారు. 2007వ సం॥లో "అఖిల భారత మత్స్యకారుల, మత్స్య పరిశ్రమ కార్మికుల ఫెడరేషన్ ఏర్పాటు చేసి, కోశాధికారిగా కొనసాగుతూ, తదనంతర కాలంలో ఉపాధ్యక్షులుగా ఎంపికై, అంతిమ శ్వాస వరకూ అదే బాధ్యతలో కొనసాగారు.

"కామ్రేడ్ హుడా" లేదా "నూరుల్ దా"గా అందరిచేత అభిమానంగా, ప్రేమపాత్రంగా పిలువబడ్డ నూరుల్ హుడా క్రమశిక్షణ గల ఉద్యమ నాయకునికి సిసలైన ఉదాహరణ. నిరాడంబరత, సమయపాలన, నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకుడు. వృద్ధాప్యం మీదపడిన తరుణంలో సైతం "తృణమూల్ కాంగ్రెస్ వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల నిరసన ప్రదర్శనలలో పాల్గొనడమే గాక, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పోరాటం చేశారు.

కామ్రేడ్ నూరుల్ హుడా విస్తృత పఠనాశాలి. అర్ధరాత్రి వరకూ వార్తాపత్రికలలో, పుస్తకాలలో, జర్నల్స్‌లో వచ్చే విశేషాలను చదవడమేగాక, సునిశితంగా నోట్స్ తయారు చేసేవారు. అత్యంత ధనిక మణిపురి ముస్లిమ్ కుటుంబంలో పుట్టి, తండ్రి బ్రిటీష్ పాలనలో మేజిస్ట్రేట్ హోదా అనుభవించినప్పటికీ, హుడా ఎంచుకున్న జీవన విధానం పూర్తిగా భిన్నమైనది. తనకు వారసత్వంగా లభించిన 75 బీగాల భూమిని పాలెకాపులకు పంచేసిన విశాల హృదయుడు.

వినమ్రతతో, ప్రజలకు అందుబాటులో నిరాడంబరంగా జీవించిన కామ్రేడ్ నూరుల్ హుడా పిన్నలనూ, పెద్దలనూ ఒకేరీతిగా గౌరవించేవారు. అందుకే వయోభేధంతో నిమిత్తం లేకుండా కార్మిక, కర్షక, శ్రామికులందరూ ఆయనను తమ ఆత్మబంధువుగా భావించేవారు. ఆయన జీవితం, ఉద్యమ కృషి, నమ్మిన సిద్ధాంతం పట్ల అచంచల నిబద్ధత భవిష్యత్ తరాలకు సదా స్ఫూర్తిదాయకం.

**(అనువాదం : డాక్టర్ శమంతకమణి)**



# ఫాసిజం వ్యాపించే అవకాశాలను తక్కువగా అంచనా వేయరాదు

**- జార్జి డిమిట్రోవ్**

“మన పార్టీలు ఫాసిజానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో అత్యంత బలహీనమైన అంశం ఏమిటంటే ఫాసిజం యొక్క రెచ్చగొట్టే విధానానికి వ్యతిరేకంగా, నిదానంగా స్పందిస్తారు. ఫాసిస్టు సిద్ధాంతానికి వ్యతిరేకంగా చేసే పోరాటాన్ని ఈ రోజుకు కూడా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫాసిజం అంత అభివృద్ధి నిరోధకమైన బూర్జువా సిద్ధాంతం ఏమేరకైనా ప్రజాపునాదిని సంపాదించుకుంటుందంటే చాలామంది కామ్రేడ్స్ నమ్మలేరు. ఇది తీవ్రమైన తప్పు. పెట్టుబడిదారీ విధానంలోని కుళ్ళు దాని సంస్కృతి, సిద్ధాంతాలలోని అంతర్గత భాగాలలోకి చొచ్చుకుపోయింది. విస్తార ప్రజానీకం పరిస్థితులు దిగజారిపోవటం ఈ సైద్ధాంతిక భావజాలం ప్రజలలోని కొన్ని తరగతులలోకి వ్యాపించేలా చేస్తుంది.

“ఫాసిజం సైద్ధాంతికంగా వ్యాపించే శక్తిని ఏ పరిస్థితులలోనూ మనం తక్కువగా అంచనా వేయరాదు. అందుకు భిన్నంగా ప్రజల ప్రత్యేక జాతీయ ఆలోచనా దృక్పథాన్ని దృష్టిలో పెట్టుకొని, స్పష్టమైన, సరైన, ప్రజారంజకమైన వాదనలతో విస్తారంగా సైద్ధాంతిక పోరాటాన్ని కొనసాగించాలి.

“ప్రతిదేశం యొక్క చరిత్ర అంతటిలోనూ ఉన్న అత్యంత గొప్పవారికి, జాతినేతలుగా కొలవబడిన వారికి తామే వారసులమని, వారిఘన చరిత్రను ముందుకు తీసుకుపోయేవారం తామేనని ఫాసిస్టులు ప్రచారం చేసుకొంటుంటారు. హీనమైనవాటిని, జాతీయ భావజాలానికి ( నేషనల్ సెంటిమెంట్) వ్యతిరేకంగా ఉన్నవాటిని ఫాసిజానికి శత్రువులపై ఆయుధాలుగా ప్రయోగిస్తారు. జర్మన్ ప్రజల చరిత్రను అబద్ధాలతో నింపి, ఫాసిస్టు దృక్కోణాన్ని కల్పించటమే లక్ష్యంగా జర్మనీలో వందలాది పుస్తకాలు ప్రచురించబడ్డాయి. ఈ పుస్తకాలలో జర్మనీ చరిత్రలోని గొప్పవారినందరినీ ఫాసిస్టుల ప్రతినిధులుగా చూయించారు.

“అత్యున్నత నాయకుడైన గారిబాల్డి వ్యక్తిత్వం నుండి అత్యంత ఎక్కువగా పొందటానికి ముస్సోలిని తన శక్తికొలది ప్రయత్నించాడు. జోన్ ఆఫ్ ఆర్క్‌ను తమ హీరోయిన్‌గా ఫ్రెంచి ఫాసిస్టులు ముందుకు తెచ్చారు. అమెరికన్ స్వాతంత్ర్య పోరాటం కోసం జరిగిన పోరాట వారసత్వాన్ని, వాషింగ్టన్, లింకన్‌ల వారసత్వాన్ని ముందుకు తీసుకురావటానికి అమెరికన్ ఫాసిస్టులు ప్రయత్నం చేస్తారు. డెబ్బైయవ దశాబ్దంలో జరిగిన జాతీయ విముక్తి ఉద్యమాన్ని, ఆ ఉద్యమంలో ప్రజల ప్రియతమ నాయకులైన లాస్సిల్ లెవిస్కీ, స్టెఫాన్ కరజ్ తదితర నాయకులను బల్గేరియన్ ఫాసిస్టులు ముందుకు తెస్తుంటారు.

“దీనంతటితో కార్మికవర్గ ఉద్యమానికి ఎటువంటి ఉపయోగమూ లేదని కమ్యూనిస్టులు భావించినట్లయితే, నిజమైన మార్క్సిస్టు– లెనినిస్టు ఉత్తేజంతో, చారిత్రకంగా సరైన పద్ధతులలో గతకాలపు తమ ప్రజల చరిత్ర ద్వారా ప్రజల చైతన్యాన్ని పెంచటానికి వారేమీ చేయకపోయినట్లయితే, గత విప్లవ పోరాట సాంప్రదాయాలను ప్రజల ప్రస్తుత పోరాటాలతో జతచేయటానికి వారేమీ చేయకపోయినట్టయితే జాతీయ చరిత్రలో విలువైన దానినంతటినీ స్వచ్ఛందంగా ఫాసిస్టు అబద్ధాల కోరులకు అప్పగించటానికి, ఫాసిస్టులు ప్రజలను పిచ్చివాళ్ళను చేయటానికి తోడ్పడినవారవుతారు.

“లేదు కామ్రేడ్స్, ప్రస్తుత, భవిష్యత్తుకు సంబంధించిన ముఖ్యమైన సమస్యలేకాక మన ప్రజలకు సంబంధించిన గత కాలపు సమస్యలు కూడా మనకు ముఖ్యమైనవే. కార్మికుల వృత్తికి మాత్రమే పరిమితమైన సమస్యలను మాత్రమే తీసుకొనే సంకుచితమైన దృక్పథాన్ని కమ్యూనిస్టులుగా మనం అనుసరించకూడదు. మనం మధ్యయుగాలలోని గిల్డులలోని చేతివృత్తుల నిపుణులు, నైపుణ్యం సంపాదించటం కోసం పనిచేసేవారి నాయకుల లాంటి, లేక సంకుచిత దృక్పథంతో కూడిన కార్మిక సంఘాల నాయకుల లాంటి వారం కాదు. అతిముఖ్యమైన వారి ప్రయోజనాలకు, ఆధునిక సమాజంలో అతి ముఖ్యమైన వర్గమైన, అత్యంత గొప్ప వర్గమైన కార్మిక వర్గానికి మనం ప్రతినిధులం. మానవజాతిని పెట్టుబడిదారీ విధానపు కడగండ్ల నుండి బయట పడవేయవలసిన కర్తవ్యం మన వర్గంపై పడింది. దోపిడీకి గురవుతున్న వారందరి ప్రయోజనాలను మనం పరిరక్షించాలి. పెట్టుబడిదారీ దేశంలో కష్టజీవులైన అత్యధిక ప్రజల ప్రయోజనాల కోసం మనం పోరాడాలి.

“కమ్యూనిస్టులమైన మనం బూర్జువా జాతీయవాదం యొక్క అన్ని రూపాలకు సైద్ధాంతికంగా బద్ధ వ్యతిరేకులుగా ఉంటాం. కాని మనం జాతీయ విధ్వంసక వాదాన్ని ( నిహిలిజం) బలపరిచేవారం కాదు. ఆ విధంగా ఎప్పుడూ వ్యవహరించం. కార్మికుల్ని, మొత్తం కార్మిక వర్గాన్నంతటిని కార్మికవర్గ అంతర్జాతీయతతో చైతన్యవంతం చేసుకోవటం ప్రతి కమ్యూనిస్టు పార్టి యొక్క ప్రాథమిక కర్తవ్యాలలో ఒకటి. కాని ఎవరైనా ఈ కారణం వలన విస్తారమైన శ్రామిక ప్రజానీకానికి చెందిన అన్ని జాతీయవాద సెంటిమెంట్లను వదులుకోవటానికి అనుమతి లభించిందని అనుకున్నా, అలా ఒత్తిడి చేయబడ్డానని ఆలోచించినా అతను నిజమైన బోల్షివిక్ కాజాలడు. లెనిన్ బోధించిన జాతుల సమస్యను గురించి అతనేమీ అర్థం చేసుకోలేదని స్పష్టమౌతుంది.”

**(జార్జి డిమిట్రావ్ రచించిన ‘ఫాసిస్టు దాడి : ఫాసిజానికి వ్యతిరేకంగా కార్మికవర్గం చేసే పోరాటంలో కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కర్తవ్యాలు’ అన్న వ్యాసం నుండి ఈ భాగం గ్రహించబడింది.)**

Marxistu, monthly organ of Communist Party of India (Marxist) A.P State Committee.
Printer & Publisher B.V. Raghavulu. RNI Reg.No. APTEL/2006/17554. Vol.10, No.10. Published on March 1, 2016